
'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 156

సోమవారం 20-2-2023



గెలుపు మలుపు మనదే


జడేజా స్పిన్ మ్యాజిక్.. రెండో టెస్టులోనూ ఆస్ట్రేలియాపై భారత్ గెలుపు - 12లో



వైద్యం నిశ్చింతగా...

నగదు రహిత మెడికల్ క్లెయిమ్‌లపై ప్రత్యేక కథనం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



విచారణకు సమయమివ్వండి

మద్యం స్కాం కేసులో విచారణకు హాజర య్యేందుకు సమయం కావాలని ఢిల్లీ డిప్యూటీ సీఎం సిసోడియా సీబీఐకి లేఖ రాశారు.

వివరాలు 6లో ▸



దక్షిణ కొరియా సైనిక విన్యాసాలు

ఉత్తరకొరియా ఖండాంతర క్షిపణి ప్రయోగం జరిపిన నేపథ్యంలో దక్షిణ కొరియా, అమెరికా సంయుక్త సైనిక విన్యాసాలు ప్రారంభించాయి.

వివరాలు 6లో ▸



శిథిలాల కింద 12 రోజులు..

భూకంపం వచ్చి 12 రోజులు గడుస్తుండగా.. ఇంకా కొందరు శిథిలాల కింద నుంచి మృత్యుంజయులుగా బయట పడుతున్నారు.

వివరాలు 6లో ▸



2 వేల కోట్లతో గుర్తు కొనేశారు

శివసేన పార్టీ పేరు, ఎన్నికల గుర్తును రూ.2 వేల కోట్లతో కొనేశారని ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన ఎంపీ సంజయ్ రౌత్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸

మేలిమి 'కానుక'

విద్యార్థులకు అత్యుత్తమంగా 'జగనన్న విద్యాకానుక'

- ఖరీదైన బ్యాగ్, సౌకర్యవంతమైన బూట్లు.. ఆకర్షణీయంగా చెక్స్ యూనిఫామ్.. పెరిగిన క్లాత్ పరిమాణం
- బెల్టుల బాధ్యత స్పోర్ట్స్ ఉపకరణాల తయారీ సంస్థకు
- 6, 7, 9 విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌తో ద్విభాషా పాఠ్య పుస్తకాలు
- ఇప్పటికే మొదలైన ముద్రణ.. 24 నుంచి జిల్లా పాయింట్లకు
- రూ.1,042.53 కోట్లతో 40 లక్షల మందికిపైగా విద్యార్థులకు కిట్లు
- జేవీకే వస్తువుల నాణ్యత, అమలు తీరుపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి
- సర్కారు చర్యలతో ప్రభుత్వ స్కూళ్లలో ఏటా పెరుగుతున్న ప్రవేశాలు
- అందుకు తగ్గట్టుగా 5% బఫర్‌తో 5.06 కోట్ల పుస్తకాల ముద్రణ
- సకాలంలో జేవీకే కిట్లు అందించేలా విద్యాశాఖ సన్నద్ధం
- ముద్రణ కేంద్రాలు, గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు




సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని ఇనుమడింపచేస్తూ అందచేస్తున్న జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మరింత నాణ్యతతో, సకాలంలో సమకూర్చేలా విద్యాశాఖ సన్నద్ధమైంది. రూ.1,042.53 కోట్ల వ్యయంతో 40 లక్షల మందికిపైగా విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందించేలా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి సరఫరాదారులందరికీ ఇప్పటికే వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. ఈసారి విద్యార్థులకు మరింత మన్నికతో కూడిన నాణ్యమైన బ్యాగ్‌లు, బూట్లను అందించనున్నారు. యూనిఫామ్‌ను ప్లెయిన్ క్లాత్ కాకుండా ఆకర్షణీయంగా రంగు రంగుల చెక్స్ డిజైన్‌తో రూపొందించారు. దుస్తులు కుట్టే సమయంలో సమస్యలు ఎదురు కాకుండా యూనిఫామ్ క్లాత్‌ను అదనంగా పెంచారు. ఇక పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్ ముద్రణ పనులు ఇప్పటికే ప్రారంభం కాగా ఈనెల 24వ తేదీ నుంచి జిల్లా పాయింట్లకు పంపిణీ మొదలవుతుంది. స్కూళ్లు తెరిచే రోజే వీటిని విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల పట్ల పెరుగుతున్న ఆదరణ, ఏటా అదనంగా చేరుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఐదు శాతం అదనపు బఫర్‌తో ప్రభుత్వం 5.06 కోట్ల పాఠ్యపుస్తకాలను ముద్రిస్తుండటం గమనార్హం. విద్యాకానుక ద్వారా అందించే

మిగతా 2వ పేజీలో ▶

కోస్తా తెలుగుదేశం.. అయోమయం

పార్టీ కార్యక్రమాలకు దూరంగా సీనియర్లు

- కీలక నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలు కరువు
- పూర్వపు గుంటూరు జిల్లాలో పార్టీని నడిపించే నాథుడేడీ?
- అడ్రస్ లేని గుంటూరు ఎంపీ గల్లా, పత్తాలేని పత్తిపాటి
- మంగళగిరిలో లోకేశ్ పరిస్థితి దయనీయం.. కృష్ణాలో కేశినేని, దేవినేని, బుద్ధా, గద్దె.. ఎవరి దారి వారిదే
- మైలవరంలో దేవినేని ఎదురీత మరో సీటు వైపు చూపు
- ఉమ్మడి పశ్చిమలో నాయకత్వం లేక ఆపసోపాలు
- కీలకమైన భీమవరంలో కనిపించని పూర్తిస్థాయి ఇన్‌ఛార్జి
- ఉమ్మడి తూర్పు గోదావరిలో యనమల వర్సెస్ జ్యోతుల
- రాజమండ్రిలో ఆదిరెడ్డి, గోరంట్ల మధ్య భగ్గుమంటున్న విభేదాలు
- పార్టీ పిలుపులకు స్పందించని శ్రేణులు



రాష్ట్రంలో ఒక అడుగు ముందుకు వేస్తే రెండడుగులు వెనక్కన్నట్లు తయారైంది టీడీపీ పరిస్థితి. వరుస ఎన్నికల్లో ఓటమిలతో చేతులు కాలుతుంటే పట్టుకోవడానికి ఎక్కడా ఆకులు దొరకని దుస్థితి. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అంటున్న బాబును నమ్ముకుంటే ఇక తమ గతి అంతేనని ఆ పార్టీలోని అత్యధికులు ఇప్పటికే ఎవరి దారి వారు చూసుకుంటుంటే నిలువరించలేని దీన స్థితి. అక్కడక్కడా మిగిలిన కొద్ది పాటి శ్రేణులకు సరైన మార్గ నిర్దేశం లేక కింది నుంచి పైదాకా అంతటా అయోమయం. తమ ఏలుబడిలో ఏం వెలగబెట్టారో చెప్పుకోలేక.. ప్రస్తుత సర్కారు కంటే మెరుగ్గా ఏం చేస్తారో ఏడవ లేక తండ్రీకొడుకులు ఉక్కిరిబిక్కిరవుతున్న సీన్లు నిత్యం కనిపిస్తూనే ఉన్నాయి. బాబు ఆశాదీపం పరిస్థితి దైవా'దీనం'గా మారింది.

10లో

న్యూస్‌రీల్

సంతోషం సమగ్ర బలం



ఎంత బలవంతుడైనా సంతోషంగా లేనప్పుడు బలహీనుడిగా మారిపోతాడు. మనిషికి సంతోషం సగం బలమే కాదు.. సమగ్ర బలం. భవిష్యత్తును సంతోషమయం చేసుకోవడంపై కథనం..

వివరాలు 11 ▸

దైవదర్శనానికి వెళ్లి వస్తూ మృత్యు ఒడికి..



బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఎస్‌ఐ భార్య, కుమార్తె, మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. టైరు పంక్చర్ అవ్వడంతో కారు డివైడర్‌ను ఢీకొట్టి అవతలి వైపున్న రహదారిపై పడగా.. అదే సమయంలో అటు వైపు వచ్చిన లారీ కారును ఢీకొట్టి ఈడ్చుకెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది.

వివరాలు 5 ▸

శ్రీశైలం వీధుల్లో మల్లన్న విహారం



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశైలంలో ఆదివారం మల్లన్న రథోత్సవం కమనీయంగా సాగింది. అశేష భక్తజనం శివనామం స్మరిస్తుండగా ఆలయ పురవీధుల్లో దివ్యరథంపై శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి విహరించారు.

వివరాలు 5 ▸

రోజుకు 2,000 ఇళ్లు పూర్తి..

నిత్యం 8వేల స్టేజ్ కన్వర్షన్లు కూడా..

- ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచేందుకు గృహ నిర్మాణ శాఖ చర్యలు
- 11మంది రాష్ట్రస్థాయి సీనియర్ అధికారులకు జిల్లాల పర్యవేక్షణ బాధ్యతలు.. ప్రతీ అధికారి వారంలో రెండురోజులు లేఅవుట్‌లలో పర్యటన
- ఉగాది నాటికి 5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నదే లక్ష్యం.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇళ్ల పథకం కోసం రూ.7,630 కోట్లు ఖర్చు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణాలు పరుగులు పెడుతున్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ మధ్య 27,895 ఇళ్లు నిర్మాణం పూర్తిచేసుకున్నాయి. అదే విధంగా 1,19,493 స్టేజ్ కన్వర్షన్లు (ఇంటి నిర్మాణం ఒక దశ నుంచి మరో దశకు వెళ్లడం) నమోదయ్యాయి. ఈ లెక్కన రోజుకు సగటున 1,860 ఇళ్ల నిర్మాణం పూర్తవుతుండగా, 7,966 స్టేజ్ కన్వర్షన్లు అవుతున్నాయి. ఈ నిర్మాణాలను మరింత వేగంగా చేపట్టడంపై గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక దృష్టిపెట్టింది. దీంతో ప్రస్తుతం రోజుకు రెండు వేల ఇళ్ల వరకూ నిర్మాణం పూర్తవుతున్నాయి. వీటిని మరింత వేగవంతం చేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం 11 మంది సీనియర్ అధికారులను జిల్లాలకు ప్రత్యేకాధికారులుగా నియమించింది. వీరు వారంలో రెండు రోజులపాటు ఆయా జిల్లాల్లోని లేఅవుట్‌లలో పర్యటించి నిర్మాణ పనులను పర్యవేక్షించేలా చర్యలు చేపట్టారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 30 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణ యజ్ఞాన్ని రాష్ట్రంలో చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా

మిగతా 2వ పేజీలో ▶



తారకరత్నకు నివాళులు అర్పిస్తున్న బాలకృష్ణ, విజయ సాయిరెడ్డి

తారకరత్నకు ప్రముఖుల నివాళి

రంగారెడ్డి జిల్లా మోకిల గ్రామానికి పలువురు సినీ నటులు, రాజకీయ నేతలు

10లో

ఇదండీ సంగతి



ఆచరణ యోగ్యం కాని పనుల గురించి ఎందుకు సార్.. మాట్లాడటం!!

పరిమళం మాటున ప్రమాదం

ప్రతి ఇంట్లోనూ పరిశుభ్రత పేరిట రసాయనాల వినియోగం

- వంటగది నుంచి బాత్‌రూమ్ వరకు క్లీనర్లు, ఫ్రెష్‌నర్లు
- సగటున నెలకు 5 కేజీలకు పైగా వాడకం.. పదేళ్లలో మూడు రెట్లు పెరిగిన వినియోగం
- 'డేంజర్' అని రాసినా జాగ్రత్తలు పాటించకుండానే వాడేస్తున్నారు
- పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్టు గుర్తింపు
- సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ పరిశోధనలో వెల్లడి

2లో



దోమల్ని తరిమేసేందుకు కాయిల్ లేదా రీఫిల్.. గచ్చును శుభ్రం చేసేందుకు ఫ్లోర్ క్లీనర్.. గ్యాస్ స్టవ్‌పై మరకల్ని తుడిచేందుకు క్రీమ్.. బాత్‌రూమ్‌ను శుభ్రం చేసేందుకు ఓ ద్రవం.. టాయిలెట్‌ను శుద్ధి చేసేందుకు మరో రసాయనం.. సువాసన వెదజల్లేందుకు రూమ్ ఫ్రెషనర్స్.. ఇలా చెప్పుకుంటూపోతే ప్రతి ఇంట్లో డజనుకు పైగా వాణిజ్య ఉత్పత్తులు వినియోగించడం పరిపాటిగా మారిపోయింది. ఇవే ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయి. ఇలాంటి వాటిని వినియోగించడం వల్ల ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది.

హిందువులంటే మీరేనా..? మేం కాదా!

- సీఎం ఎక్కడా, ఎప్పుడూ ఎవరినీ అగౌరవ పరచలేదు
- బీజేపీ పూర్తిగా దిగజారి వక్రీకరిస్తోంది
- హిందుత్వం మీ పేటెంటా?
- మానవత్వమే దైవత్వం అని చెబితే తప్పేంటి?
- నాడు బాబు 40 గుడులు కూల్చితే మాట్లాడలేదేం?
- వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు

3లో

తెలుగుగంగ.. రికార్డు మురవంగ

- మొత్తం 5.75 లక్షల ఎకరాలకుగానూ ఐదు లక్షల ఎకరాలకు పైగా సాగునీరు
- ప్రాజెక్టు చరిత్రలో ఆయకట్టుకు ఈ స్థాయిలో నీళ్లు అందించడం ఇదే తొలిసారి
- టీడీపీ సర్కార్ నిర్లక్ష్యంతో నీరుగారిన లింక్ కెనాల్, ప్రధాన కాలువ సామర్థ్యం
- 2019 వరకు సకాలంలో నిండని వెలిగోడు, బ్రహ్మంసాగర్, సోమశిల, కండలేరు
- సీఎం జగన్ బాధ్యతలు చేపట్టాక రూ.460 కోట్లతో లింక్ కెనాల్, ప్రధాన కాలువలకు లైనింగ్
- రూ.90 కోట్లతో దయాఫ్రమ్ వాల్ ద్వారా బ్రహ్మంసాగర్ మట్టికట్ట బలోపేతం

14లో

తారకరత్న మృతిపట్ల గవర్నర్ సంతాపం

సాక్షి, అమరావతి: సినీ నటుడు తారకరత్న మృతిపట్ల గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపినట్లు రాజ్‌భవన్ వర్గాలు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశాయి.

'ఏపీ ఇంధన పొదుపు'పై జర్మనీ అధ్యయనం

- కన్సల్టెన్సీని నియమించిన జర్మన్ కార్పొరేషన్ ఫర్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్
- పునరుత్పాదక ప్రాజెక్టులపై రెండు రోజులుగా అధ్యయనం
- రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, నెడ్‌క్యాప్ అధికారులతో భేటీ

సాక్షి, అమరావతి: ఇంధన పొదుపు, సామర్థ్య కార్యక్రమాల్లో జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన ఆంధ్రప్రదేశ్.. తాజాగా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. సోలార్, విండ్ తదితర పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ముమ్మరంగా చేపట్టడం, పరిశ్రమల్లో ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలు వంటి అంశాల్లో ఏపీ సాధించిన విజయాలు జర్మనీని ఆకర్షించాయి. వీటిపై అధ్యయనం చేయడానికి ప్రముఖ కన్సల్టెన్సీ ప్రైస్ వాటర్ కూపర్స్(పీడబ్ల్యూసీ)ను.. జర్మన్ కార్పొరేషన్ ఫర్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ నియమించింది. ఈ అధ్యయనంలో భాగంగా పీడబ్ల్యూసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రభాత్ నేతృత్వంలోని బృందం రెండు రోజులుగా విజయవాడలో రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, నెడ్‌క్యాప్ అధికారులతో చర్చిస్తోంది. పారిశ్రామిక రంగంలో ఏపీ చేపట్టిన ఇంధన సామర్థ్య విధానాలు, సాధించిన విజయాలను అధ్యయనం చేస్తోంది. ఏపీ ఇంధన పరిరక్షణ మిషన్ 'టార్చ్ బేరర్' అంటూ ప్రభాత్ అభినందించారు. ఇంధన పొదుపు విషయంలో అవసరమైన సహకారం అందించేందుకు ఏపీ సిద్ధంగా ఉందని ప్రభాత్‌కు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ప్రభుత్వ విభాగాల్లో ఇంధన పరిరక్షణ సెల్స్ ఏర్పాటు చేయడానికి జీవో జారీ చేసిన ఏకైక రాష్ట్రం ఏపీ అని ఇంధన పరిరక్షణ మిషన్ సీఈఓ ఎ.చంద్రశేఖరరెడ్డి వివరించారు. ఏపీలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు ఇస్తున్న ప్రాధాన్యతను పీడబ్ల్యూసీ బృందానికి నెడ్‌క్యాప్ అధికారులు తెలియజేశారు.

రాజమహేంద్రవరంలో 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'


పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న అభిలాష్ పిళ్లై తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఏపీ సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్‌ఎస్‌డీ) విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్టు స్కూల్ ఆఫ్ డ్రామా అఫైర్స్ డైరెక్టర్ అభిలాష్ పిళ్లై ప్రకటించారు. రాజమహేంద్రవరంలోని శ్రీ వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో '22వ భారత్ రంగ్ మహోత్సవ్' ఆదివారం సాయంత్రం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పిళ్లై మాట్లాడుతూ.. భారతీయ నాటక రంగ ప్రాశస్త్యాన్ని ఎన్‌ఎస్‌డీ ప్రపంచానికి పరిచయం చేస్తూ ప్రాభవాన్ని చాటుతోందన్నారు. ఢిల్లీ, జైపూర్, రాంచీ, గౌహతి, జమ్మూ, శ్రీనగర్, పోఖ్రాన్, నాసిక్ ప్రాంతాల్లో ఎన్‌ఎస్‌డీ ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేసి తగిన శిక్షణ ఇస్తోందని పిళ్లై చెప్పారు. నాటక రంగంలోని సంఘటిత, అసంఘటిత కళాకారులకు ప్రోత్సాహం ఇచ్చి, వారి నైపుణ్యానికి మెరుగులు దిద్దేందుకు ఈ సంస్థ ప్రయత్నిస్తోందన్నారు. తద్వారా ప్రేక్షకులు తిరిగి స్టేజ్ నాటకాలు, నాటికలను ఆదరించే పరిస్థితి కల్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బెంగళూర్ ఎన్‌ఎస్‌డీ సెంటర్ డైరెక్టర్ వీణాశర్మ, ఏపీ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర సురభి థియేటర్ గ్రూప్ (హైదరాబాద్) ఆధ్వర్యాన 'భక్తప్రహ్లాద' నాటకాన్ని సురభి జయచంద్ర దర్శకత్వంలో ప్రదర్శించారు.

గంగమ్మ జాతరలో విషాదం

సిరి బండి కిందపడి జెడ్పీటీసీ మృతి



పులివెందుల రూరల్: వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలం తుమ్మలపల్లె గ్రామ సమీపంలోని గంగమ్మ చింతలలో నిర్వహించిన గంగమ్మ జాతర (తిరునాళ్ల)లో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. సిరిబండి గ్రామోత్సవాన్ని తుమ్మలపల్లె నుంచి గంగమ్మచింతల్లోని ఆలయం వద్దకు తీసుకెళ్తుండగా.. సిరి బండి నడుపుతున్న పులివెందుల జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి అదుపు తప్పి బండికింద పడిపోయారు. తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే 108 వాహనంలో పులివెందులలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మహేశ్వరరెడ్డి మరణంతో ఆయన భార్య ఉమాదేవి, కుమార్తె హేమలత, కుమారుడు హరికుమారరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. జెడ్పీటీసీ మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కరరెడ్డి, తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మహేశ్వర్‌రెడ్డి మృతిపై కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహేశ్వర్‌రెడ్డి మృతి పార్టీకి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటన్నారు.

రోజుకు 2000 ఇళ్లు పూర్తి..

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే రెండు విడతల్లో 18.63 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులివ్వగా 17.22 లక్షల ఇళ్లకు శంకుస్థాపనలు చేశారు. ఇవి ప్రస్తుతం వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

డిసెంబర్ నుంచి పుంజుకున్న నిర్మాణాలు

గత ఏడాది రాష్ట్రంలో భారీగా వర్షాలు, గోదావరి వరదలు ఇళ్ల నిర్మాణాలపై తీవ్ర ప్రభావం చూపాయి. పలు జిల్లాల్లో లేఅవుట్‌లలో నిర్మాణ మెటీరియల్ తరలించడానికి వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. అక్టోబర్, నవంబర్ నెలల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో డిసెంబర్ నుంచి నిర్మాణాలు పుంజుకున్నాయి. డిసెంబర్ 1 నుంచి 15 మధ్య 83,166 స్టేజ్ కన్వర్షన్లు, 12,296 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేవి. ఇలా క్రమంగా పెరుగుతూ ఫిబ్రవరి 1–15 తేదీల నాటికి 1.19 లక్షల స్టేజ్ కన్వర్షన్లు, 27వేలకు పైగా నిర్మాణాలు పూర్తయ్యే స్థాయికి పనుల వేగం పెరిగింది. వచ్చే ఉగాది నాటికి రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ లక్ష్యం నిర్దేశించుకుంది. ఇప్పటికే 2,74,210 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

ఈ ఏడాది రూ.7,630 కోట్ల ఖర్చు


పేదల ఇంటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.7,630 కోట్లు ఖర్చుచేసింది. ఇందులో రూ.5,325 కోట్లు లబ్ధిదారులకు చెల్లింపులు కాగా.. సబ్సిడీపై 7.45 లక్షల మెట్రిక్ టన్నుల సిమెంట్ సరఫరాకు రూ.373 కోట్లు, 94,242 టన్నుల స్టీల్ సరఫరాకు రూ.673 కోట్లు.. ఇసుక, ఇతర నిర్మాణ సామాగ్రి అందించడానికి రూ.620 కోట్ల మేర ఖర్చయింది. ఇక ఈ పథకం కింద ఇళ్లులేని పేదలకు ఉచితంగా రూ.లక్షలు ఖరీదుచేసే స్థలాన్ని ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. అదనపు సాయం కింద పావలా వడ్డీకి రూ.35వేల చొప్పున బ్యాంకు రుణ సాయం అందిస్తున్నారు. దీంతో పాటు ఉచితంగా ఇసుక, సబ్సిడీపై స్టీల్, సిమెంట్, ఇతర నిర్మాణ సామాగ్రి సరఫరా చేస్తున్నారు. మొత్తంగా పథకం ద్వారా పేదలకు ప్రభుత్వం రూ.1.05 లక్షల కోట్ల మేర మేలు చేస్తోంది.

631 లేఅవుట్‌ల సందర్శన

ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయడానికి వీలుగా చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా ఇప్పటికే శనివారాన్ని హౌసింగ్ డేగా నిర్వహిస్తున్నాం. గడిచిన నాలుగు శనివారాల్లో 631 లేఅవుట్‌లను జిల్లా, మండల, గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి అధికారులు, సిబ్బంది సందర్శించి అక్కడి సమస్యలను మా దృష్టికి తెస్తున్నారు. వాటిని జిల్లా కలెక్టర్ స్థాయిలోనే పరిష్కరించడానికి ప్రత్యేక నిధిని కేటాయించాం.

– అజయ్ జైన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ

కడుపు కోత తగ్గించేలా!



రాష్ట్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో 56 % సిజేరియన్ ప్రసవాలే

- 198 ప్రైవేట్ ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో ప్రసవాలపై వైద్య శాఖ అధ్యయనం
- 74 ఆస్పత్రుల్లో 91 నుంచి 100 శాతం కడుపు కోతలే
- 41 చోట్ల 70 నుంచి 80 శాతం సిజేరియన్లు
- కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

సాక్షి, అమరావతి: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల ప్రకారం మొత్తం ప్రసవాల్లో సిజేరియన్లు 10 నుంచి 15 శాతంలోపే ఉండాలి. కానీ.. మన రాష్ట్రంలో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైన మొత్తం ప్రసవాల్లో 2021–22లో 43.82 శాతం, 2022–2023 (ఏప్రిల్ నుంచి డిసెంబర్)లో 47.39 శాతంగా నమోదైంది. హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఎంఐఎస్) సమాచారం ప్రకారం.. 2021–22 సంవత్సరంలో రాష్ట్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరిగిన మొత్తం ప్రసవాల్లో 50.81 శాతం సిజేరియన్లుగా నమోదయ్యాయి. 2022–23లో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ పరిశీలిస్తే 55.83 శాతానికి పెరిగింది. ప్రభుత్వాస్పత్రుల్లో సిజేరియన్ ప్రసవాల నియంత్రణకు వైద్య శాఖ ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. మరోవైపు ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్ల నియంత్రణ చర్యల్లో భాగంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా 26 జిల్లాల్లో ప్రసూతి సేవలందిస్తున్న నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నిర్వహించిన సిజేరియన్ ప్రసవాలపై ఆడిట్ నిర్వహించింది.

74 ఆస్పత్రుల్లో 91నుంచి 100 శాతం సిజేరియన్లే

2022–23 సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య రాష్ట్రంలో ప్రసూతి సేవలు అందిస్తున్న 198 ఆస్పత్రుల్లో సిజేరియన్ ప్రసవాలపై వైద్య శాఖ అధ్యయనం నిర్వహించింది. వీటిలో ఏకంగా 74 ఆస్పత్రుల్లో 91నుంచి 100 శాతం సిజేరియన్లే చేసినట్టు తేలింది. అత్యధికంగా కర్నూలు జిల్లాలో 14, పల్నాడులో 9, అనకాపల్లిలో 7, గుంటూరులో 8 ఆస్పత్రులు ఈ జాబితాలో ఉన్నాయి. 45 ఆస్పత్రుల్లో 81నుంచి 90 శాతం, 38 ఆస్పత్రుల్లో 71నుంచి 80%, 41 ఆస్పత్రుల్లో 70 శాతానికిపైగా సిజేరియన్లు చేసినట్టు అధికారులు గుర్తించారు. జిల్లాల వారీగా అత్యధికంగా సిజేరియన్లు నిర్వహించిన ఆస్పత్రులను పరిశీలిస్తే.. శ్రీసత్యసాయి జిల్లాలోని ఓ ఆస్పత్రిలో 714 ప్రసవాలకు గాను.. 712 సిజేరియన్లు చేశారు. కర్నూలు జిల్లాలోని మరో ఆస్పత్రిలో 322 కాన్పులకు గాను 321, అన్నమయ్య జిల్లాలో 290 ప్రసవాలకు గాను 290 సిజేరియన్లు చేశారు.

> రాష్ట్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువగా సిజేరియన్ ప్రసవాలే చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దీనిని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా చేస్తున్న సిజేరియన్ల నియంత్రణకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం వైద్య శాఖ ప్రత్యేక ప్రణాళిక రచించింది.

కుటుంబ సభ్యుల నుంచీ ఒత్తిడి!

సిజేరియన్ చేయాలని గర్భిణుల కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి ఉండటం వల్లే ఇలా చేయాల్సి వస్తోందని వైద్యులు చెబుతున్నారు. తొలి కాన్పు సిజేరియన్ అయితే.. రెండో కాన్పు కూడా అలా చేయక తప్పడం లేదంటున్నారు. ఇందులో కొంత నిజం ఉన్నప్పటికీ వైద్యులు అందుకు అంగీకరించకూడదని.. సంబంధిత కేసుల్లో ఆయా కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కొన్ని ఆస్పత్రులైతే సిజేరియన్లు చేయడానికే ఎక్కువ మొగ్గు చూపుతున్నాయి.

కారణాలివీ..

- ▲ సాధారణ ప్రసవంతో పోలిస్తే సిజేరియన్‌కు ఆరోగ్యశ్రీలో ప్రభుత్వం చెల్లిస్తున్న ఫీజు ఎక్కువగా ఉండటం. సాధారణ ప్రసవం చేయాలంటే కొన్ని గంటల సమయం పడుతుంది. ఈ క్రమంలో గర్భిణి, కడుపులోని బిడ్డ ఆరోగ్య పరిస్థితిని వాకబు చేస్తూ ఉండాలి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిపుణులైన నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండరు. దీంతో అన్ని గంటలపాటు ప్రైవేట్ వైద్యులు ఓపికతో ఎదురుచూసే పరిస్థితులు లేకపోవడం.
- ▲ చిన్నపాటి నర్సింగ్ హోమ్‌లు, ఆస్పత్రులకు ప్రత్యేకంగా 24/7 అనస్తీషియా వైద్యుడు అందుబాటులో లేకపోవడం.
- ▲ యువ వైద్యుల్లో సాధారణ ప్రసవాలు నిర్వహించడానికి తగినంత అనుభవం, ఆత్మవిశ్వాసం లేకపోవడం.
- ▲ సాధారణ ప్రసవానికి సిద్ధపడేలా సిజేరియన్ ప్రసవంతో సంభవించే సమస్యలపై గర్భిణి, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చే ప్రయత్నం కూడా చేయకపోవడం.

పరిమళం మాటున ప్రమాదం



ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

వంటగది, బాత్రూమ్, హాల్, పడక గదుల్లో సగటున ఒక్కో ఇంటిలో 8 కేజీల వరకు ప్రమాదకర రసాయనాలు, పౌడర్లు వినియోగిస్తున్నారు. డ్రెయిన్ క్లీనర్లు, ఓవెన్ శుభ్రం చేసుకునేవి, ఫ్లోర్ క్లీనర్లు వంటి వాటిలోని రసాయనాలు ఇంట్లోని వారిపై తీవ్ర దుష్ప్రభావం చూపుతున్నట్టు సీఎస్‌ఈ గుర్తించింది. పెద్దవారు వాడే డియోడరెంట్లు, బాడీ స్ప్రేలతో ఇంట్లోని పిల్లల ఆరోగ్యం దెబ్బతింటోంది. వీటి వినియోగం వల్ల వెంటనే చర్మం, కళ్లు మండటంతో పాటు దీర్ఘకాలంలో పిల్లల్లో ఆస్తమా వంటి రోగాలు కనిపిస్తున్నట్టు యూఎస్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (ఈపీఏ) ప్రకటించింది. పిల్లల్లో కనిపిస్తున్న ఊపిరి సంబంధిత సమస్యలతో ఆస్పత్రులకు వస్తున్నవారు గతంలో రెండు మూడు శాతం ఉండగా.. అది 10.4 శాతానికి పెరిగినట్టు తేలింది.

సాక్షి, అమరావతి:ఇంట్లో పరిశుభ్రత.. సువాసన కోసం వాడే వాణిజ్య ఉత్పత్తుల వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోతోంది. వీటి వాడకం వల్ల వయసుతో సంబంధం లేకుండా ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నట్టు వెల్లడైంది. ఆయా ప్యాకెట్లు, డబ్బాలపై 'ఇది విషం. ఇంట్లో పిల్లలకు దూరంగా ఉంచాలి' అని.. దీనిని 'మండే గుణం ఉంది' అని జాగ్రత్తలు రాసి ఉన్నా.. వాటిని పట్టించుకునేవారు 10% కూడా ఉండటం లేదు. సామాజిక మాధ్యమాల్లో సినీ తారలతో సైతం ఆయా కంపెనీలు ప్రచారం చేస్తున్నాయి. అందుకే విదేశాల్లో నిషేధం విధించిన వాణిజ్య ఉత్పత్తులు సైతం మనదేశంలో విచ్చలవిడిగా అమ్ముడవుతున్నాయి. ఇంటి పరిశుభ్రత కోసం, సువాసన కోసం వాడే వాణిజ్య ఉత్పత్తుల వినియోగం పరిమితి దాటుతోందని, వీటివల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యం బారినపడుతున్నారని ఢిల్లీలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్‌ఈ) హెచ్చరిస్తోంది.

పట్టణాల్లో మరీ ఎక్కువ

మనదేశంలో అతి శుభ్రత, ఇంట్లో కొత్త అలవాట్లను ప్రవేశపెట్టడంలో పట్టణ ప్రజలే ముందున్నారని సీఎస్‌ఈ పేర్కొంది. కొన్నేళ్లుగా తడి, పొడి చెత్తతోపాటు ఈ వేస్ట్‌పై ప్రజల్లో కల్పిస్తున్న అవగాహనతో చాలావరకు మార్పు వచ్చినా.. ఇంటి శుభ్రత కోసం ప్రమాదకర రసాయనాల వాడటం మాత్రం పెరుగుతున్నట్టు గుర్తించింది. ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా అందుతున్న చెత్తలో నెలకు సగటున ఒక్కో ఇంటి నుంచి 5 కేజీలకు పైగా వాడేసిన ఫ్లోర్ క్లీనర్లు, యాసిడ్ బాటిళ్లు, రూమ్ ఫ్రెషనర్స్, మస్కిటో రీఫిల్స్, పెయింట్లు, వార్నిష్ డబ్బాలు, గడువు ముగిసిన మందులు వంటివి వస్తున్నట్టు గుర్తించారు. ప్రమాదకరమైన గృహ వ్యర్థాలలో పారేసిన పెయింట్ డబ్బాలు, పురుగు మందుల డబ్బాలు, సీఎఫ్‌ఎల్ బల్బులు, ట్యూబ్‌లైట్లు, విరిగిన పాదరసం థర్మామీటర్లు, సిరంజీలు పట్టణ గృహాల నుంచి సేకరించే చెత్తలో అధికంగా వస్తున్నట్టు గుర్తించారు. ఇవన్నీ పిల్లలు, వృద్ధుల ఆరోగ్యాన్ని వేగంగా దెబ్బతీసేవే. మనదేశంలో పెస్ట్ కంట్రోల్ సెంటర్లకు వస్తున్న కాల్స్ సైతం ఏటా పెరుగుతున్నాయని, 2012లో రోజుకు 7.6 కాల్స్ వస్తే.. 2022లో 23కు చేరినట్టు సీఎస్‌ఈ గుర్తించింది. బొద్దింకలు, బల్లులు, చెద పురుగులు వంటి వాటి నిర్మూలన కోసం అత్యంత విషపూరితమైన రసాయనాలను ఇంట్లో వాడుతున్నట్టు తేలింది.

సంప్రదాయ విధానాలే మేలు

అమెరికాలో సగటున ప్రతి కుటుంబం వాడే క్లీనర్స్‌లో 3 నుంచి 11 నుంచి 38 లీటర్ల విష పదార్థాలు ఉన్నట్టు యూఎస్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ప్రకటించింది. ఇవి గాలిలో కలిసినప్పుడు ప్రమాదకర అవశేషాలను విడుదల చేస్తాయని పేర్కొంది. ఆ సంస్థ దాదాపు 2 వేలకు పైగా శుభ్రపరిచే ఉత్పత్తులను పరిశీలించగా, వాటిలో 10 శాతం పైగా విషపూరితమైనవిగా గుర్తించింది. అత్యంత ప్రమాదకరమైన ఉత్పత్తులను ప్రభుత్వం రద్దు చేయగా.. మిగిలిన వాటిపై 'హెచ్చరిక, జాగ్రత్త, ప్రమాదం, విషం' అన్న పదాలను పెద్దగా ముద్రించేలా కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. మన దేశంలోనూ ఇలాంటి ఉత్పత్తులే ఉన్నాయని పేర్కొంది. ప్రత్యామ్నాయంగా సహజ మార్గాలను అనుసరించాలని సీఎస్‌ఈ విజ్ఞప్తి చేస్తోంది. డ్రెయిన్ శుభ్రం చేసేందుకు ప్లంగర్ లేదా ప్లంబర్ స్నేక్, అద్దాల శుభ్రతకు వెనిగర్ లేదా నిమ్మరసం వంటివి వాడాలని సూచిస్తోంది.

పల్నాడు, పుల్లలచెరువుకు వరం వరికపూడిసెల ప్రాజెక్ట్

మంత్రి ఆదిమూలపు సురేష్



సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లాతోపాటు ప్రకాశం జిల్లాలోని పుల్లలచెరువు మండల ప్రజలకు వరికపూడిసెల ప్రాజెక్ట్ ఒక వరమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పల్నాడు జిల్లాలో వరికపూడిసెల ప్రాజెక్ట్ ద్వారా రెండు ఫేజ్‌లలో మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, గురజాల, బొల్లాపల్లి మండలాలకు సాగునీరు అందే విధంగా రూపకల్పన చేశారు. అయితే ఈ ప్రాజెక్ట్ ద్వారా వచ్చే నీరు పుల్లలచెరువు మండలంలోని కొన్ని గ్రామాలకు కూడా అందించాలన్న గ్రామస్తుల విజ్ఞప్తిని మంత్రి సురేష్... ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పుల్లలచెరువు మండలంలోని శతకోడు, ముటుకుల, మర్రివేముల గ్రామాలను డీపీఆర్‌లో చేర్చారు. దీనిపై మంత్రి ఆదివారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మర్రివేములలో 2,476.74 ఎకరాలు, ముటుకులలో 6,641.96 ఎకరాలు, శతకోడులో 1,338.06 ఎకరాలు, మొత్తం 10,456 ఎకరాలకు సాగునీరు అందుతుందని అధికారులు వివరించారు. ఆ మూడు గ్రామాల్లోని చెరువులను కూడా ఈ ప్రాజెక్ట్ నీటితో నింపడం ద్వారా చుట్టుపక్కల దాదాపు 14 గ్రామాలకు తాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించి అంచనా వ్యయం తెలియజేస్తే తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ ఎస్‌ఈ ఉమామహేశ్వరరావు, ఈఈ రమేష్, డీఈ శ్రీనివాసరావు, మేఘా ఇంజనీరింగ్ కంపెనీ జీఎం కృష్ణారావు, పీఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధి శేఖర్ పాల్గొన్నారు.


డ్రైవింగ్‌కూ స్కోర్!

- సిబిల్ స్కోర్ తరహాలో ఏర్పాటుకు కేంద్రం సూత్రప్రాయంగా నిర్ణయం
- డ్రైవింగ్ స్కోర్ ఆధారంగా బీమా ప్రీమియం, వాహనాల ధరల్లో రాయితీ
- రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్రం ప్రణాళిక
- వాహనాల తయారీ సంస్థలు, బీమా కంపెనీలతో చర్చలు
- పైలట్ ప్రాజెక్టుగా ఢిల్లీలో అమలుచేయాలనుకుంటున్న కేంద్ర రవాణా శాఖ



సిబిల్ స్కోర్ తరహాలోనే డ్రైవింగ్‌కూ స్కోరింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. సిబిల్ స్కోర్ ఎంత ఎక్కువ ఉంటే బ్యాంకులు అంత సులువుగా రుణాలు ఇస్తాయి. అలాగే డ్రైవింగ్ స్కోర్ ఎక్కువ ఉంటే వాహనాల బీమా, కొత్త వాహనాల కొనుగోలులో రాయితీ ఇవ్వాలని కేంద్రం భావిస్తోంది. రహదారి భద్రతలో భాగంగా కేంద్రం ఈ వినూత్న విధానాన్ని తెరపైకి తెచ్చింది. త్వరలోనే దీనిని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని నిర్ణయించింది. - సాక్షి, అమరావతి

ప్రమాదాలను తగ్గించేలా..



దేశంలో రోడ్డు ప్రమాదాలు అంతకంతకూ పెరుగుతుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జాతీయ నేర గణాంకాల సంస్థ నివేదిక ప్రకారం 2021లో దేశంలో 4.12 లక్షల రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. 1.53 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. 3.84 లక్షల మంది గాయపడ్డారు. డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే 70 శాతం ప్రమాదాలు జరిగాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రహదారి భద్రత లక్ష్యాలు సాధించాలంటే డ్రైవర్లకు తగిన అవగాహన కల్పించడం.. వారిని నియంత్రించడం ప్రధానమని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో డ్రైవింగ్ క్రమశిక్షణను ఎప్పటికప్పుడు అంచనా వేసే వ్యవస్థను నెలకొల్పాలని కేంద్రం నిర్ణయించింది. 'రహదారి భద్రతా ప్రణాళిక 2.0' కింద ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. దేశంలో డ్రైవింగ్ లైసెన్సు ఉన్న వారంతా దీని పరిధిలోకి వస్తారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర భారీ వాహనాల డ్రైవర్ల క్రమశిక్షణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. ట్రాఫిక్ పోలీసులు విధించిన చలానాలు, రోడ్డు ప్రమాదాలకు కారణమైన సందర్భాలు, పోలీసులు నమోదు చేసిన కేసులు తదితరాలను పరిగణనలోకి తీసుకుంటారు. వాటి ఆధారంగా డ్రైవింగ్ క్రమశిక్షణకు స్కోర్ ఇస్తారు.

స్కోర్ ఆధారంగా ప్రోత్సాహకాలు

డ్రైవింగ్ క్రమశిక్షణ స్కోర్ బాగున్నవారికి వాహన బీమాలో రాయితీలిస్తారు. స్కోర్ ఎంత ఎక్కువ ఉంటే బీమా ప్రీమియం అంత తక్కువగా ఉంటుంది. అలాగే కొత్త వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు కూడా ధరలో రాయితీ ఇస్తారు. వీటిపై కేంద్ర రవాణా శాఖ వాహనాల తయారీ కంపెనీలు, బీమా కంపెనీలతో చర్చలు జరుపుతోంది. దీనిపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనున్నారు. అనంతరం పైలట్ ప్రాజెక్టుగా ఈ విధానాన్ని ఢిల్లీలో అమలు చేయాలని భావిస్తున్నారు. లోటుపాట్లను సరిదిద్దుకుని 2025 నాటికి దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

ఏడీఏఎస్ ఏర్పాటు..

రెండో దశలో కార్లు, ఎస్‌యూవీలు, ఇతర భారీ వాహనాల్లో అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టం (ఏడీఏఎస్)ను ఏర్పాటు చేస్తారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసేటప్పుడే ఏడీఏఎస్ వ్యవస్థ కోసం కాస్త అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే కొనుగోలు చేసిన వాహనాల యజమానులు కూడా ఏడీఏఎస్‌ను తమ వాహనాల్లో ఏర్పాటు చేసుకోవాలి. ఇది డ్రైవర్ నావిగేషన్‌కు సహకరిస్తుంది. అలాగే డ్రైవింగ్ సీటులో ఎవరు ఉన్నారో రికార్డు చేస్తుంది. తద్వారా క్రమశిక్షణారహితంగా వాహనం నడిపినప్పుడు, ప్రమాదానికి గురైనప్పుడు ఎవరు డ్రైవింగ్ చేస్తున్నారన్నది స్పష్టంగా తెలుస్తుంది. ఏడీఏఎస్‌ను ఇప్పటికే విద్యుత్ వాహనాల్లో ప్రవేశపెట్టారు. త్వరలో పెట్రోల్, డీజిల్ వాహనాల్లో కూడా ఏర్పాటు చేయనున్నారు. ఏడీఏఎస్ సమాచారాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని డ్రైవింగ్ క్రమశిక్షణ స్కోర్‌ను నిర్ణయిస్తారు.

మేలిమి 'కానుక'

▶ మొదటి పేజీ తరువాయి

ప్రతి ఒక్క వస్తువు నాణ్యతను స్వయంగా పరిశీలిస్తూ ఓ మేనమామలా సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న విషయం తెలిసిందే. మూడున్నరేళ్లుగా జేవీకే అమలు తీరును గమనిస్తూ ఫీడ్ బ్యాక్ ఆధారంగా మార్పుచేర్పులను సూచిస్తున్నారు.

- స్థానిక మార్కెట్లో రూ.650 విలువ చేసే నాణ్యమైన బ్యాగ్‌లను సరఫరా చేసేందుకు మంజీత్ ప్లాస్టిక్ ఇండస్ట్రీస్, కోర్స్ ఇండియా లిమిటెడ్, అభిలాష కమర్షియల్ ప్రైవేట్ లిమిటెడ్, ఎక్స్‌పో ఫుట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్, వినిష్మా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేసి ఆర్డర్లు ఇచ్చారు. స్క్వేర్ టైపులో పెద్ద బ్యాగులు రీ డిజైన్ చేశారు.
- యూనిఫామ్‌కి సంబంధించి బాలికల టాప్, బాలుర షర్టులను ప్లెయిన్ క్లాత్ నుంచి చెక్స్ (గడులు) రూపంలోకి మార్పు చేశారు. దుస్తులు కుట్టే సమయంలో సమస్యలు ఎదురు కాకుండా క్లాత్ పరిమాణాన్ని 20% పెంచారు. మఫత్‌లాల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, నందన్ డెనిమ్ లిమిటెడ్, కంచన్ ఇండియా లిమిటెడ్, అరవింద్ కాట్సిన్ ఇండియా లిమిటెడ్, పదమ్ చంద్ మిలాప్‌చంద్ జైన్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేశారు. యూనిఫామ్ 50 రోజుల్లో జిల్లాలకు సరఫరా కానుంది.
- బూట్లు మరింత సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు చేపట్టారు. సరఫరాదారులు పాత మెటీరియల్ వాడకుండా నియంత్రించారు. డైమండ్ ఫుట్‌కేర్ ఉద్యోగ్ ప్రైవేట్ లిమిటెడ్, మంజీత్ ప్లాస్టిక్ ఇండస్ట్రీస్, ఎక్స్‌ప్లో ఫుట్ వేర్ ప్రైవేట్ లిమిటెడ్, పవర్ టెక్ ఎలక్ట్రో ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, లెహర్ ఫుట్‌వేర్ లిమిటెడ్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేసి పంపిణీ ఆర్డర్లు ఇచ్చారు.
- అటల్ ప్లాస్టిక్స్, ఓం స్పోర్ట్స్ సంస్థలను బెల్టుల తయారీకి టెండర్ల ద్వారా ఎంపిక చేశారు. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ ప్రెస్‌కి గతంలో మాదిరిగా నామినేషన్ ప్రాతిపదికన అప్పగించారు.
- 1 నుంచి 9వ తరగతి వరకు బైలింగ్వువల్ పాఠ్య పుస్తకాలు ప్రచురిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా 6, 7, 9 తరగతుల విద్యార్థుల కోసం ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌తో బైలింగ్వువల్ పాఠ్య పుస్తకాలు ముద్రిస్తున్నారు. తమిళనాడు న్యూ ప్రింట్ పేపర్స్ లిమిటెడ్ కాగితాన్ని సరఫరా చేస్తోంది. 40 లక్షల మందికిపైగా విద్యార్థులకు రెండు సెమిస్టర్ల విధానంలో పుస్తకాలు తయారు చేస్తున్నారు. దాదాపు 4.83 కోట్ల పుస్తకాలు ముద్రించి అందించనున్నారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో చేరే అదనపు విద్యార్థులకు 5 % అదనపు బఫర్‌తో ప్రభుత్వం 5.06 కోట్ల పాఠ్యపుస్తకాలను ముద్రిస్తోంది. అన్ని మీడియం పాఠశాలలకు బైలింగ్వువల్ పుస్తకాలు అందించనున్నారు. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో చదివే విద్యార్థులకు తెలుగు, ఆంగ్లంలో ద్విభాషా పాఠ్య పుస్తకాలు అందిస్తారు. ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉర్దూ, ఇంగ్లీష్‌లలో ద్విభాషా పాఠ్య పుస్తకాలను సరఫరా చేస్తారు. బైలింగ్వువల్ పుస్తకాలను తెలుగు, ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళ భాషల్లో ముద్రించనున్నారు. 9వ తరగతికి కొత్తగా ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ పుస్తకాలను 2023–24లో పరిచయం చేస్తున్నారు.
- 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్ ముద్రణ ప్రారంభమైంది. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి 88 ప్రింటర్లకు ఈ పనులు అప్పగించారు. 14,611 మెట్రిక్ టన్నుల ఇన్‌సెట్ పేపర్, 1,401 మెట్రిక్ టన్నుల టైటిల్ కవర్ పేపర్ సరఫరా కోసం తమిళనాడు న్యూ ప్రింట్ – పేపర్స్ లిమిటెడ్‌కి ఆర్డర్లు ఇచ్చారు. ఈనెల 24 నుంచి జిల్లా పాయింట్లకు పుస్తకాల పంపిణీ ప్రారంభమవుతుంది. మే 31 కల్లా అన్ని స్కూల్ పాయింట్లకు పుస్తకాలు చేరనున్నాయి.


ప్లెయిన్ నుంచి చెక్స్ రూపంలో మార్పు చేసిన యూనిఫామ్

గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు

జగనన్న విద్యా కానుక ద్వారా అందచేసే కిట్లలో నాణ్యత తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అధికారులు ఎప్పటికప్పుడు ప్రతి దశలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. సీఎం ఆదేశాలతో పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఈ దిశగా ప్రత్యేక దృష్టి సారించారు. పాఠ్య పుస్తకాల సంచాలకులు రవీంద్రనాథ్‌రెడ్డి, సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు సంచాలకులు డా.కె.వి.శ్రీనివాసులురెడ్డితో కలసి వివిధ ముద్రణ కేంద్రాలు, గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

తరగతులవారీగా అవసరమైన పాఠ్య పుస్తకాలు

తరగతి	ఎన్‌రోల్‌మెంట్ ప్రకారం పుస్తకాల సంఖ్య	5 శాతం బఫర్ స్టాక్‌తో కలిపి
1	24,30,144	25,51,651
2	25,28,714	26,55,150
3	46,69,730	49,03,217
4	51,96,545	54,56,372
5	52,42,736	55,04,873
6	53,35,790	56,02,580
7	50,18,602	52,69,532
8	64,70,185	67,93,694
9	76,29,870	80,11,363
10	34,10,557	35,81,085
క్లాస్1 డిక్షనరీ	3,05,910	3,21,206
మొత్తం	4,82,38,783	5,06,50,723

క్లుప్తంగా...

'మెరుగైన సేవలకు అత్యధిక ప్రాధాన్యత'

సాక్షి, అమరావతి: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు అధికారులను ఆదేశించారు. నిర్దీత సమయానికి బస్సులు నడపడం, బస్సులు, బస్‌స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచడం, భద్రతా ప్రమాణాలను పాటించడం, ప్రయాణికులతో మర్యాదపూర్వక ప్రవర్తన, ఆన్‌లైన్ టికెటింగ్‌లో లోపాల్లేకుండా చూడటం, స్పేర్ పార్ట్‌లను సిద్ధంగా ఉంచడం తదితర అంశాలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని స్పష్టంచేశారు. ఈ మేరకు ఆయన రీజనల్ మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు.

విలువలు, విశ్వసనీయతే సీఎం జగన్ ఆయుధాలు

వైఎస్సార్ మేధావుల ఫోరం



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

సాక్షి, బెంగళూరు: విలువలు, విశ్వసనీయత అనే ఆయుధాలతో ఏపీ సీఎం వైఎస్ జగన్ ప్రజల హృదయాల్లో చిరస్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్ మేధావుల ఫోరం అధ్యక్షుడు శాంతమూర్తి చెప్పారు. 'సుపరిపాలనలో యువత పాత్ర-సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అనే అంశంపై వైఎస్సార్ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో బెంగళూరులో చర్చాగోష్ఠి నిర్వహించారు. విశ్రాంత డీఆర్‌డీవో శాస్త్రవేత్త సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏపీలో వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయని తెలిపారు. కర్ణాటక ఉన్నత విద్యా మండలి ప్రత్యేక అధికారి తేజస్విని మాట్లాడుతూ.. సామాజికంగా అవసరమైన నైపుణ్యాలను విద్య ద్వారా అందుకోవడం మాత్రమే కాకుండా.. దేశ ఆర్థిక వృద్ధికి కూడా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం సభ్యులు ఫసియుల్లా ఖాన్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడతాం

ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్

మచిలీపట్నం టౌన్: కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ జపానికి వ్యతిరేకంగా తమ సంఘం ఉద్యమించి, కేంద్ర విధానాలను ప్రజలకు వివరించి ఎండగడతామని ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రవీంద్రనాథ్ చెప్పారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఆదివారం జరిగిన రీజియన్ సంఘ ప్రథమ ద్వైపాక్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ బ్యాంకులను కేంద్రం ప్రైవేటీకరణ చేయాలనుకోవటం దేశ ఆర్థిక శ్రేయస్సుకు విఘాతం కలిగించినట్లేనన్నారు. ఏపీ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ లక్ష్మీపతిరావు మాట్లాడుతూ వేతన సవరణ చేయటంలో జాప్యం చేయటం తగదన్నారు. అనంతరం సంఘ మచిలీపట్నం రీజియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ రీజనల్ సెక్రటరీగా దుర్గారావు, డిప్యూటీ రీజనల్ సెక్రటరీగా సలాం, రీజనల్ సెక్రటరీగా (మహిళ) వాణి, అసిస్టెంట్ రీజనల్ సెక్రటరీగా వీరభద్రయ్య, కోశాధికారిగా ఉదయకుమార్, సభ్యులుగా శ్రీనివాసరావు, గోపి, మహేష్, సాగర్, మూర్తి, అనూష, రవితేజ, రెడ్డప్పనాయక్, బాషా, కృష్ణ, ప్రత్యేక సభ్యులుగా సుభానీ, శంకర్‌ను ఎన్నుకున్నారు.

విశిష్టమైనది పురాతన మర్మకళ

వెన్నెముకకు చికిత్స చేయించుకున్న సోము వీర్రాజు



ఆవులయ్యను సత్కరిస్తున్న సోము వీర్రాజు

పెద్దదోర్నాల: ప్రాచీన వైద్య విధానంలో మర్మకళ ఎంతో విశిష్టమైనదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాలలో ఉన్న ప్రాచీన వైద్యుడు పోటు ఆవులయ్యను ఆయన ఆదివారం కలిసి మర్మకళ ద్వారా వెన్నెముకకు చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో వీర్రాజు మాట్లాడుతూ మర్మకళ వైద్యంలో మందులు ఉండవని, కేవలం చేతి చర్యల వల్లే చాలా వరకు రుగ్మతలు నయమవుతాయని చెప్పారు. తాను రాష్ట్రంలో పర్యటిస్తున్నందున వెన్నెముక సమస్య వచ్చిందని, అందువల్ల నాలుగైదుసార్లు ఆవులయ్యను కలిసి చికిత్స పొందినట్లు తెలిపారు. అనంతరం పోటు ఆవులయ్యను వీర్రాజు సన్మానించారు.

23న టీడీపీలోకి కన్నా!

గుంటూరు మెడికల్: బీజేపీకి ఇటీవల రాజీనామా చేసిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ఈ నెల 23న టీడీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది. ఆదివారం గుంటూరులోని తన నివాసంలో కార్యకర్తలు, అనుచరులతో కన్నా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో కన్నా, ఆయన అనుచరులు చేరాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ బాధ్యతలు కన్నాకు అప్పగించే అవకాశాలున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. కన్నా టీడీపీలో చేరే విషయాన్ని సోమవారం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

మారుమూల గ్రామీణ ప్రాంతాలకూ వైద్యుల సేవలు

టెలీమెడిసిన్‌లో అగ్రగామి ఏపీ



- రాష్ట్రంలో 1.86 కోట్ల మందికి టెలీమెడిసిన్ సేవలు
- దేశం మొత్తం అందించిన సేవల్లో ఏపీలోనే 30.84 శాతం
- ఏపీ తరువాత పశ్చిమబెంగాల్‌లో 86.69 లక్షల మందికి సేవలు
- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడి
- రాష్ట్రంలో ఈ-సంజీవని టెలీమెడిసిన్ ద్వారా స్పెషలిస్టు సేవలు

వైద్య కళాశాలలు, జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక హబ్‌లు	ఈ హబ్‌లకు అన్ని ఆరోగ్య కేంద్రాల అనుసంధానం	ఆడియో, వీడియో ద్వారా రోగులకు నేరుగా వైద్యుల సేవలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మారుమూల గ్రామంలోనూ అత్యవసర పరిస్థితిలో ఉన్న వారికి వెనువెంటనే నాణ్యమైన వైద్య సేవలందించాలన్నది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం టెలీమెడిసిన్ విధానాన్ని బలోపేతం చేశారు. ఈ-సంజీవని టెలీమెడిసిన్ ద్వారా స్పెషలిస్టు వైద్య సేవలు అందిస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వ చర్యలతో టెలీమెడిసిన్ సేవల్లో రాష్ట్రం రికార్డు సృష్టించింది. దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. టెలీమెడిసిన్ సేవల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ ఏడాది జనవరి నెలాఖరుకి దేశవ్యాప్తంగా 6.03 కోట్ల మంది రోగులకు టెలీమెడిసిన్ సేవలందిస్తే.. అందులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 1.86 కోట్ల మంది రోగులకు ఈ సేవలందినట్లు ఆ మంత్రిత్వ శాఖ ఇటీవల పార్లమెంట్‌లో తెలిపింది. అంటే దేశం మొత్తం అందించిన టెలీమెడిసిన్ సేవల్లో 30.84 శాతం ఒక్క ఏపీలోనే అందించినట్లు. పశ్చిమబెంగాల్‌లో 86.69 లక్షల మందికి, తమిళనాడులో 67.22 లక్షల మందికి ఈ సేవలందించినట్లు పేర్కొంది.

అత్యున్నతం.. ఏపీ టెలీమెడిసిన్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో టెలీమెడిసిన్ విధానాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దింది. దేశవ్యాప్తంగా ప్రశంసలందుకుంది. ఈ-సంజీవని టెలీమెడిసిన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రోగులకు స్పెషలిస్టు సేవలు అందుతున్నాయి. హబ్, స్పోక్ మోడల్ ద్వారా నిపుణులతో సహా వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లకు టెలీమెడిసిన్ సేవలను అందిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలలు, జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక హబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైఎస్సార్ పట్టణ ఆరోగ్య హెల్త్ క్లినిక్స్, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌ను అనుసంధానం చేసింది. ఒక్కో హబ్‌లో ఇద్దరు జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పీడియాట్రిక్స్, కార్డియాలజీ స్పెషలిస్టులు ఉన్నారు. పీహెచ్‌సీలకు, విలేజ్ క్లినిక్స్‌కు వచ్చిన రోగులకు స్పెషాలిటీ వైద్యుల సేవలు అవసరమైతే వెంటనే వైద్య సిబ్బంది టెలీమెడిసిన్ ద్వారా హబ్‌లోని వైద్యులను సంప్రదిస్తారు. వైద్యులు ఆడియో, వీడియో కాల్‌లో రోగులతో మాట్లాడి సలహాలు, సూచనలు ఇస్తారు. ఏ మందులు వాడాలో కూడా సూచిస్తారు. వారు సూచించిన మందులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ క్లినిక్స్‌లోని వైద్య సిబ్బంది రోగులకు అందజేస్తున్నారు. మరో వైపు స్మార్ట్ ఫోన్ ఉన్నవారు ఈ -సంజీవని (ఓపీడీ)యాప్ ద్వారా ఇంటి నుంచే వైద్య సేవలను పొందుతున్నారు. స్మార్ట్ ఫోన్ లేని వారికి, ఆ ఫోన్ల వినియోగం తెలియని వారికి ఇళ్ల వద్దే ఈ-సంజీవని ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ సేవలు అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం 42వేల మంది ఆశా వర్కర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేసింది. దీంతో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని రోగులు కూడా టెలీమెడిసిన్ ద్వారా స్పెషలిస్ట్ వైద్యుల సేవలను పొందుతున్నారు.

ఈ ఏడాది జనవరి 31 వరకు వివిధ రాష్ట్రాల్లో టెలీమెడిసిన్ సేవలు పొందిన రోగుల సంఖ్య..

(రాష్ట్రం పేరు / సేవలు పొందిన రోగులు)

ఆంధ్రప్రదేశ్ 1,86,52,001	పశ్చిమ బెంగాల్ 86,69,020	తమిళనాడు 67,22,007
కర్ణాటక 47,65,400	మహారాష్ట్ర 34,65,116	ఉత్తరప్రదేశ్ 33,24,186
తెలంగాణ 32,97,518	మధ్యప్రదేశ్ 26,40,370	బిహార్ 24,63,236

ప్రసూతి వేళ అందిన సేవలు మరువలేనివి

నాకు ప్రసూతి వేళలో టెలీమెడిసిన్ విధానంలో అందిన సేవలు మరువలేనివి. స్థానిక వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఎంఎల్‌హెచ్‌పీ సింగంపల్లి సంధ్య ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. ఆమె నేరుగా వీడియోకాల్ ద్వారా గైనకాలజిస్టును అనుసంధానం చేసేవారు. గైనకాలజిస్టు నిండిన నెలల ఆధారంగా నాకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు సూచించేవారు. తీసుకోవలసిన ఆహారం, వేసుకోవలసిన మందులు చెప్పేవారు. పరీక్షల కోసం ఎంఎల్‌హెచ్‌పీ స్థానిక పీహెచ్‌సీకి తీసుకువెళ్ళేవారు. టెలీమెడిసిన్ సహకారంతో డిసెంబర్‌లో పండంటి ఆడ శిశువును కన్నాను. మాది మధ్య తరగతి కుటుంబం. కార్పొరేట్ వైద్యాన్ని భరించే స్థోమత లేదు. టెలీమెడిసిన్ ద్వారా అంతకుమించిన నాణ్యమైన వైద్యాన్ని అందుకున్నాను. ఈ సేవలను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.

–కుడుపూడి నాగశ్రీ, ఇంద్రపాలెం, కాకినాడ రూరల్

పిట్టల దొరలను ప్రజలు నమ్మరు

బహుజన పరిరక్షణ సమితి



దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: అధికారం కోసం రాష్ట్రంలో యాత్రల పేరుతో విన్యాసాలు చేస్తూ చక్కర్లు కొడుతున్న పిట్టల దొరల మాటలను ప్రజలు నమ్మరని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 875వ రోజుకు చేరాయి. ఇందులో పలువురు పాల్గొని మాట్లాడుతూ..బహుజనులను బానిసలుగా మార్చాలనే దురుద్దేశంతో బాబు తన హయాంలో పేదలకు కనీస అవసరాలను కూడా తీర్చకుండా ఇబ్బందులకు గురిచేశాడని మండిపడ్డారు. అమరావతి పేరుతో రాష్ట్రంలో ప్రజలను తప్పుదారి పట్టించాలని చూసిన బాబుకు తగిన శాస్తి జరిగిందన్నారు. ఏపీలో బహుజనులకు సీఎం వైఎస్ జగన్ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మంచి ప్రాధాన్యత కల్పిస్తున్నారని చెప్పారు. సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు పాల్గొన్నారు.

నందమూరి కుటుంబానికి చంద్రబాబే శని: లక్ష్మీపార్వతి



తిరుపతి మంగళం (తిరుపతి జిల్లా): నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) కుటుంబానికి పట్టిన శని చంద్రబాబు అని తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. ఆదివారం తిరుపతిలో ఆమె మీడియాతో మాట్లాడారు. తారకరత్న మంచితనానికి మారుపేరు అని, ఆయన అకాల మరణం బాధాకరమన్నారు. తన స్వార్థ రాజకీయాల కోసం ఎంత మంది ప్రాణాలు తీయడానికైనా, ఎన్ని కుటుంబాలు నాశనం చేయడానికైనా వెనకాడని దుర్మార్గుడు చంద్రబాబు అని విమర్శించారు. తారకరత్న గుండెపోటుకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పటికీ లోకేశ్ పాదయాత్రను కొనసాగించి స్వార్థ రాజకీయాలకు నిదర్శనంగా నిలిచాడని దుయ్యబట్టారు. లోకేశ్‌కు చెడ్డ పేరు వస్తుందన్న దురాలోచనతో తారకరత్న మృతి విషయాన్ని దాచిపెట్టి.. కుటుంబాన్ని క్షోభకు గురిచేశారని ఆరోపించారు. తారకరత్న మృతికి చంద్రబాబు, లోకేశ్‌లే కారణమన్నారు. నందమూరి కుటుంబాన్ని చంద్రబాబు ఎప్పుడు వదిలిపెడతాడో.. అప్పుడే ఆ కుటుంబం బాగుపడుతుందని ఆమె అన్నారు.

పరమేశ్వరుడిని కించపరిచేలా ప్రచారమా?

- హిందువుల మనోభావాలకు దెబ్బ
- వైఎస్సార్‌సీపీపై బీజేపీ నేతల విమర్శలు
- క్షమాపణ చెప్పాలని ఎంపీ జీవీఎల్ డిమాండ్



విశాఖలో నిరసన తెలుపుతున్న జీవీఎల్ నరసింహారావు, బీజేపీ నాయకులు

సాక్షి, అమరావతి/ ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): అధికార వైఎస్సార్‌సీపీ అధికారిక ట్విటర్ ఖాతా ద్వారా పరమేశ్వరుడిని కించపరిచేలా ప్రచారం చేస్తోందని బీజేపీ రాష్ట్ర పార్టీ తప్పుపట్టింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు తదితర నేతలు ఆదివారం వైఎస్సార్‌సీపీ వైఖరిపై విమర్శలు గుప్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా శివాలయాల వద్ద ఆందోళన చేపట్టాలని పిలుపునివ్వగా, అక్కడక్కడ బీజేపీ నేతలు శివాలయాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశాఖలో జీవీఎల్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బాల శివుని వేషధారణలో ఉన్న వీధి బాలుడికి పాలు పోస్తున్నట్లు ఫొటో రూపొందించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో పౌష్టికాహారం, పాలు అందడం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో ఇలాంటి పోస్టులు సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

విజయం మనదే.. భారీ మెజార్టీకి కృషి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వై.వి.సుబ్బారెడ్డి

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే గెలుపని ఆ పార్టీ నాయకులు చెప్పారు. భారీ మెజార్టీ కోసం కలిసి కృషిచేద్దామని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో ఆదివారం ఈ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ భారీ విజయం సాధించేందుకు అందరూ కలిసి పనిచేద్దామని చెప్పారు. 20 రోజుల పాటు ఆయా నియోజకవర్గ నాయకులు ఓటర్లను కలిసి అత్యధిక మెజార్టీ సాధించే దిశగా పని చేయాలని కోరారు. బూత్‌స్థాయి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇంకా ఓటు నమోదుకు అవకాశం ఉన్నందున అర్హులంతా ఓటర్లుగా చేరేలా దృష్టి సారించాలని కోరారు. రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ పట్టభద్రులు టీడీపీ, బీజేపీ నాయకుల మాయమాటలను నమ్మవద్దని కోరారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం పరిపాలన వికేంద్రీకరణ చేపట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని చెప్పారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ తమ పార్టీ ఎక్కడా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించలేదని తెలిపారు. అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, రాజన్నదొర, మాజీ మంత్రులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ధర్మాన కృష్ణదాసు, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, సమన్వయకర్తలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నారా వెన్నుపోటులో నారీమణి ఎవరు?

బాబు ఇంట్లో మహిళలపై మేం పుస్తకాలను ప్రచురించలేమా?.. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



మహారాణిపేట(విశాఖ దక్షిణ): సీఎం జగన్ మూడున్నరేళ్లలోనే 98శాతానికి పైగా ఎన్నికల హామీలను అమలు చేయడంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బృందానికి దిక్కు తోచక రాజకీయాల్లో లేని మహిళల గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తోందని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోసారి మహిళల జోలికొస్తే చెప్పులతో కొడతామని హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య ఘటనకు సంబంధించి సీఎం కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తూ టీడీపీ పుస్తకం ప్రచురించటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అదే తరహాలో చంద్రబాబు ఇంట్లో మహిళల గురించి తాము పుస్తకాలను ప్రచురించలేమా? అని ప్రశ్నించారు. టీడీపీని, పదవిని, పార్టీ ఆస్తులన్నింటినీ లాక్కుని ఎన్టీఆర్ మరణానికి కారకుడైన నారావారి నారీమణి ఎవరు..? ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినప్పుడు చంద్రబాబుకు కత్తి అందించిన నారీమణి ఎవరని తాము పుస్తకాలు ముద్రించలేమా? అని అన్నారు. లోకేశ్ యువగళం ఒక ఫేక్ పాదయాత్రగా మారిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాజబాబు, విజయచందర్ పాల్గొన్నారు.

హిందువులంటే మీరేనా? మేం కాదా!

సీఎం ఎక్కడా, ఎప్పుడూ ఎవరినీ అగౌరవ పరచలేదు.. బీజేపీ పూర్తిగా దిగజారి వక్రీకరిస్తోంది

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: 'మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా, అన్నార్తుల ఆకలి తీర్చడమే ఈశ్వర ఆరాధన అని చెబుతూ.. మా పార్టీ అఫీషియల్ ట్విటర్ ఖాతాలో ట్వీట్ చేసింది. రాష్ట్ర ప్రజలందరికీ శివయ్య చల్లని దీవెనలు ఉండాలని కోరుకుంటూ శుభాకాంక్షలు చెప్పింది. ఇందులో హిందువుల మనోభావాలు ఎక్కడ దెబ్బతిన్నాయో అర్థం కావడం లేదు. ఆ ట్వీట్‌లో పరమశివుడిని కించ పర్చినట్లు ఎక్కడ ఉందో చెప్పండి? బీజేపీ పూర్తిగా దిగజారి వక్రీకరిస్తోంది. శివరాత్రి రోజు బీజేపీ వాళ్లు శివాలయాలకు వెళ్లడం మర్చిపోయినట్లు ఉన్నారు. అందుకే ఈరోజు కోవెలకు వెళ్దాం అంటూ ధర్నాలు చేపట్టారు' అని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. ఈ విషయమై ఆదివారం వేర్వేరు ప్రాంతాల్లో వారు మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

హిందుత్వానికి మీరు పేటెంటా?



మతాన్ని రాజకీయాల్లోకి ఎందుకు లాగుతున్నారు? హిందుత్వంపై బీజేపీకి పేటెంట్ ఉన్నట్టు బిల్డప్ ఇస్తున్నారు. మీకన్నా హిందుత్వంపై ఎక్కువ ప్రేమ ఉన్నవారు, హిందూ సంప్రదాయాలు పాటించే వారు వైఎస్సార్‌సీపీలో కోట్లాది మంది ఉన్నారు. బీజేపీ నేత సునీల్ దేవ్‌ధర్ ట్వీట్ ఇన్సల్టింగ్‌గా ఉంది.

– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి

మత రాజకీయం



ఆకలిగా ఉన్న వారికి అన్నం పెడుతున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్. ఆయన ప్రతి ఒక్క పేదవాడికి అండగా నిలుస్తున్నారు. దాన్ని ఫొటో రూపంలో ఒక అభిమాని చిత్రించాడు. పెత్తందారులైన బీజేపీ నాయకులు దాన్ని మత రాజకీయాలకు వాడుకోవడం దారుణం. అసలు ఇది మానవత్వమేనా?

– కొడాలి నాని, మాజీ మంత్రి

ఇందులో తప్పేముంది?



రాష్ట్రంలో బీజేపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి. మేమంతా హిందువులమే. ఆ ట్వీట్ ద్వారా మా మనోభావాలు ఏమీ దెబ్బతిన లేదు. బీజేపీ వాళ్లకు ఏం ఇబ్బంది కలిగిందో మాకు అర్థం కావటం లేదు. ఆకలి అంటే దేవుడిని తలుచుకోవడం అందరికీ సహజం. రాష్ట్రంలో మనుగడ కోసం ఏమీ లేని చోట బీజేపీ మసిపూసి మారేడికాయ చేస్తోంది. గతంలో వారే దేవాలయాలు కూల్చించి వారే ధర్నాలు, నిరసనలు చేశారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి. బీజేపీ విమర్శలను ఏకకంఠంతో ఖండిస్తున్నాం.

– బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి

నాడు గుడులు కూల్చినప్పుడు ఏమయ్యారు?



హిందూ మతాన్ని, దేవుళ్లను రాజకీయంగా వాడుకోవడం బీజేపీకి ఒక క్రీడగా మారింది. మతానికి రాజకీయ రంగు పులిమి పబ్బం గడుపుకుంటున్న పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక బీజేపీ మాత్రమే. సీఎం జగన్ సూచనల మేరకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లతో రాష్ట్రమంతా శివరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్న తరుణంలో ఓ సదుద్దేశంతో ట్విటర్‌లో వచ్చిన ఒక చిన్న క్యారికేచర్‌ను పట్టుకుని వక్రభాష్యాలు వల్లిస్తూ రెచ్చిపోవడం బీజేపీ నేతల దిగజారుడుతనానికి నిదర్శనం. మీరు టీడీపీతో అంటకాగినప్పుడు రాష్ట్రంలో 40 గుళ్లు కూల్చారు. అప్పుడు దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న బీజేపీ నేత, ఇతర నేతలంతా ఎక్కడ నిద్రపోయారు? టీడీపీ కూల్చితే మేం పునరుద్ధరించాం. ఆకాశంపై ఉమ్మితే ఏమవుతుందో తెలుసుకోండి.

– కొట్టు సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ)

80,581 మందికి ఆస్తి సర్టిఫికెట్లు

తొలి విడతగా గ్రామ కంఠాల పరిధిలోని ఇళ్లు, ఇంటి స్థలాలకు జారీ


- తహసీల్దార్ ఆధ్వర్యంలో వీటి జారీకి కొత్తగా చట్టం తెచ్చిన జగన్ సర్కార్
- రాష్ట్రవ్యాప్తంగా 205 గ్రామాల్లో ఈ విడతలో హక్కు పత్రాలు
- త్వరలో సీఎం జగన్ చేతుల మీదుగా అందించేందుకు కసరత్తు

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామ కంఠాల పరిధిలో రూ.లక్షలు విలువ చేసే ఇల్లు లేదా ఇంటి స్థలం ఉండి.. దానికి ఎలాంటి హక్కు పత్రాల్లేని యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం సాంత్వన చేకూరుస్తోంది. వాటికి కొత్తగా యాజమాన్య హక్కుతో కూడిన ఆస్తి సర్టిఫికెట్ల జారీ ప్రక్రియకు శ్రీకారం చుడుతోంది. తొలి విడతగా 25 జిల్లాల పరిధిలోని 205 గ్రామాల్లో 80,581 మంది ఇళ్ల యజమానులకు వీటి జారీ ప్రక్రియ కొలిక్కి వచ్చిందని పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెల్లడించారు. వచ్చే నెలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వీటి జారీకి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమంలో భాగంగా సర్వే అనంతరం గ్రామ కంఠాల్లోని ఇళ్లకు సంబంధించి వాటి యజమానులకు స్థానిక తహసీల్దార్ ద్వారా ఈ ఆస్తి సర్టిఫికెట్ల జారీకి గత ఏడాదే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చట్టం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా.. రాష్ట్రవ్యాప్తంగా 2,078 గ్రామాల్లోని గ్రామకంఠాల్లో డ్రోన్ సర్వే పూర్తయింది. ఇందులో 987 గ్రామాల్లో డ్రోన్ సర్వే మ్యాప్‌ల ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలన (గ్రౌండ్ ట్రూతింగ్) ప్రక్రియ కూడా ముగిసింది. ఒక్కో ఆస్తికి సంబంధించి సంబంధిత యజమాని ధృవీకరణ.. తదితర ప్రక్రియలన్నీ పూర్తయ్యాయి. ఇప్పటివరకు.. బాపట్ల జిల్లా మినహా మిగిలిన 25 జిల్లాల పరిధిలోని 205 గ్రామాల్లో నోటిఫికేషన్ల జారీకి కూడా ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. అలాగే, గ్రామాల్లోని ఇళ్ల యజమానుల వారీగా ఆర్ఓఆర్ నోటిఫికేషన్ జారీ ప్రక్రియ పురోగతిలో ఉందన్నారు. ఈ నెలాఖరుకల్లా నోటిఫికేషన్ల జారీ పూర్తవుతుందని, ఆ వెంటనే తొలివిడతగా.. ఆయా గ్రామాల్లోని సంబంధిత యజమానులకు ప్రభుత్వం ఆస్తి సర్టిఫికెట్లను జారీచేస్తుందన్నారు.

డిసెంబరు నాటికి దశల వారీగా అందరికీ..

ఇక దశల వారీగా డిసెంబరు కల్లా రాష్ట్రవ్యాప్తంగా గ్రామకంఠాల్లో సర్వే ప్రక్రియను పూర్తిచేసి ఆ పరిధిలో ఉండే ఇళ్లు, ఇళ్ల స్థలాలకు ఆస్తి సర్టిఫికెట్లు ఇచ్చేందుకు పంచాయతీరాజ్ శాఖ ప్రణాళిక సిద్ధంచేసుకుంది. ఏ నెలలో ఎన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియను పూర్తిచేయాలన్న దానిపై జిల్లాల వారీగా నిర్ధారించి, అందుకనుగుణంగా పనిచేయాలని జిల్లాల అధికారులకు సమాచారమిచ్చారు.



నాకు తెలిసిన ప్రతిదీ, నాకు ప్రేమ వల్లే తెలిసింది.
- లియో టాల్‌స్టాయ్

సాక్షి

సోమవారం, ఫిబ్రవరి, 20

భాషలను కాపాడుకోవాలి

'భాష మన ఆలోచనలకు వాహకం మాత్రమే కాదు, మన ఆలోచనా సరళికి దోహదపడే గొప్ప పరికరం కూడా' అన్నాడు బ్రిటిష్ ఆవిష్కర్త హంఫ్రీ డేవీ. ప్రస్తుత ప్రపంచంలో దాదాపు ఐదువేలకు పైగా భాషలు వాడుకలో ఉన్నాయి. వాటిలో మూడోవంతు కేవలం ఆఫ్రికా ఖండంలోనే మనుగడలో ఉన్నాయి. తాజా అంచనాల ప్రకారం ప్రపంచంలో దాదాపు మూడువేలకు పైగా భాషలు అంతరించిపోయే పరిస్థితుల్లో ఉన్నాయి. మన దేశంలోనే 192 భాషలు కొన ఊపిరితో కొనసాగుతున్నాయి.

ప్రపంచంలోనే అత్యధిక భాషలు వాడుకలో ఉన్న దేశాల్లో మన దేశానిది రెండో స్థానం. మన దేశంలో ఇప్పుడు 780 భాషలు మనుగడలో ఉన్నాయి. పాపువా న్యూగినీ విస్తీర్ణంలోను, జనాభాలోను చిన్న దేశమే అయినా, అక్కడ ఏకంగా 840 భాషలు మనుగడలో ఉన్నాయి. మన రాజ్యాంగం ఇరవైరెండు భాషలను గుర్తించింది. ప్రస్తుత ప్రపంచంలో రకరకాల భాషా కుటుంబాలకు చెందిన భాషలు మనుగడలో ఉన్నాయి. వాటిలో కొన్ని బలంగా ఉనికి చాటుకోగలుగుతున్నాయి. ఇంకొన్ని, క్రమంగా మరుగునపడే స్థితికి చేరుకుంటున్నాయి. భాష పుట్టుక గురించిన కచ్చితమైన వాస్తవాలు చరిత్రలో నమోదు కాలేదు. సమూహాలు సమూహాలుగా విడిపోయిన భాషా కుటుంబాలన్నీ ఒకే మూలభాష నుంచి విడివడిపోయినవనీ, ఒక్కో భాషా కుటుంబం నుంచి వేర్వేరు భాషలు పుట్టాయనీ భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. అన్ని భాషలకు మూలమైన తొలి భాష ఎప్పుడు ఎలా పుట్టిందో, ఎప్పుడు ఎలా అంతరించిపోయిందో చెప్పడానికి సరైన ఆధారాల్లేవు. మానవ సమూహాలు మనుగడ కోసం నేల నలు చెరగులా విస్తరించిన క్రమంలో ఏర్పడిన వేర్వేరు భాషా కుటుంబాల నుంచి పుట్టుకొచ్చిన భాషల గురించిన సమాచారం మాత్రమే మనకు తెలుసు.

'తన సొంత భాషను ప్రేమించని వాడు జంతువు కన్నా, దుర్గంధం వెదజల్లే చేప కన్నా నీచమైన వాడు' అన్నాడు ఫిలిప్పినో రచయిత జోస్ రిజాల్. పుట్టి పెరిగిన నేలను, తొలి పలుకులు నేర్పిన మాతృభాషను ప్రేమించని వాళ్లు అరుదు. మాతృభాషల మనుగడ కోసం ప్రజలు రాజకీయ ఉద్యమాలు, ఆందోళనలు సాగించిన సందర్భాలు ఉన్నాయి. బంగ్లాదేశ్ ఇదివరకు తూర్పు పాకిస్తాన్‌గా ఉన్నకాలంలో అక్కడి ప్రజలపై బలవంతంగా ఉర్దూను రుద్దే ప్రయత్నాలు జరిగాయి. మిగిలిన జనాల కంటే భాషాభిమానం కాస్త ఎక్కువ మోతాదులో ఉన్న బెంగాలీలు దీనికి వ్యతిరేకంగా తిరగబడ్డారు. తమ భాషకు గుర్తింపు కోసం పోరాటం సాగించారు. వారు తమ భాషకు గుర్తింపునే కాదు, స్వతంత్ర దేశాన్ని కూడా సాధించుకున్నారు. బెంగాలీలు తమ భాష కోసం పోరాటం ప్రారంభించిన ఫిబ్రవరి 21వ తేదీని 'యూనెస్కో' అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు మాట్లాడుకునే భాషలన్నింటి సంరక్షణ, పరిరక్షణలే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ ధ్యేయమని ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 2007 మే 16న ప్రకటించింది. భాషల సంరక్షణ, పరిరక్షణల బాధ్యతను ఐక్యరాజ్య సమితి నెరవేర్చలేదు. ఆ బాధ్యతను నెరవేర్చాల్సింది వివిధ దేశాల ప్రభుత్వాలే!

ఒక భాషలో మాట్లాడేవారు ఎవరూ లేనప్పుడు ఆ భాష అంతరించిపోతుంది. ఒక భాష అంతరిస్తే, ఆ భాషకు చెందిన సంస్కృతీ సాహిత్యాలు కూడా అంతరించిపోతాయి. వలస రాజ్యాలు మొదలైన తర్వాత ప్రపంచంలో చాలా భాషలే అంతరించిపోయాయి. 'ఒక జాతిని అంతమొందించాలంటే, ఆ జాతి మాట్లాడే భాషను అంతమొందించాలి' అనే నానుడి ఉంది. ఖండాంతరాలకు పాకి వలస రాజ్యాలను స్థాపించుకున్న పాలకులు చాలావరకు చేసిన పని ఇదే! ఇంగ్లిష్, ఫ్రెంచ్, స్పానిష్, డచ్, పోర్చుగీస్ తదితర యూరోపియన్ వలస రాజ్యాల్లో వందలాది స్థానిక భాషలు కనుమరుగైపోయాయి. వలస రాజ్యాల కాలంలో బలవంతులైన పాలకుల భాషలకు విపరీతంగా ప్రాబల్యం పెరిగింది. ఉపాధి కోసం పాలకుల భాషలను నేర్చుకోవడం జనాలకు అనివార్యంగా మారింది. తమ తమ మాతృభాషలను కాపాడుకోవడం పెను సవాలుగా మారింది. రెండు మూడు తరాలు గడిచే సరికి చాలా భాషలు కొడిగట్టిపోయాయి. ఉదాహరణకు చెప్పుకోవాలంటే, యూరోపియన్ వలస పాలకుల దెబ్బకు గడచిన నాలుగు శతాబ్దాల్లో కేవలం ఉత్తర అమెరికాలోనే దాదాపు రెండువందలకు పైగా స్థానిక భాషలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి.

ఒక భాష అంతరించిపోతే, ఆ భాషకు చెందిన సంస్కృతి అంతరించిపోతుంది. ఆ భాషలో నిక్షిప్తమైన జ్ఞానసంపద కనుమరుగైపోతుంది. ఒక్కొక్కసారి ఒక నాగరికత సైతం అంతరించిపోయే ప్రమాదం ఉంటుంది. అంతేకాదు, ఆ భాషా సంస్కృతులకు చరిత్రతో లంకె తెగి పోతుంది. ఒకటికి మించిన భాషలను నేర్చుకోవడం, ఒక భాష నుంచి మరొక భాషకు సాహితీ సంపదను ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా భాషలు చిరకాలం మనుగడ సాగించగలుగుతాయి. 'నా భాష పరిమితులంటే, నా ప్రపంచం పరిమితులే' అన్నాడు ఆస్ట్రియన్ తత్త్వవేత్త లుడ్విగ్ విట్గెన్‌స్టీన్. ఒకటికి మించిన భాషలు తెలిసి ఉన్నప్పుడు లేదా ఒకటికి మించిన భాషల్లోని సాహిత్యం మన భాషలోనే మనకు అందుబాటులో ఉండటం జరిగినప్పుడు మన పరిమితులు తొలగి, మన ప్రపంచం మరింతగా విస్తరిస్తుంది. బహుశా ఇందుకే కాబోలు 'ఇంకో భాష తెలిసి ఉండటమంటే, రెండో ఆత్మను కలిగి ఉండటమే' అన్నాడు రోమన్ చక్రవర్తి షాలమేన్. మనం మన చరిత్రను కాపాడుకోవాలంటే, మన భాషలను కాపాడుకోవడమే మార్గం.

ఏ విధిరాత వైపు పయనిస్తున్నాం?

కామెంట్



కరణ్ థాపర్

భారత చరిత్రపై తాజాగా వచ్చిన 'ఎ న్యూ హిస్టరీ ఆఫ్ ఇండియా' ఆర్యన్ల మూలాల గురించి సరికొత్త వ్యాఖ్యానాన్ని అందజేసింది. ఆర్యన్లు భారత్ మూలాలను కలిగి ఉన్నారనే వాదనను ఖండిస్తూ, వీరు మధ్యాసియా నుంచి వచ్చినవారని చెబుతోంది. భారత ముస్లిం పాలకులందరూ మతమార్పిడి పట్ల ఉత్సుకత కలిగి ఉన్న ఉద్రేకపరులు అని విశ్వసించేందుకు ఎలాంటి ఆధారమూ లేదని తేల్చి చెబుతోంది. ఔరంగజేబును పవిత్ర ముస్లింగా పేర్కొంటూనే, అత్యధిక హిందువులను ఉన్నత పదవుల్లో నియమించడానికి అది అడ్డురాలేదని పేర్కొంటోంది. ప్రస్తుతం మెజారిటీ వర్గ ఆధిపత్యం దిశగా దేశం పయనిస్తోందని కూడా పుస్తకం అభిప్రాయపడింది.


ఎట్టకేలకు, 450 కోట్ల సంవత్సరాల క్రితం భౌగోళిక కాలం ప్రారంభమైన నాటి నుంచి నేటి నరేంద్ర మోదీ వరకు భారత చరిత్రను ఒకే సంపుటిలో వివరించిన పుస్తకం ఇప్పుడు వచ్చింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, దీన్ని రాసిన ముగ్గురు రచయితలు– రుద్రాంక్షు ముఖర్జీ, శోభిత పంజా, టోబీ సిన్ క్లెయిర్– పుస్తకాన్ని 'ఎ న్యూ హిస్టరీ ఆఫ్ ఇండియా'(భారతదేశ కొత్త చరిత్ర) అని చెబుతున్నారు. వారు ఈ విశేషణం ఎందుకు ఉపయోగించారో నాకైతే తెలీదు కానీ ఈ పుస్తకంలోని విషయాలు, చేసిన వ్యాఖ్యలు నన్ను కట్టిపడేశాయి.

ఉదాహరణకు, ఇది మీకు తెలుసా? "హరప్పా నగరాల్లోని ఇళ్లు లేదా సమాధులు సంపద ఆడంబరానికి సంబంధించిన ఎలాంటి చిహ్నాలనూ ప్రదర్శించేవి కావు.... రాజమందిరం అని గుర్తించే ఎలాంటి భవనాలు లేవు... అలాగే ఈజిప్టు, చైనా, లేక మెసొపొటేమియాలో కనిపించినట్లు భారీ సమాధులు లేదా భవంతులు లేదా పాలకుల విగ్రహాలు కనబడవు." కాబట్టి ఇవి పాక్షిక సామ్యవాద గణతంత్రాలా?

ఆర్యుల గురించి రచయితలు ఇలా చెబుతారు. "మధ్య ఆసియా నుంచి ఉత్తర భారతానికి వలస వచ్చారు, స్థానిక ప్రజలతో కలిసిపోయారు, క్రమంగా వారిని తమలో కలుపుకున్నారు... మరోలా చెప్పాలంటే, ఆర్యన్లు ఉత్తర భారతదేశాన్ని ఆక్రమించలేదు, ద్రవిడియన్లను దక్షిణాభిముఖంగా తరమలేదు." ఇది కచ్చితంగా వివాదాస్పదమైంది. ఆర్యన్లు భారత్‌లోనే జన్మించినవాళ్లనే వాదనను ఇది ఖండిస్తుంది.

ఆర్య సంస్కృతికి సంబంధించి, ఈ పుస్తక రచయితలకు నిర్దిష్టమైన అభిప్రాయం ఉంది. "ఇది తరచుగా భారతీయ సంప్రదాయం, సమాజానికి సంబంధించినదిగా చూడబడుతోంది" అని నొక్కి చెబుతూనే, దాన్ని "కులీనమైనది, ఇంకా అనితరమైనది" అని వర్ణిస్తారు. "ఇది ఉత్తర భారత జనాభాలోని విస్తృతమైన వర్గాలను స్పష్టంగా విస్మరించింది. అలాగే భారత ద్వీపకల్పం (వింధ్యకు ఆవలి భూమి)లో నివసిస్తున్న మొత్తం జనాభాను దూరం పెట్టేసింది." పైగా "కులవ్యవస్థ పునాదులు" రుగ్వేద కాలంలోనే ఉన్నాయని వీరు చెబుతున్నారు. ఇది మోహన్ భాగవత్ అభిప్రాయానికి కచ్చితంగా భిన్నమైనట్టిదే.

ఇప్పుడు నన్ను ఔరంగజేబు వైపు దృష్టి మళ్లించనివ్వండి. ఆయనపై ఈ పుస్తక రచయితల అభిప్రాయం ప్రస్తుత మన కేంద్ర ప్రభుత్వం కంటే ఆడ్రే ట్రూష్కే(అమెరికా చరిత్రకారిణి) అభిప్రాయాలకు దగ్గరగా ఉంటోంది. "ఔరంగజేబు పవిత్రమైన, పరి శుద్ధమైన ముస్లిం" అని వీరు పేర్కొంటున్నారు. "కానీ ఆయన మతోన్మాది కాదు" అంటున్నారు. దీనికి సాక్ష్యంగా, ఔరంగజేబు వ్యక్తిగత మత దృక్పథం అధిక సంఖ్యలో హిందూ మునసబుదార్లను నియమించకుండా ఆయనను అడ్డుకోలేదని వీరు పేర్కొంటున్నారు. "షాజహాన్ పాలనలో 1,000 జాత్(ర్యాంకు) లేదా అంతకు మించిన ర్యాంకు కలిగిన మునసబుదారుల్లో హిందువులు 22 శాతంగా ఉండేవారు. ఔరంగజేబు హయాంలో ఈ సంఖ్య 32 శాతానికి పెరిగింది."



విస్తృతమైన ముస్లిం పాలనలో అంటే 13వ శతాబ్ది నాటి సుల్తాన్‌ల నుంచి మొఘలుల అంతం వరకు చూస్తే ఈ కాలాన్ని 1,200 సంవత్సరాల బానిసత్వ సంవత్సరాలుగా పరిగణిస్తుంటారు. కానీ ఈ పుస్తకం మాత్రం దీనికి విరుద్ధమైన దృక్పథాన్ని కలిగి ఉంది. "ముస్లింలందరూ లేక ముస్లిం పాలకులందరూ మతమార్పిడి పట్ల ఉత్సుకత కలిగి ఉన్న ఇస్లామిక్ ఉద్రేకపరులు, ఉత్సాహవంతులు అని విశ్వసించేందుకు ఎలాంటి ఆధారమూ లేదు. ముస్లిం పాలకులు పెద్ద సంఖ్యలో ముస్లిమేతరులను ఉద్యోగాల్లో నియమించారు, వారికి అత్యున్నత పదవులను కూడా కట్టబెట్టారన్న వాస్తవాన్ని బట్టే ముస్లిం పాలకులందరూ మతమార్పిడి ఉన్మాదులు కారని తెలుస్తోంది" అని ఈ పుస్తకం తేల్చి చెబుతోంది.

ఇస్లాం పాలకుల హయాంలో కళలు, నిర్మాణ కళ, సంస్కృతి, మతం వంటి అంశాల్లో జరిగిన అభివృద్ధి గురించి పుస్తకం చర్చించింది. భక్తి సంప్రదాయం, సూఫీతత్వం మధ్య ఈ పుస్తకం గుర్తించిన లంకెలను చూసి నేను నిరుత్తరుడినయ్యాను. "ఇస్లాంతో సన్నిహిత సంబంధం, ఇస్లాం రాకముందు భారత్‌లో ఉనికిలో ఉన్న భక్తిరూపాల వల్ల భక్తి ఉద్యమం పురుడు పోసుకుందని చెబితే అది మరీ అతిశయోక్తి కాజాలదు... భక్తి మార్మిక సంప్రదాయాలు, సూఫిజం మధ్య గొప్ప అతివ్యాప్తి, కలయిక ఉంది."

ఈ పుస్తకంలోని అత్యంత ఆసక్తికరమైన విషయాలు కొన్ని దాని అపురూపమైన వివరాల్లో ఉన్నాయి. "వ్యభిచారులపై పన్ను విధించాలి" అని కౌటిల్యుడు విశ్వసించాడు. అది చాలా ప్రగతిశీలమైందని నేను చెబుతాను. "అశోకుడు తన సోదరులను చంపేశాడు. ఉన్న వారిలో మొత్తం 97 మందిని చంపేశాడు." అంటే కళింగులకు చాలా కాలం క్రితమే ఆయన ఈ చంపడంలో మునిగివున్నాడు. అలాగే సిపాయిల తిరుగుబాటు "1857 మే 10న అపరాహ్న వేళ... దాదాపు 5 గంటల సమయంలో" మొదలైంది. అయితే అది మీరట్ కంటోన్మెంట్‌లో సాయంత్రం తేనీటికి కచ్చితంగా అంతరాయం కలిగించివుంటుంది.

మన ప్రస్తుత ప్రధానికి సంబంధించి ఈ పుస్తకం రెండు అభిప్రాయాలను కలిగివుంది. "నరేంద్ర మోదీ తాను చేసిన అన్ని వాగ్దానాలను ఇంకా నెరవేర్చలేదు" అని చెబుతూనే, "ఆయన ఒక కొత్త విశ్వాసాన్ని, ఉల్లాసాన్ని తీసుకొచ్చారు" అని పొదుపుగా జోడించింది. అయితే ఆ తర్వాత, ఈ పుస్తకం "మోదీ నాయకత్వంలో మెజారిటీ వర్గ ఆధిపత్యం, మైనారిటీల పట్ల తీవ్ర అసహనం, అసమ్మతి వైపుగా ఒక సహజ ప్రవృత్తి బలపడిపోయింది. ఈ మెజారిటీ వైపు మలుపు మన సమాజాన్ని వేర్పాటుతత్వంతో విభజించివేసింది" అని అభిప్రాయపడింది.

చివరగా, ఈ పుస్తకం చివరి వాక్యాన్ని చాలా తెలివిగా, కాకపోతే జిత్తులమారితనంతో రూపొందించారు. "మార్పు, మథనానికి సంబంధించిన లోతైన, ప్రాథమిక ప్రవాహాలు భారత్‌ను ఒక కొత్త విధి రాత (ట్రిస్ట్ విత్ డెస్టినీ) వైపు లాగుతున్నాయి." ఒక విరుద్ధమైన ఫలితాన్ని ముందుచూపుతో సూచిస్తూ, నెహ్రూ సుప్రసిద్ధ వాక్యాన్ని ఇక్కడ చమత్కారంగా ఉపయోగించారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



మోసపు వాదనలు



అమెరికా ముఖ్య వైద్య సలహాదారు ఆంతోనీ ఫౌచీ మనతో ఎలా ఆడుకున్నాడు! కోవిడ్‌కు సహజమైన రోగనిరోధకత అనేది ఉండదని చెప్పాడు. మళ్లీ ఇప్పుడు వాళ్లు తమ కథనాన్ని మార్చుకుంటున్నారు. స్వప్రయోజనాల కోసం మాలాంటివాళ్ల నోళ్లు మూయిస్తూ వీళ్లంతా సైన్సును, నా పవిత్ర వైద్య రంగాన్ని ఎలా వికటింపజేశారో చూస్తే నిజంగా అసహ్యం పుడుతుంది.

– అఫ్షైన్ ఇమ్రానీ, కార్డియాలజిస్ట్

చంపా రాజ్యం



వియత్నాంకు ప్రాచీన పేరు చంపా. వియత్నాంలో దొరికిన గుప్తుల పూర్వపు బ్రాహ్మీ లిపిలో రాసిన సంస్కృత శాసనంలో వియత్నాం రాజు మరుడికి సంబంధించిన ప్రస్తావన ఉంది. ఆగ్నేయాసియాలో దొరికిన అత్యంత ప్రాచీన సంస్కృత శాసనం ఇది.

– వేద్‌వీర్ ఆర్య, చరిత్రకారుడు

తప్పు పురుషులది



హిందు, ముస్లిం, సిక్కు... వివాహితులు, బాయ్‌ఫ్రెండ్, సహజీవనం... అందరూ ఒక ముఖ్య విషయం వదిలేస్తున్నారు. ఎందుకు అందరూ ఇంకో మతాన్నీ, జీవన పరిస్థితుల్నీ వేరేదానితో పోల్చి నిందిస్తున్నారు? ఇది చేస్తున్నది మగవాళ్లు! మంచాల కింద శరీరాలను దాయడం, ఫ్రిడ్జుల్లో శరీరాంగాల్ని దాయడం! అమ్మాయి కాదంటే వాళ్లకు కోపం వస్తోంది.

– హనా మొహిసిన్ ఖాన్, పైలట్

గొప్ప పని



కర్ణాటకలోని బండిపూర్ టైగర్ రిజర్వు సమీపంలో ఒక ఆడ ఏనుగు విద్యుద్ఘాతానికి గురైంది. అటవీ అధికారులు, వెటెరినరీస్ దానికి చికిత్స ఇప్పించి, చివరకు తన కాళ్ల మీద నిలబడేలా చేశారు. అది అగ్నిపరీక్ష. ఇలాంటి గొప్ప పని చేసినందుకు మొత్తం బృందానికి హేట్సాఫ్.

– రమేశ్ పాండే, ఐఎఫ్‌ఎస్ అధికారి

అదే ముఖ్యం



మనిషికి జీవితంలో ఉండాల్సిన నిజమైన సంపద, మనశ్శాంతి మాత్రమే. అదే నిజం.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

ఎప్పుడు మాట్లాడాలి?



ఇది సమయం కాదా? మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న హింస గురించి మాట్లాడటానికి? లేదా మనం దీన్ని వదిలేసి సాగిపోదామా. అది మన ఇంట్లోకి వచ్చేదాకా వేచిచూద్దామా?

– గుత్తా జ్వాలా, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఒక తరం కీలక నేత

బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు అండదండలుగా నిలిచిన నిజమైన నాయకులలో నల్లగొండ జిల్లాకు చెందిన దివంగత చకిలం శ్రీనివాసరావు ముందు వరసలో నిలుస్తారు. సమితి ప్రెసిడెంట్‌గా, శాసన సభ్యుడిగా, లోక్‌సభ సభ్యుడిగా, డీసీసీబీ అధ్యక్షుడిగా పలు పదవులను చేపట్టిన చకిలంకు సర్దార్ అని బిరుదునిచ్చి ఇప్పటికి అదే పేరుతో జిల్లా ప్రజలు గౌరవంగా గుర్తు చేసుకుంటున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దాదాపు 1970 దశకం నుండి ఆయన మరణించేంత వరకు మూడు దశాబ్దాలపాటు తిరుగులేని నాయకుడిగా జిల్లా రాజకీయాలన్నీ తన చుట్టే తిరిగేలా చేసుకున్న రాజకీయ దురంధరుడు చకిలం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వర్గాల పోరుకు నిదర్శనమైన కాంగ్రెస్ పార్టీ షరా మామూలుగానే నల్గొండలోను చకిలం వర్గం, చకిలం వ్యతిరేక వర్గాలుగా విడిపోయి ఉండేది. అదే సమయంలో జిల్లాలో అత్యంత బలంగా ఉన్న వామపక్షాలను ఎదుర్కొని, ఎన్నో ప్రతికూల పరిస్థితుల నడుమ జిల్లాలోని ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశారు. సహజంగానే ఇరు పార్టీల మధ్య ఉన్న సైద్ధాంతిక భేదాలు, సొంత పార్టీలో వ్యతిరేక వర్గం సహాయ నిరాకరణ నేపథ్యంలో కార్యకర్తలకు పెద్దగా నిలిచారు. జిల్లాలోని చిన్న కుగ్రామంలోనూ తన అభిమానులను సంపాయించుకున్న నాయకుడు చకిలం శ్రీనివాస రావు. వీరి అనంతరం ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ప్రజాదరణ పొందినవారు ఎవరూ లేరంటే అతిశయోక్తి కాదు.



చకిలం శ్రీనివాసరావు

తాను నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న రెండున్నర దశాబ్దాలలో వచ్చిన ప్రతీ ఎన్నికల్లో జిల్లాలో బలంగా ఉన్న అగ్ర వర్గాలను కాదని... జనరల్ స్థానాల్లో బలహీన వర్గాలకు చెందిన వారికి సీట్లు ఇచ్చిన ఏకైక నాయకుడు ఆయన. అందుకే, శ్రీనివాసరావు అనంతరం అంతటి దీటైన నాయకుడు ఇప్పటివరకు రాలేదని చెప్పవచ్చు. జిల్లా రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర వహించిన చకిలంకు కనీసం ఇల్లు కూడా లేకపోవడం ఆయన నిజాయితీకి అద్దం పడుతుంది.

1972లో నల్లగొండ నియోజకవర్గం నుండి, 1983లో మిర్యాలగూడ నుండి శాసన సభ్యుడిగా ఉన్నారు. 1989లో లోక్ సభకు నల్లగొండ నియోజకవర్గం నుండి పోటీ చేసి సీపీఐ అభ్యర్థి ధర్మ భిక్షంపై గెలుపొందారు. 1991 నుండి 1996 వరకు జిల్లా సెంట్రల్ బ్యాంకు చైర్మన్ గా ఉన్నారు. 1996 జూలై రెండవ తేదీన గుండెపోటుతో అకాల మరణం చెందారు. మృతి చెంది 25 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ పేద ప్రజల గుండెల్లో కొలువై ఉన్నారు చకిలం. ఆయనకు ఘన నివాళులు!

– కన్నెకంటి వెంకటరమణ
వ్యాసకర్త జాయింట్ డైరెక్టర్, తెలంగాణ సమాచార శాఖ
(నేడు చకిలం శ్రీనివాసరావు శత జయంతి)

కొనుక్కోగలిగే గౌరవాలు

ఈ మధ్య కొన్ని జాతీయ, అంతర్జాతీయ 'సంస్థల' పేరుతో కొన్ని అవార్డులు ప్రదానం అవుతున్నాయి. యాభై వేల నుంచి ఐదు లక్షలు పెట్టుకోగలిగితే మీకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తారు. ఆ సర్టిఫికెట్‌ని మీ ఇంటి వద్దకే డెలివరీ చేసుకోవచ్చు. ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో ఉన్నాయని చెప్పుకొనే వందల 'విశ్వవిద్యాలయాలు' దేశంలో నకిలీ డాక్టర్ ఆఫ్ లిటరేచర్(డి.లిట్) సర్టిఫికేట్‌లను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ గ్రహీతలలో విద్యాశాఖ సీనియర్ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవా సంస్థలలో పనిచేసే వారు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు... తమ పేరు ముందు 'డాక్టర్'ను ఇష్టపడే చాలా మంది ఉన్నారు.

ఈ కల్పిత విశ్వవిద్యాలయాలు ప్రజలను ఆకర్షించడానికి పాఠశాలలు, కళాశాలలు, జిల్లా విద్యా, శిక్షణా సంస్థల కార్యాలయాలకు ఈమెయిల్స్ పంపి, స్వయంగా సంప్రదించి, గౌరవ డాక్టరేట్ల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించి, మరుసటి రోజు దానిని వివిధ పత్రికలలో ప్రచురితం చేస్తుంటాయి. ఈమధ్య కాలంలో స్థిర వ్యాపారాలలో ఖాతాదారులకు కుచ్చుటోపీ పెట్టిన వారికి, చిట్‌ఫండ్ కంపెనీలు పెట్టి డబ్బు ఇవ్వకుండా ఎగనామం పెట్టిన వారికి, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు పెట్టి బోర్డు తిప్పేసిన వారికి కూడా ఉత్తమ వ్యాపారవేత్తల అవార్డు ఇచ్చి సత్కరిస్తున్నారు. మరి కొన్ని నకిలీ విశ్వవిద్యాలయాలు, సంస్థలు బోధనలో ఉన్న ప్రొఫెసర్లకు సందేశాలు పంపుతుంటాయి. ప్లాట్‌ఫామ్‌లో, రీసర్చ్ సైట్‌లో మీ పరిశోధనను గుర్తించాము; మీరు సమాజానికి అందించిన సహకారం కోసం మేము మీ కృషిని అభినందిస్తున్నాము; మీరు వెయ్యి డాలర్లు పంపితే మీకు ఆన్‌లైన్ ద్వారా ఒక మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తాం అంటాయి.



ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ సైంటిఫిక్ నెట్‌వర్క్ అవార్డ్స్ అనేది సరికొత్త అవార్డు సంస్థ. మీరు అవార్డుకు ఎంపికయ్యారని సూచిస్తూ వారు స్పామ్ మెయిల్‌లను పంపుతారు. తిరుచిరాపల్లి, హోసూర్, బీజాపూర్, గుల్బర్గా, బెల్గామ్, హుబ్లీ, ధార్వాడ్, మైసూర్ నగరాలలో కొన్ని స్టార్ హోటల్స్ అద్దెకు తీసుకుని వేడుకలు జరుపుతుంటారు. 120 అమెరికా డాలర్ల రుసుమును చెల్లించిన తర్వాత అవార్డును తీసుకోవచ్చు. ఇంటర్నేషనల్ రీసెర్చ్ రత్న అవార్డులు ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ రీసెర్చ్ అండర్ లిటరల్ యాక్సెస్ నుండి మీకు మీరే సైన్ అప్ చేసి, రుసుము చెల్లించడం ద్వారా పొందగలిగే మరొక అవార్డు. సంవత్సర ఉత్తమ పరిశోధకుడు, సంవత్సర ఉత్తమ శాస్త్రవేత్త, సంవత్సర ఉత్తమ ప్రొఫెసర్... ఇలా ఉంటాయి అవార్డులు. ఇది భారతదేశంలోని సంస్థ. పొందేది చక్కని ఫ్రేమ్డ్ సర్టిఫికేట్ మరియు మెడల్. డబ్బు చెల్లించే వారు చెన్నై, బెంగుళూరు లేదా ఖాట్మండులోని స్టార్ హోటళ్లలో జరిగే స్నాతకోత్సవ వేడుకకు హాజరుకావాలని మొదటగా కోరుతారు. ఈ కార్యక్రమానికి డిమాండ్ లేని ప్రముఖ వ్యక్తులు హాజరవుతుంటారు. ఇండియన్ వర్చువల్ యూనివర్సిటీ; యూనివర్సల్ తమిళ విశ్వవిద్యాలయం, చెన్నై; కింగ్స్ యూనివర్సిటీ, యూఎస్ఏ; అంతర్జాతీయ శాంతి విశ్వవిద్యాలయం, జర్మనీ; అంతర్జాతీయ తమిళ విశ్వవిద్యాలయం; యూనివర్సిటీ ఆఫ్ ఆసియా, ఖాట్మండు, నేపాల్... ఇలా వాణిజ్యంలో నిమగ్నమైన కొన్ని సంస్థలు ఇలాంటి పురస్కారాల ఉత్సవాలు జరుపుతుంటాయి. వాటిలో చాలా వరకు భవనాలు, ఇతర సౌకర్యాలు కల్పిత చిత్రాలతో తయారైనవి. చాలామంది సినీ ప్రముఖులు, బిగ్ బాస్ విజేతలు మొదలుకొని చిన్న సంస్థలలో పనిచేసేవారు, ప్రజాసంఘాల నాయకులు సైతం రుసుము చెల్లించి ఎందుకూ పనికిరాని పత్రాలు, మెమెంటోలు కొనుక్కుంటున్నారు.


ఒక బాధిత నటుడు రాయల్ అమెరికన్ యూనివర్సిటీకి డి.లిట్ కోసం డబ్బులు చెల్లించారు. వెబ్‌సైట్ ప్రకారం విశ్వవిద్యాలయం యునైటెడ్ స్టేట్స్‌లోని డెలావేర్ స్టేట్‌లో ఉంది. అక్కడ స్టేట్ లైబ్రరీ అధికారులతో జరిపిన విచారణలో, అమెరికాలోని గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు, కళాశాలలు చివర '.ఇడియు'తో వెబ్ చిరునామాను కలిగి ఉన్నాయని తేలింది. కాబట్టి ఇది కల్పిత విశ్వవిద్యాలయంగా కనిపిస్తుందని పోలీసులు తేల్చి చెప్పారు. డెలావేర్‌లో భౌతికంగా ఈ పేరుతో విశ్వవిద్యాలయం కానీ కళాశాల కానీ లేదు. బాగా శోధించిన తర్వాత, వెబ్‌సైట్‌లో ఇచ్చిన స్థలం కారు మరమ్మతు యూనిట్ అని తేలింది. ఇలాంటి గౌరవ డాక్టరేట్లు, ఆణిముత్యాలు, ఉత్తమ ప్రశంస పత్రాలు డబ్బు తీసుకొని ప్రచురించే సంస్థలపై నిఘా పెట్టి, ఇలాంటి ఈవెంట్లు నిర్వహించే వారిని అదుపులోకి తీసుకోవాలి.

– డాక్టర్ ముచ్చుకోట సురేష్ బాబు, అధ్యక్షులు, ప్రజాసైన్స్ వేదిక

గడ్డి దివిటీ– గంగానది

పొగడ్తలకు పొంగిపోవడం, తెగడ్తలకు కుంగిపోవడం ధీరుల లక్షణం కాదు. పొంగిపోవడం వల్ల అహంకారం ఉదయిస్తుంది. ఆ అహంకారమే తిరిగి మనల్ని తిరోగమనంలోకి నడిపిస్తుంది. అలాగే కుంగిపోవడం కూడా. తెగడ్తలకు కుంగిపోయిన వారు నైరాశ్యంలో పడిపోతారు. ఆ నిరాశలో తమ శక్తుల్ని కోల్పోతారు. అంతేకాదు... ఒక్కోసారి కోపం తెచ్చుకుంటారు. కలహాలతో జీవిస్తారు. కాబట్టి... పొంగడమైనా, కుంగడమైనా రెండూ మన పతన కారణాలే అవుతాయి. సత్యాన్ని సత్యంగా చూడనీయవు. అసత్యాన్ని అసత్యంగా దర్శించనీయవు.

కాబట్టి, పొగడ్తలకు పొంగని, తెగడ్తలకు కుంగని సమతా స్థితిని కలిగి ఉండటమే ప్రజ్ఞ. స్థితప్రజ్ఞత. సాధారణంగా మనం ఇతరుల నుండి ఐదు రకాల మాటల్ని వింటూ ఉంటాం.



వారి మాటలు సమయ సందర్భాన్ని బట్టి ఉండొచ్చు, ఉండకపోవచ్చు. అవి నిజం కావచ్చు, కాకపోవచ్చు. మేలు కలిగించేవి కావచ్చు, కీడు కలిగించేవి కావచ్చు. మైత్రితో ఉండొచ్చు, ద్వేషంతో ఉండొచ్చు. మృదువుగా ఉండొచ్చు, పరుషంగా ఉండొచ్చు. ఇలా– ఈ ఐదు రకాలుగా ఉంటాయి. మొదటి ఐదు మనకి ఉల్లాసాన్నీ, శాంతినీ కలిగిస్తాయి. రెండవ ఐదు నిరుత్సాహాన్నీ, కోపాన్నీ తెప్పిస్తాయి. కానీ... మీరు స్థిర చిత్తులు ధృఢచిత్తులు అయితే, స్థితప్రజ్ఞత కలిగిన వారు అయితే... వీటికి పొంగరు, కుంగరు. వారు పలికే పలుకులు... మీ మీద, మీ నడిచే నడత మీద, మనస్సు మీద ఎలాంటి ముద్రల్నీ వేయలేవు.

ఎలాగంటే... ఒకరు పలుగు, పార, గంపలు తెచ్చి 'ఈ భూమినంతా తవ్వి పారబోస్తాను, ఈ మహా పృథ్విని లేకుండా చేస్తాను' అన్నాడనుకోండి. అది సాధ్యమా? అతను అక్కడక్కడే కొద్దిగా తవ్విపోసిన గుంటల వల్ల భూమి హరించుకుపోతుందా? భూమి చలిస్తుందా? కంపిస్తుందా? బరువును కోల్పోతుందా? అలాగే స్థిరచిత్తుడు ఈ ఐదు రకాల పొగడ్తలకీ, తెగడ్తలకీ పొంగడు, కుంగడు. అతని చిత్తంలో ఎలాంటి మార్పూ కలగదు. అలాగే– మరొకడు మండుతున్న గడ్డి దివిటీ తెచ్చి 'ఈ నీటిని వేడి చేస్తాను! ఆవిరి చేస్తాను' అని ఆ దివిటీని గంగానదిలో ముంచాడనుకొండి. ఏమవుతుంది? ఆ నీరు వేడెక్కుతుందా? సలసల మరిగి ఆవిరి అవుతుందా? నీటిలో ఎలాంటి మార్పూ రాదు. చివరకు ఆ దివిటీనే చప్పగా చల్లారిపోతుంది. స్థిర చిత్తుడు మహానది లాంటివాడు. కోపం, ద్వేషం, ఈర్ష్య అనే గడ్డి మంటలు అతణ్ణి ఏమీ చేయలేవు. అతని చిత్తంలో ఎలాంటి మార్పూ కలిగించలేవు. అతని మనస్సు ఎల్లప్పుడూ మైత్రీ భావనతోనే ఉంటుంది అంటాడు బుద్ధుడు.

– బొర్రా గోవర్ధన్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** అమావాస్య ప.1.39 వరకు, తదుపరి ఫాల్గుణ శు.పాడ్యమి, **నక్షత్రం:** ధనిష్ఠ ప.12.54 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.7.38 నుండి 9.06 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.36 నుండి 1.23 వరకు తదుపరి ప.2.54 నుండి 3.40 వరకు, **అమృతఘడియలు:** తె.4.38 నుండి 5.56 వరకు(తెల్లవారితే మంగళవారం), **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.29, **సూర్యాస్తమయం:** 5.59.

క్లుప్తంగా...

అన్నపూర్ణదేవిగా అమ్మవారి దర్శనం



స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకుంటున్న గోరక్‌పూర్ ఎంపీ రవికిషన్

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణా రాష్ట్రం కురుక్షేత్రలో జరుగుతున్న లక్ష చండీ మహాయజ్ఞం తొమ్మిదవ రోజు ఆదివారం విశేషంగా జరిగింది. యజ్ఞశాలలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి అమ్మవారికి పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. అమ్మవారిని ఆరాధిస్తూ వేలకొద్దీ పారాయణ హోమాలను పండితులు నిర్వహించారు. సప్తశతి పారాయణాన్ని విశేషంగా జరిపారు. గోరక్‌పూర్ ఎంపీ రవికిషన్ యజ్ఞంలో పాల్గొని స్వామీజీలు, గుంతీమాత ఆశీస్సులు తీసుకున్నారు.

ప్రవక్త మహమ్మద్ బోధనలు అనుసరణీయం



మదనపల్లె: మహాప్రవక్త హజ్రత్ మహమ్మద్ బోధనలు అనుసరణీయమని ప్రముఖ మత గురువులు మౌలానా అజ్మల్‌సాహెబ్, నూర్ అహ్మద్‌సాహెబ్, ముఫ్తి ముజాహిద్ సాహెబ్‌లు అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని టిప్పుసుల్తాన్ వక్ఫ్ మైదానంలో 2 రోజులుగా జరుగుతున్న దీని ఇజ్తిమా ఆదివారంతో ముగిసింది. మత గురువులు ధార్మికోపన్యాసం చేస్తూ..అందరిని దైవ మార్గంలో నడిచి ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించాలని కోరారు. నేడు ముస్లిం సముదాయం ఇస్లాం ధర్మ సూచనలు విస్మరిస్తోందని, మహ్మద్ ప్రవక్త ఆదేశించిన మార్గంలో నడవకపోతే ఇహ, పరలోక జీవితంలో అనర్థాలు, నష్టాలు ఎదుర్కోక తప్పదన్నారు. ఇస్లాం శాంతియుత సహజీవనాన్ని కోరుకుంటుందన్నారు. పేదలను ఆదుకోవాలని, పవిత్ర ఖురాన్ బోధనలు మానవాళికి ఆదర్శమన్నారు. విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమానికి రాయలసీమలోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరుజిల్లాల నుంచి 2 లక్షలకు పైగా ముస్లింలు హాజరైనట్లు అధికారుల అంచనా. మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను జయించిన వలంటీర్ మహమ్మద్

ఆరోగ్యశ్రీ ద్వారా రూ.78 లక్షలు అందించిన ప్రభుత్వం



క్రోసూరు: క్యాన్సర్ బారిన పడిన వలంటీర్‌కు ప్రభుత్వం సాయం చేయడంతో అతడు పూర్తిగా కోలుకుని తిరిగి విధుల్లో చేరాడు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం నాగవరం గ్రామానికి చెందిన షేక్ ఉమ్మర్ ఖయ్యూం ఆటో నడుపుతుంటాడు. వారి పెద్ద కుమారుడు షేక్ మహమ్మద్ డిగ్రీ పూర్తి చేసి వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. మహమ్మద్ 2021లో బ్లడ్ క్యాన్సర్ బారిన పడ్డాడు. ఆరోగ్యశ్రీ కార్డు కూడా లేదు. సమాచారం తెలుసుకున్న పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అతని ఇంటికి వెళ్లి పరామర్శించి వెంటనే ఆరోగ్యశ్రీ కార్డు ఇప్పించారు. సీఎం వైఎస్ జగన్‌కి వినతి పెట్టారు. వెంటనే స్పందించిన సీఎం జగన్..మహమ్మద్‌కు ఎంత ఖర్చు అవుతుందో అంతా ప్రభుత్వమే భరాయించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహమ్మద్‌కు ప్రభుత్వం రూ.78 లక్షలు మంజూరు చేసింది. పూర్తిస్థాయిలో చికిత్స పొంది మహమ్మద్ ఇంటికి చేరుకున్నాడు. వైఎస్సార్ ఆసరా ద్వారా నెలకు రూ.5,000 చొప్పున 6 నెలల పాటు అందించి మందులను కూడా ఉచితంగా అందజేసింది. సీఎం జగన్ లాంటి నేత ఉండటంతోనే తాము ఈ సమస్య నుంచి బయట పడ్డామని, ఆయనకు తాము ఎంతగానో రుణపడి ఉన్నామని ఖయ్యూం కుటుంబసభ్యులు తెలిపారు. మహమ్మద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవతో సీఎం జగన్ వెంటనే స్పందించి తనను ఆదుకున్నారని, జీవితంలో ఒక్కసారి సీఎం జగన్‌ని కలిసి కృతజ్ఞతలు తెలపాలని తన కోరిక అని చెప్పాడు.

జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



జగ్జీవన్‌రాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ సురేష్, ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పమిడిముక్కల (పామర్రు): కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం లంకపల్లి ఎట్టివానిగూడెంలో ఆదివారం ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు నందిగం సురేష్ (బాపట్ల ఎంపీ), కైలే అనిల్‌కుమార్‌లు (పామర్రు ఎమ్మెల్యే) దీనిని ఆవిష్కరించారు. అంతకుముందు.. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సభ జరిగింది. ఇందులో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

•నేత్రపర్వంగా ముక్కంటి రథోత్సవం



దక్షిణ కైలాసంగా పేరొందిన చిత్తూరు జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేత్రపర్వంగా ముక్కంటి రథోత్సవం ఆదివారం ఉదయం 11 గంటలకు జరిగింది. భారీగా తరలివచ్చిన భక్తజన సందోహంతో శ్రీకాళహస్తి కిటకిటలాడింది. రథోత్సవ సమయంలో స్వర్ణాభరణాల అలంకరణతో ఉత్సవమూర్తులు దేదీప్యమానంగా వెలుగొందారు. రాత్రి స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. ఎమ్మెల్యే బి.మధుసూదన్‌రెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఎ.తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు పాల్గొన్నారు. – శ్రీకాళహస్తి రూరల్

•శ్రీశైలం వీధుల్లో మల్లన్న విహారం



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశైలంలో ఆదివారం మల్లన్న రథోత్సవం కమనీయంగా సాగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గంగాధర మండపం వద్దకు పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం రథంపై ఆశీనులను చేసి హారతులిచ్చారు. దివ్యరథంపై శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారు విహరించారు. కాగా, శ్రీశైల శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దర్శనార్థం రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సోమవారం శ్రీశైలం రానున్నారు. – శ్రీశైలంటెంపుల్

•బెజవాడలో దివ్య రథోత్సవం



మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో దివ్య రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నుంచి గంగాపార్వతీ సమేత శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి, శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం) నుంచి గంగా, భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, భద్ర కాళీ సమేత వీర భద్ర స్వామి, శ్రీ వసంత మల్లికార్జున స్వామి దేవస్థానం (బుద్ధవారి గుడి) నుంచి గంగా, పార్వతీ సమేత శ్రీ వసంత మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులను రథంపై ఉంచి రథోత్సవం నిర్వహించారు. జానపద కళారూపాలతో రథోత్సవం కనులపండువగా సాగింది. – వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ)



14 ఏళ్ల పరిశోధనల ఫలితం

నాడీపతిలో పీహెచ్‌డీ చేసిన కృష్ణంరాజు వేల ఏళ్ల క్రితమే అంతరించిపోయిన ప్రాచీన భారతీయ సనాతన వైద్యవిధానంతోపాటు అంతరించిపోతున్న అరుదైన పొట్టిజాతి గోవుల పునరుత్పత్తిపై 14 ఏళ్లుగా పరిశోధనలు చేస్తున్నారు. నాడీపతి వైద్య విధానంపై శిక్షణ ఇస్తూ సర్జరీలు, సైడ్‌ఎఫెక్ట్ లేని 100 రకాల థెరపీల ద్వారా దీర్ఘకాలిక రోగాలకు వైద్యం అందిస్తున్నారు. మరోవైపు ప్రపంచంలోనే అత్యంత పొట్టి జాతి ఆవులను సృష్టించాలన్న సంకల్పంతో కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం లింగంపర్తి వద్ద 5 ఎకరాల విస్తీర్ణంలో నాడీపతి గోశాల నెలకొల్పారు. తొలుత పుంగనూరు–బోనీ జాతులను క్రాసింగ్ చేసి 3 అడుగుల ఎత్తు గల పొట్టి ఆవులను అభివృద్ధి చేశారు. వాటిని దేశంలో ఇతర పొట్టి జాతి బ్రీడ్‌లతో కృత్రిమ గర్భధారణ పద్ధతిలో మరిన్ని పొట్టి జాతి ఆవులను అభివృద్ధి చేశారు. చివరగా పుంగనూరుతో బోనీ, మల్నాడ్ గిడ్డ, మినీ మాస్, వేచూరు ఆవులతో క్రాసింగ్ చేసి మైక్రో మినేయేచర్ పుంగనూరు ఆవును సృష్టించారు.



తాను సృష్టించిన మైక్రోమినీయేచర్ గోవులతో డాక్టర్ కృష్ణంరాజు

చిట్టి పొట్టి ఆవులు.. చలాకీ గోవులు

పుంగనూరు జాతిలోనే అత్యంత బుల్లి ఆవు ఇది. 12 అంగుళాల (అడుగు) ఎత్తు.. 36 అంగుళాల (3 అడుగుల) పొడవుండే ఈ ఆవులను 'మైక్రో మినీయేచర్ పుంగనూరు'గా పిలుస్తున్నారు. మనుషులకు ఇట్టే మచ్చికయ్యే ఈ ఆవులు ఇళ్లు, అపార్ట్‌మెంట్లు అనే తేడా లేకుండా.. ఏ వాతావరణంలో అయినా.. ఎక్కడైనా పెరుగుతాయి. వీటి నిర్వహణ ఖర్చు కూడా చాలా తక్కువ. నట్టింట్లో గంతులేస్తూ.. చిన్నపిల్లల మాదిరిగా మారాం చేస్తూ.. యజమానుల చుట్టూనే ఇవి తిరుగుతున్నాయి. గతంలో పెరటికి మాత్రమే పరిమితమైన ఈ బుజ్జి గోవులు ఇప్పుడు బెడ్ రూముల్లోనూ సందడి చేస్తున్నాయి. ఇంటిల్లిపాదికీ ఆనందాన్ని పంచుతున్నాయి.

ఇళ్లు, అపార్ట్‌మెంట్స్‌లో పెంచుకునేలా మినీయేచర్ ఆవుల అభివృద్ధి

- అత్యంత పొట్టివైన మైక్రో మినీయేచర్ గోవుల సృష్టి
- వీటి ఎత్తు 12 అంగుళాలు.. పొడవు 36 అంగుళాలు
- ప్రపంచంలోనే అత్యంత పొట్టి ఆవులు ఇవే
- ఫలించిన నాడీపతి వైద్యుడు కృష్ణంరాజు పరిశోధనలు



నాడీపతి గోశాలలో సందడి చేస్తున్న పొట్టి ఆవులు

సాక్షి, అమరావతి: గోవులు.. మనుషులకు ఎంతో మచ్చికైన జంతువులు. భారతీయ సంస్కృతిలో వీటికి ప్రత్యేక స్థానం ఉంది. పూర్వ అఖండ భారతదేశంలో 302 జాతుల ఆవులు ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్య 32కు పరిమితమైంది. పొట్టి జాతి ఆవుల విషయానికి వస్తే మల్నాడ్ గిడ్డ (కర్ణాటక), వేచూరు (కేరళ), మన్యం (ఆంధ్రప్రదేశ్), బోనీ (బెంగాల్), మినీ మాస్ (నేపాల్) జాతులు ఉన్నాయి. మన్యం–ఒంగోలు బ్రీడ్స్ నుంచి అభివృద్ధి చేసినవే పుంగనూరు ఆవులు. ఇవి 3నుంచి 5 అడుగుల ఎత్తు వరకు ఉంటాయి. పుంగనూరుతో సహా కనుమరుగైన పొట్టి జాతి గోవులను సంరక్షించాలన్న తపనతో కోనసీమ జిల్లాకు చెందిన ప్రముఖ నాడీపతి వైద్యుడు పెన్మత్స కృష్ణంరాజు సాగించిన పరిశోధనల ఫలితంగా అతి చిన్నవైన 'మైక్రో మినీయేచర్ పుంగనూర్' ఆవులు పురుడు పోసుకున్నాయి.

ఏ వాతావరణంలోనైనా పెరిగేలా..

మట్టి నేలలతోపాటు గచ్చు, ఫామ్‌హౌజ్, టైల్స్, మార్బుల్స్‌తో కూడిన ఇళ్లు, అపార్టుమెంట్స్‌లో సైతం పెంచకునేలా 4 రకాలుగా వీటిని అభివృద్ధి చేశారు. అడుగు నుంచి రెండున్నర అడుగుల ఎత్తు, 40 నుంచి 70 కిలోల బరువుతో రోజుకు లీటర్ నుంచి రెండు లీటర్ల వరకు పాలిచ్చేలా వీటిని అభివృద్ధి చేశారు. వీటిలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువ. పశుగ్రాసంతోపాటు ఎలాంటి ఆహారన్నయినా జీర్ణించుకోగలుగుతాయి. పెద్దలకే కాకుండా పిల్లలకు సైతం కూడా ఇట్టే మచ్చికవుతాయి. ఇప్పటివరకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 60 మందికి వీటిని అందించారు. మైక్రో మినీయేచర్ సహా వివిధ జాతులతో అభివృద్ధి చేసిన 500 వరకు పొట్టి జాతుల ఆవులు నాడీపతి గోశాలలో సందడి చేస్తున్నాయి. నిత్యం గో ప్రేమికులు ఈ గోశాలను సందర్శిస్తూ చెంగుచెంగున గంతులేసే పొట్టి గోవుల మధ్య పుట్టిన రోజులు, పెళ్లి రోజులు జరుపుకుంటూ మురిసిపోతున్నారు.



అపార్టుమెంట్లు, ఇళ్లల్లో పెంచుకుంటున్న మినీయేచర్, మైక్రోమినీయేచర్ గోవులు





వాటి అల్లరి చెప్పనలవి కాదు



ఏడాది వయసున్న 2 అడుగుల ఎత్తు గల రెండు మినీయేచర్ పుంగనూరు ఆవులను తీసుకెళ్లి మా అపార్ట్‌మెంట్ 3వ అంతస్తులోని ఫ్లాట్‌లో పెంచుకుంటున్నాం. ఎలాంటి ఆహారం పెట్టినా తింటున్నాయి. మాతో పాటే వాకింగ్ చేస్తాయి. కారులో కూడా మా వెంట తీసుకెళ్తాం. ఇంట్లో అవి చేసే అల్లరి అంతా ఇంతా కాదు. కుటుంబంలో భాగమైపోయాయి. చిన్నప్పటి నుంచి పెరట్లో ఆవులను పెంచుకోవాలన్న మా కోరికను ఇలా తీర్చుకుంటున్నాం.

– వల్లివాటి శ్రీనివాసబాబు, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్

వాటి మధ్య ఉంటే టెన్షన్ హుష్‌కాకి



మా ఇంట్లో రెండు మినీయేచర్ గిత్తలను పెంచుకుంటున్నాం. అవి మా ఇంటికి వచ్చినప్పటి నుంచి మేమంతా చాలా ఆనందంగా ఉన్నాం. వాటిని చూస్తే చాలు మాలో ఉన్న టెన్షన్స్ చేత్తో తీసేసినట్టు పోతాయి. మాతోనే ఉంటున్నాయి. మాతో పాటే తింటున్నాయి. వాటికి ప్రత్యేకంగా బెడ్స్ కూడా ఏర్పాటు చేశాం. మాతో పాటే పడుకుంటున్నాయి.

– పి.సూర్యనారాయణరాజు, పత్తేపురం, పశ్చిమ గోదావరి జిల్లా

లక్ష్మి, విష్ణు అని పేర్లు పెట్టాం



రెండు మినీయేచర్ పుంగనూరు ఆవుల్ని తెచ్చుకున్నాం. లక్ష్మి, విష్ణు అని పేర్లు పెట్టుకున్నాం. పేరు పెట్టి పిలవగానే చెంగున వచ్చి ఒడిలో వాలిపోతాయి. వాటిని చంటిపాపల్లా చూసుకుంటున్నాం. అవి లేకుండా ఉండలేకపోతున్నాం. ఎక్కడికెళ్లినా వెంట తీసుకెళ్తున్నాం. వాటితో గడుపుతుంటే మనసు ఎంతో ప్రశాంతంగా, ఉల్లాసంగా ఉంటుంది

– అమటం పద్మావతి, విశాఖ

ప్రపంచంలో ఎక్కడా లేవు



1,632 ఆవులను బ్రీడింగ్ చేయడం ద్వారా వీటిని ఒక అడుగు ఎత్తు వరకు తీసుకురాగలిగాం. మినియేచర్ పుంగనూరు ఆవుల ఎత్తు 2 అడుగుల్లోపు కాగా, మైక్రో మినీయేచర్ పుంగనూరు ఆవుల ఎత్తు అడుగులోపే. ప్రపంచంలో ఇవే అత్యంత పొట్టి జాతి ఆవులు. వీటికి పేటెంట్ హక్కు కోసం దరఖాస్తు చేశా. వచ్చే పదేళ్లలో కనీసం లక్ష ఆవులను పునరుత్పత్తి చేసి అడిగిన ప్రతీ ఒక్కరికి అందించాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నా.

– డాక్టర్ పెన్మత్స కృష్ణంరాజు, పరిశోధకుడు, నాడీపతి గోశాల వ్యవస్థాపకుడు

దైవదర్శనానికి వెళ్లి వస్తూ మృత్యు ఒడికి..

- రోడ్డు ప్రమాదంలో ఐదుగురి దుర్మరణం
- ఎస్‌ఐ భార్య, కుమార్తె, మరో ముగ్గురు మృతి
- మేదరమెట్ల వద్ద దుర్ఘటన



ఎస్‌ఐ భార్య వహిదా, కుమార్తె అయేషా (ఫైల్)



జయశ్రీ (ఫైల్)



డ్రైవర్ బ్రహ్మచారి (ఫైల్)



దివ్యతేజ (ఫైల్)

అద్దంకి/మేదరమెట్ల: దైవ దర్శనం చేసుకుని తిరిగి ఇంటికి వెళుతున్న ఓ ఎస్‌ఐ భార్య, కుమార్తె, మరో ముగ్గురిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ఈ దుర్ఘటన బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల వద్ద జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగింది. అద్దంకి ఎస్‌ఐగా పని చేస్తున్న సుమందర్ వలికి బాపట్ల జిల్లా చినగంజాంలో శివరాత్రి సందర్భంగా జరుగుతున్న తిరునాళ్ల వద్ద బందోబస్తు విధులు కేటాయించారు. ఆయన అక్కడ విధులు నిర్వర్తిస్తూనే దైవదర్శనం కోసం తన భార్య వహిదా వలి (38), కుమార్తె ఆయేషా ఉమెరా వలి (9)తోపాటు తమ ఫ్యామిలీ ఫ్రెండ్ అయిన గుంటూరు గుజ్జనగుండ్లకు చెందిన శ్రీనివాసరావు భార్య జయశ్రీ (50), ఆమె కుమార్తె దివ్యతేజ (29)ను చినగంజాం తీసుకురావాలని అద్దంకిలోని అభ్యుదయనగర్‌కు చెందిన డ్రైవర్ కె.బ్రహ్మచారి(22)కి చెప్పారు. ఈ మేరకు బ్రహ్మచారి కారులో అద్దంకి నుంచి వహిదా వలి, ఆయేషా ఉమెరా వలి, జయశ్రీ, దివ్యతేజను తీసుకుని శనివారం మధ్యాహ్నం చినగంజాం వచ్చారు. దైవదర్శనం అనంతరం రాత్రికి తాము వచ్చిన కారులోనే అద్దంకి బయలుదేరారు. మార్గమధ్యంలో మేదరమెట్ల వద్ద జాతీయ రహదారిపై టైరు పంక్చర్ కావడంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎగిరి అవతలి వైపున రహదారిలో పడింది. అదే సమయంలో అటువైపు వస్తున్న లారీ వేగంగా ఆ కారును ఢీకొట్టి 40మీటర్ల మేరకు ఈడ్చుకువెళ్లింది. దీంతో కారులో ఉన్న వహిదా వలి, ఆయేషా ఉమెరా వలి, జయశ్రీ, దివ్యతేజ, డ్రైవర్ బ్రహ్మచారి అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికుల సమాచారం మేరకు అద్దంకి సీఐ రోశయ్య ఘటనాస్థలానికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీయించారు. మృతదేహాలకు ఆదివారం అద్దంకి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మరోవైపు ఘటనాస్థలాన్ని ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. అనంతరం అద్దంకి ప్రభుత్వాస్పత్రి వద్దకు చేరుకుని ఎస్‌ఐ సమందర్ వలిని పరామర్శించారు. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య కూడా ఎస్‌ఐని పరామర్శించారు.

ఘనంగా శ్రీఅనంతాళ్వార్ అవతారోత్సవం



అనంతాళ్వార్‌తోటలో (పురశైవారితోట) ఉత్సవంలో పాల్గొన్న జీయర్ స్వామీజీలు

తిరుమల: శ్రీవైష్ణవ భక్తాగ్రేసరుడు, ఆళ్వారులలో ప్రముఖుడైన శ్రీఅనంతాళ్వారు 969వ అవతారోత్సవం తిరుమలలోని అనంతాళ్వార్ తోటలో (పురశైవారితోట) ఆదివారం ఘనంగా జరిగింది. అనంతాళ్వారు వంశీకులు 'నాలాయిర దివ్యప్రబంధ గోష్ఠిగానం' నిర్వహించారు. తిరుమల పెద్ద జీయర్ స్వామి అనుగ్రహభాషణం చేస్తూ 102 ఏళ్ల సుదీర్ఘ జీవన ప్రస్థానంలో స్వామివారికి పుష్పకైంకర్యాన్ని ప్రారంభించిన శ్రీవైష్ణవ భక్తాగ్రేసరుడు శ్రీ అనంతాళ్వార్ అని కొనియాడారు. తిరుమల చిన్నజీయర్‌స్వామి అనుగ్రహభాషణం చేస్తూ తిరుమలలో వివిధ రకాల సుగంధ భరిత పుష్పాల మొక్కల తోటను ఏర్పరచి, తన జీవితాన్ని భగవంతుని పాదాలవద్ద పుష్పంగా సమర్పించుకున్నారని వివరించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన బసవరాజు విజయలక్ష్మి రచించిన 'భక్తి–ముక్తి' అనే పుస్తకం, అనంతాళ్వార్‌పై మరో కన్నడ పుస్తకాన్ని పెద్ద జీయర్ స్వామి ఆవిష్కరించారు. అనంతాళ్వార్ వంశీకులు తాతాచార్యులు, టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం అధికారి విజయలక్ష్మి, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ పురుషోత్తం పాల్గొన్నారు. కాగా, తిరుమలలో శనివారం అర్ధరాత్రి వరకు 71,350 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,912 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.47 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 22 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జాతరకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

- రక్షణ గోడను ఢీకొన్న బైక్.. లోయలో పడి ముగ్గురు యువకుల మృతి
- అనంతగిరి మండలంలో ఘటన



ముగ్గురు యువకుల మృతదేహాలు

అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా): మహాశివరాత్రి జాతరకు వెళ్లి వస్తూ ముగ్గురు యువకులు లోయలోపడి మృతిచెందారు. ఈ ఘటన అనంతగిరి మండలంలోని డముకు–నిమ్మలపాడు రోడ్డులోని రాయిపాడు సమీపాన ఆదివారం ఉదయం జరిగింది. హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ దిగసల్తాంగి గ్రామానికి చెందిన రాపా బుట్టన్న (35), సీదరి రాంబాబు(21), బొండం గణేష్(18) కలిసి ద్విచక్రవాహనంపై బొర్రాలో మహాశివరాత్రి జాతరకు శనివారం బయలుదేరి వెళ్లారు. అక్కడ నుంచి లంగుపర్తి గ్రామంలోని జాతరకు కూడా వెళ్లారు. రెండు ప్రాంతాల్లోనూ సరదాగా గడిపిన వారు ఆదివారం ఉదయం ఐదు గంటలకు స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో రాయిపాడు సమీపంలోని మలుపు వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి రక్షణగోడను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు ఎగిరి లోయలో పడిపోయారు. దీంతో తీవ్రంగా గాయపడిన బుట్టన్న, రాంబాబు, గణేష్ ఘటనాస్థలంలోనే మృతిచెందారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌ఐ కరక రాము ఘటనాస్థలాన్ని పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అరకు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన బుట్టన్నకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కాలికి ట్యాగ్‌తో కపోతం కలకలం



ఎటపాక: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెంలో ఆదివారం ఓ పావురం కలకలం రేపింది. మండలంలోని టీపీ వీడు పంచాయతీలోని గోదావరి నది ఒడ్డున శివాలయం వద్ద పావురం ఆకాశంలో ఎగురుతుండగా దానిపై గెద్ద దాడి చేసింది. గాయపడి కింద పడిన పావురాన్ని మత్స్యకారులు పట్టుకున్నారు. దానికి కాలుకి నంబర్లు కలిగిన 2 ట్యాగ్‌లు ఉండటాన్ని గుర్తించారు. ఈ పావురం ఎక్కడ నుంచి ఈ ప్రాంతానికి వచ్చింది, పావురం కాలికి ఉన్నవి జీపీఎస్ కలిగిన ట్యాగ్‌లేనా? ఈ పావురాన్ని ఎవరు ఇక్కడికి పంపారనే ప్రశ్నలు తలెత్తాయి. ఈ సమాచారం పోలీసులకు తెలపడంతో వారు దీనిపై విచారణ చేశారు. చెన్నైకి చెందిన గుడ్ విన్ పిజన్ రేసింగ్ సొసైటీ (జీపీఆర్‌ఎస్) పావురమని, వారం క్రితం పావురాల పోటీల్లో 550 కి.మీ రేసింగ్‌లో భాగంగా వరంగల్‌లో 40 పావురాలను వారు ఎగురవేశారని పోలీసులు తెలిపారు. పావురం కాలికి ఉన్న ట్యాగ్‌లోని నంబర్లు రేసింగ్, పావురం కోడ్‌కు సంబంధించినవని, రిజిస్టర్డ్ సొసైటీకి చెందిన పావురమని సీఐ గజేంద్రకుమార్ చెప్పారు.

క్లుప్తంగా...

విచారణకు కొంత సమయమివ్వండి

సీబీఐకి సిసోడియా లేఖ



న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మళ్లీ విచారణకు హాజరయ్యేందుకు కొంత సమయం కావాలని ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా సీబీఐకి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పనలో బిజీగా ఉన్నందున వెంటనే వీలుకాదని ఆర్థిక మంత్రిగా కూడా వ్యవహరిస్తున్న సిసోడియా పేర్కొన్నారు. ఈ నెల చివరి వారంలో వీలు కుదురుతుందని, సీబీఐ అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానమిస్తానని అందులో వివరించారు. సిసోడియా వినతిని పరిశీలించామని, విచారణకు మరో తేదీని త్వరలోనే నిర్ణయిస్తామని సీబీఐ అధికారులు తెలిపారు. ఈ కేసులో మూడు నెలల క్రితం కోర్టులో చార్జిషీట్ వేసిన సీబీఐ ఆదివారం జరిగే విచారణకు రావాలంటూ సిసోడియాకు సమన్లు జారీ చేసింది. ఢిల్లీ మున్సిపల్ మేయర్ ఎన్నిక విషయంలో సుప్రీం కోర్టులో ఓటమి పాలైన కేంద్ర ప్రభుత్వం మద్యం కేసులో తనను అరెస్ట్ చేయడం ద్వారా ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోందని సిసోడియా మీడియాతో వ్యాఖ్యానించారు. ఢిల్లీ ప్రజలకు అత్యంత అవసరమైన బడ్జెట్ రూపకల్పన కోసమే సీబీఐని గడువు కోరినట్లు వెల్లడించారు. అరెస్టయ్యేందుకు గానీ, జైలుకు వెళ్లేందుకు గానీ తానేమీ భయపడటం లేదని చెప్పారు.

సరిహద్దుల్లో డ్రోన్, హెరాయిన్ లభ్యం

గురుదాస్‌పూర్: భారత్– పాక్ అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంలో బీఎస్ఎఫ్ ఒక డ్రోన్‌ను, హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. సరిహద్దుల్లోని పంజాబ్ రాష్ట్రం గురుదాస్‌పూర్ జిల్లా ధనియాకె గ్రామం వద్ద ఆదివారం ఉదయం 9.15 గంటల సమయంలో ఘటన జరిగింది. సరిహద్దు వెంట స్మగ్లర్ల అనుమానాస్పద కదలికలతో అప్రమత్తమైన జవాన్లు ఆ ప్రాంతంలో సోదాలు చేపట్టారు. తొమ్మిది కిలోల బరువును మోయగలిగే చైనా తయారీ డ్రోన్ వారికి కనిపించింది. అందులో నాలుగు ప్యాకెట్లలో 2.730 గ్రాముల బరువున్న హెరాయిన్ లభ్యమైంది. శనివారం ఖసావలి గ్రామం సమీపంలో బీఎస్ఎఫ్ బలగాలు సరిహద్దు కంచెకు 30 మీటర్ల దూరంలో పడి ఉన్న 15 అడుగుల పొడవైన పైపులో 20 ప్యాకెట్ల హెరాయిన్‌ను, రెండు పిస్టళ్లు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి.

భస్మాసుర హస్తం!

పాకిస్తాన్‌లో తాలిబన్ల ధ్వంసరచన ● దేశాన్ని చెప్పచేతల్లోకి తీసుకునే దిశగా పావులు

ఆర్థికంగా దివాలా తీశామని ఒకవైపు దేశ రక్షణ మంత్రే ప్రకటిస్తున్న పరిస్థితుల్లో తెహ్రిక్-ఇ-తాలిబన్ రూపంలో కొత్త ముప్పుని ఎదుర్కొంటోంది. అఫ్గాన్‌లో తాలిబన్లు అధికారం చేజిక్కించుకున్నప్పుడు సంబరాలు చేసుకున్న పాకిస్తాన్ ఇప్పుడు తాము బలిపశువుగా మారినందుకు ఎలా అడుగు లు వెయ్యాలో తెలీక బిత్తరపోతోంది. ఎవరీ తెహ్రిక్-ఇ-తాలిబన్లు, వారి లక్ష్యమేంటి ..? – సాక్షి, నేషనల్ డెస్క్



2021, ఆగస్టు అఫ్గాన్‌లో తాలిబన్ ప్రభుత్వం ఏర్పాటైన సందర్భం...

పాకిస్తాన్‌లో సంబరాలు జరిగాయి. తమ కనుసన్నల్లో మెలిగిన తాలిబన్లు అమెరికానే తరిమి కొట్టారని, అగ్రరాజ్యంపై ఇస్లాం ఘన విజయం సాధించిందంటూ నాయకులందరూ ప్రకటనలు గుప్పించారు. ఆ నాటి పాక్ ఐఎస్ఐ చీఫ్ ఫయాజ్ హమీద్ కాబూల్‌కు వెళ్లి తాలిబన్ల ప్రభుత్వ స్థాపనకు స్వయంగా ఏర్పాట్లు చేసి మరీ వచ్చారు.

నెల రోజులయ్యేసరికి..

అఫ్గాన్‌లో అధికారంలోకొచ్చిన తాలిబన్ల అండతో తెహ్రిక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) రెచ్చిపోవడం ప్రారంభించింది. పాకిస్తాన్ సార్వభౌమాధికారాన్నే ప్రశ్నిస్తూ దాడులకు దిగడం మొదలు పెట్టింది. 2021 ఆగస్టు నుంచి 2022 ఆగస్టు వరకు పాక్‌లో కనీసం 250 దాడులు జరిగాయని పాక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పీస్ స్టడీస్ (పీఐపీఎస్) గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. అంతకు ముందు ఏడాదితో పోల్చి చూస్తే దాడుల సంఖ్య రెట్టింపు అయింది. ఈ దాడుల్లో 95శాతం బెలూచిస్తాన్, ఖైబర్ పఖ్తుఖ్వా(కె.పి)లో కీలక ప్రాంతాలు లక్ష్యంగా జరిగాయి. భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకునే దాడులు జరుపుతున్నారు. ఈ ఏడాది జనవరిలో 100 మంది ప్రాణాలను బలితీసుకున్న పెషావర్ మసీదు దాడి ఘటన జరిగిన కొద్ది రోజులకే కరాచీలో పోలీసుల్ని లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగడం ఆందోళన కలిగిస్తోంది.

> పాకిస్తాన్‌లో ఉగ్ర దాడులకు ఐసిస్ అవసరం లేదు. పాకిస్తానీ తాలిబన్లు చాలు. అఫ్గానిస్తాన్ తరహాలో ఏదో ఒకరోజు తాలిబన్లు పాకిస్తాన్‌ను స్వాధీనం చేసుకున్నా ఆశ్చర్యపడాల్సిన పని లేదు.
> – తస్లీమా నస్రీన్, బంగ్లాదేశ్ రచయిత్రి



ఏమిటీ టీటీపీ

తెహ్రిక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్‌ను టీటీపీ అని పిలుస్తారు. అఫ్గానిస్తాన్‌లో తాలిబన్ల మద్దతుతో వీళ్లు తమ కార్యకలాపాలు నిర్వహిస్తారు. 2001లో అమెరికాపై ట్విన్ టవర్స్ దాడి తర్వాత అగ్రరాజ్యం చేసిన ఉగ్రవాదుల ఏరివేత కార్యక్రమానికి పాకిస్తాన్ అండగా నిలవడంతో తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసిన వీరంతా ఒక గూటి కిందకి చేరారు. పాక్ విధానాలను వ్యతిరేకిస్తూ దక్షిణ వజిరిస్తాన్‌లో బైతుల్లా మెహసూద్ నేతృత్వంలో 2007లో తెహ్రిక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) ఏర్పాటైంది. టీటీపీ ప్రస్తుత చీఫ్ నూర్ వలీ మెహసూద్ అఫ్గాన్ నుంచి పాక్‌లో హింసను రాజేస్తున్నాడు.

దివాలా తీశాం: పాక్ రక్షణ మంత్రి

ఆర్థిక సంక్షోభంతో విలవిలలాడుతున్న పాకిస్తాన్ రేపో మాపో దివాలా తీస్తుందని అందరూ అనుకుంటున్న వేళ ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ బాంబు లాంటి నిజం చెప్పారు. ఇప్పటికే దేశం దివాలా తీసిందని అన్నారు. ఆదివారం సియాల్‌కోట్‌లో ఒక కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ''పాక్ దివాలా తీస్తుందన్న వార్తలు మీరు వినే ఉంటారు. వాస్తవానికి ఇప్పటికే దేశం దివాలా తీసింది. మనం ప్రస్తుతం దివాలా తీసిన దేశంలో బతుకుతున్నాం'' అని కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పారు. దేశంలో ఆర్థిక సమస్యల పరిష్కారానికి అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఏమీ చేయలేదని మనమే ఏదో ఒకటి చెయ్యాలన్నారు. పాకిస్తాన్‌లో చట్టం, రాజ్యాంగాన్ని అనుసరించడం లేదని, ఈ దుస్థితికి రాజకీయ నాయకులు, అధికార యంత్రాంగం, మన వ్యవస్థలు అన్నీ బాధ్యతవహించాలన్నారు.

టీటీపీ లక్ష్యాలేంటి ?

పాకిస్తాన్ మిలటరీ విధానాలను తీవ్రంగా వ్యతిరేంచిన ఈ సంస్థ దేశాన్ని తన నియంత్రణలోకి తెచ్చుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తోంది. 2021లో అఫ్గాన్ నుంచి అమెరికా, నాటో దళాలు వెళ్లిపోయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాక పాకిస్తాన్‌పై దృష్టి సారించింది. ఇస్లాం విస్తరణ తాలిబన్ల ప్రధాన ధ్యేయంగా మారింది. అఫ్గానిస్తాన్‌లో మాదిరిగా పాకిస్తాన్‌లో కూడా ప్రభుత్వాన్ని కూల్చివేసి ఇస్లామిక్ రాజ్యాన్ని స్థాపించి షరియా చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఉవ్విళ్లూరుతోంది. పాకిస్తాన్ జైళ్లలో ఉన్న తమ వారిని బయటకు తీసుకురావాలని, అఫ్గాన్, పాక్ సరిహద్దుల్లోని గిరిజన ప్రాంతాల్లో పాకిస్తాన్ సైనికుల్ని వెనక్కి తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలంటూ పాక్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తోంది.

అనుకున్నదొక్కటి అయినదొక్కటి.!

అఫ్గానిస్తాన్‌లో తాలిబన్ల ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే పరిస్థితులన్నీ తమకు అనుకూలంగా మారిపోతాయని పాక్ ప్రభుత్వం భావించింది. రెండు దశాబ్దాల పాటు అఫ్గాన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు సాయం అందించి అంతర్జాతీయంగా మంచి పేరు సంపాదించుకున్న భారత్ ఓ పక్కకి వెళ్లిపోతుందని ఆనందపడింది. అయితే సరిహద్దు రూపంలో తాలిబన్లతో సమస్య మొదలైంది. డ్యూరాండ్ రేఖపై ఇరుదేశాల మధ్య విభేదాలు తలెత్తాయి. టీటీపీ తుపాకీలు వదిలి జన జీవన స్రవంతిలోకి రావాలని పాక్ సర్కార్ చేసిన ప్రయత్నాలు కొనసాగలేదు. సరిహద్దుల్లో ఉన్న గిరిజనుల్ని పాక్ చేతుల నుంచి విడిపించడమే తమ లక్ష్యమన్నట్టుగా టీటీపీ మారిపోయింది. అఫ్గానిస్తాన్ సరిహద్దుల నుంచి సైన్యాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. కొన్నాళ్లు కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ పాకిస్తాన్ కొత్త ఆర్మీ చీఫ్‌గా గత ఏడాది నవంబర్‌లో జనరల్ ఆసీమ్ మునీర్ బాధ్యతలు స్వీకరించగానే కాల్పుల విరమణను రద్దు చేసింది. అప్పట్నుంచి పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడులు, ప్రభుత్వ అధికారుల కిడ్నాప్‌లు, బెదిరింపులు వంటివి చేయసాగింది. మరోవైపు పాక్ ప్రభుత్వం కూడా తాలిబన్లను అదుపు చేయడానికి దాడులకు దిగుతూ ఉండడంతో ఇరుపక్షాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోతున్నాయి. ఇన్నాళ్లూ అఫ్గాన్‌లో మంచి తాలిబన్లు, పాక్‌లో ఉన్న టీటీపీ చెడ్డ తాలిబన్లు అని భావించిన పాక్‌కు ఇద్దరూ చేతులు కలపడంతో అనుకున్నదొక్కటి అయినది ఒక్కటి అని నిట్టూరుస్తోంది. ఈ పరిణామాలన్నీ దేశంలో అంతర్యుద్ధానికి దారి తీయవచ్చనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.



అమెరికాలో కాల్పులు.. ముగ్గురు బాలికలు మృతి

గలెనా పార్క్: అమెరికాలోని హూస్టన్ శివారులోని ఓ ఇంట్లో ఆదివారం జరిగిన కాల్పుల ఘటనలో 13, 14, 19 వయస్సున్న ముగ్గురు బాలికలు చనిపోయారు. 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడి జరిపిన దుండగుడు పారిపోయేందుకు అవకాశమివ్వగా ఆమె ఇంట్లో ఉన్న ఏడాది చిన్నారి సహా అక్కడి నుంచి సురక్షితంగా బయటపడినట్లు పోలీసులు వెల్లడించారు. స్వల్ప గాయాలతో వీరిద్దరూ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారన్నారు. అనంతరం సాయుధుడు(38) తనను తాను కాల్చుకుని చనిపోయాడు.

సిరియాపై ఇజ్రాయెల్ దాడులు..ఐదుగురు మృతి

డెమాస్కస్: సిరియా రాజధాని డెమాస్కస్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం ఐదుగురు చనిపోగా, 15 మంది వరకు గాయపడ్డారు. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో రాజధానిలోని నివాస భవనసముదాయాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు దిగిందని ప్రభుత్వ వార్తా సంస్థ సనా పేర్కొంది. వందల ఏళ్లనాటి కోట, ఒక కళాశాల ధ్వంసమయ్యాయని వివరించింది. ఇరాన్ అనుకూల హిజ్బొల్లా మిలిటెంట్లే లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో కనీసం 15 మంది చనిపోయినట్లు యూకే కేంద్రంగా పనిచేసే సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ పేర్కొంది. కాగా, ఈ ఘటనపై స్పందించేందుకు ఇజ్రాయెల్ నిరాకరించింది.

అక్రమాలకు సూత్రధారి వినోద్ అదానీయే : కాంగ్రెస్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ సంస్థల్లో అక్రమాలకు గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీయే ప్రధాన సూత్రధారి అని కాంగ్రెస్ పేర్కొంది. ఒక సంస్థ ఆస్తులను చూపి మరో సంస్థకు రుణాలు పొందారని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. సెబీ, ఈడీల దర్యాప్తునకు ఈ అర్హతలు సరిపోవా అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వినోద్‌కు చెందిన విదేశాల్లోని షెల్ కంపెనీలు కోట్లాది రూపాయలను భారత్‌లోని అదానీ పబ్లిక్ లిస్టెడ్, ప్రైవేట్ సంస్థలకు మళ్లించారన్నారు. వినోద్‌తో తమకు సంబంధం లేదంటూ అదానీ గ్రూప్ తప్పుదోవ పట్టించిందన్నారు.

మధ్యవర్తిత్వంలో కృత్రిమ మేధ

కేంద్ర న్యాయ మంత్రి రిజిజు

న్యూఢిల్లీ: దేశంలో సంస్థాగత మధ్యవర్తిత్వం అవసరం ఎంతో ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు చెప్పారు. అడ్ హక్ మధ్యవర్తిత్వంలో లోపాలున్నాయని ఆయన చెప్పారు. కోర్టుల జోక్యానికి వీలుండటం వల్ల అంతిమ తీర్పు ఆలస్యమవుతుందని మంత్రి చెప్పారు. రీసెర్చ్, రివ్యూ వంటి విషయాల్లో మధ్యవర్తిత్వ దారులకు కృత్రిమ మేధ ఉపయోగకారిగా ఉంటుందని తెలిపారు. ఢిల్లీ హైకోర్టులో ఆదివారం మధ్యవర్తిత్వంపై జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సంజయ్ కౌల్ మాట్లాడారు. మధ్యవర్తిత్వ విచారణల్లో వెలువడే తీర్పులకు కక్షిదారులు కట్టుబడి ఉండాలే తప్ప పై కోర్టులకు వెళ్లడం తగదన్నారు.

'చంద్రయాన్-3'లో కీలక పరీక్ష విజయవంతం



బెంగళూరు: చంద్రయాన్-3 ప్రాజెక్టులో భాగంగా నిర్వహించిన ఎలక్ట్రో-మ్యాగ్నెటిక్ ఇంటర్‌ఫియరెన్స్/ఎలక్ట్రో-మ్యాగ్నెటిక్ కంపాటిబిలిటీ(ఈఎంఐ/ఈఎంసీ) పరీక్ష విజయవంతమైందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఆదివారం ప్రకటించింది. బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకూ ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలియజేసింది. శాటిలైట్ ఉప వ్యవస్థలు అంతరిక్ష వాతావరణంలో సక్రమంగా పనిచేసేలా చూడడానికి ఈఎంఐ/ఈఎంసీ టెస్టు నిర్వహించారు. శాటిలైట్ ప్రయోగాల్లో ఇది ముఖ్యమైన పరీక్ష అని ఇస్రో పేర్కొంది. చంద్రుడిపైన లూనార్‌ను క్షేమంగా దించడమే లక్ష్యంగా చంద్రయాన్-3 ప్రయోగాన్ని ఈ ఏడాది జూన్‌లో చేపట్టే అవకాశం ఉంది. 2019లో చంద్రయాన్-2 ప్రయోగం విఫలమైన సంగతి తెలిసిందే.

ఛత్రపతి శివాజీ ప్రారంభించారు.. మోదీ కొనసాగిస్తున్నారు: అమిత్ షా

పుణే: మొగలులు, ఇతర విదేశీ దురాక్రమణదారులు ధ్వంసం చేసిన ఆలయాలను ఛత్రపతి శివాజీ పునర్నిర్మించారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా శ్లాఘించారు. మరాఠా యోధుడు ప్రారంభించిన ఆ పనిని ప్రధాని మోదీ నేడు కొనసాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దురాగతాలకు వ్యతిరేకంగా పోరాడేందుకే శివాజీ తన జీవితాన్ని పణంగా చెప్పారన్నారు. పుణేలోని నర్హే-అంబేగావ్‌లో శివాజీ జీవితగాథ ఆధారంగా 'శివసృష్టి' ఇతివృత్తంతో 21 ఏకరాల్లో ఏర్పాటవుతున్న పార్క్ మొదటి దశను అమిత్ షా ప్రారంభించారు. 'శివాజీ అనంతరం ధ్వంసమైన ఆలయాల పునర్నిర్మాణాన్ని ప్రధాని కొనసాగిస్తున్నారు. పలు దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నారు'అన్నారు.

శివాజీ ఆశీస్సులతో విల్లు, బాణం: షిండే

ఛత్రపతి శివాజీ ఆశీస్సులతో తమకు శివసేన ఎన్నికల గుర్తు 'విల్లు, బాణం' లభించిందని కార్యక్రమంలో పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చెప్పారు. శివసృష్టి ప్రాజెక్టును అద్భుతంగా తీర్చిదిద్దుతామని షిండే చెప్పారు. మహారాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాని మోదీ, అమిత్ షా తమ వెనక కొండంత అండగా నిలిచారని శనివారం ఆయన పేర్కొనడం తెలిసిందే.

మీరు మళ్లీ యువకులైపోతే...?

బిల్‌గేట్స్, రిషితో చాట్‌జీపీటీ ఆసక్తికర ఇంటర్వ్యూ



లండన్: చాట్‌జీపీటీ. ప్రపంచమంతటా విశేషంగా ఆదరణ పొందుతున్న కృత్రిమ మేధ ఏఐ) ఆధారిత చాట్‌బాట్. టెక్ ప్రపంచంలో కొత్త ఒరవడికి నాంది పలికింది చాట్‌జీపీటీ. సందేహాలు తీర్చుకోవాలన్నా, సంగీత స్వరాలు కూర్చాలన్నా, కవిత్వం రాయాలన్నా, వ్యాసాలు సిద్ధం చేసుకోవాలన్నా, కొత్త ఐడియాలు సృష్టించుకోవాలన్నా, చివరికి ప్రేమలేఖ రాయాలన్నా చలో చాట్‌జీపీటీ అనే పరిస్థితి! మరి చాట్‌జీపీటీయే యాంకర్ అవతారమెత్తితే? ఇద్దరు అత్యంత ప్రముఖులను ఇంటర్వ్యూ చేస్తే? అదే జరిగింది! బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌లకు చాట్‌జీపీటీ పలు ప్రశ్నలు సంధించి వారి నుంచి ఆసక్తికరమైన సమాధానాలు రాబట్టింది. చాట్‌జీపీటీతో తమ ఇంటర్వ్యూను బిల్ గేట్స్ లింక్డ్ఇన్‌లో షేర్ చేశారు. తమ సంభాషణ అద్భుతంగా సాగిందన్నారు. రిషి మాటలతో వీడియో మొదలైంది. బిల్ గేట్స్, తాను లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీలో ఉన్నామని, యూకేలో క్లీన్ టెక్నాలజీ రంగంలోని అగ్రశ్రేణి ఆవిష్కర్తలను కలిశామని ఆయన చెప్పారు. తర్వాత గేట్స్ తెరపైకి వచ్చి సంభాషణలో పాలుపంచుకున్నారు. తమను చాట్‌జీపీటీ ఇంటర్వ్యూ చేయబోతోందని అన్నారు.

ఇలా సాగింది...

రాబోయే పదేళ్లలో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ, జాబ్ మార్కెట్‌పై టెక్నాలజీ ప్రభావం ఏ మేరకు ఉండబోతోందని చాట్‌జీపీటీ ప్రశ్నించింది. ప్రధానంగా ఆరోగ్య సంరక్షణ, విద్యా రంగాల్లో నిపుణులైన ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉందని, మరింత సమర్థులు అవసరమని గేట్స్ బదులిచ్చారు. ఈ విషయంలో కృత్రిమ మేధ వంటి టెక్నాలజీ సహకరిస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక టెక్నాలజీతో నైపుణ్యాలున్న మానవ వనరులను తయారు చేసుకోవచ్చన్నారు. అనంతరం, ''కాలచక్రంలో మీరు యువకులుగా ఉన్న రోజుల్లోకి, అంటే మీ కెరీర్ ప్రారంభంలో ఉన్న నాటికి వెళ్తే మీకు మీరు ఎలాంటి సలహా ఇచ్చుకుంటారు?'' అంటూ చాట్‌జీపీటీ ఆసక్తికరమైన ప్రశ్న వేసింది. అతిగా ఆలోచించడం మాని వర్తమానంలో జీవించేందుకు మరింతగా ప్రయత్నిస్తామంటూ వారిద్దరూ అంతే ఆసక్తికరంగా సమాధానమిచ్చారు! ''కెరీర్ ఆరంభంలో చాలా ఏళ్ల పాటు వీకెండ్స్, సెలవులంటే నాకు పెద్దగా ఇష్టముండేది కాదు. ఎక్కువగా ఆలోచించేవాన్ని. కష్టపడి పని చేసేవాన్ని. కానీ, అంత అతిగా శ్రమించడం అవసరం లేదని ఇప్పుడు భావిస్తున్నా'' అని గేట్స్ చెప్పారు. దానితో రిషి కూడా ఏకీభవించారు. ''మాది బ్రిటన్‌కు వలస వచ్చిన కుటుంబం. కనుక బాగా పనిచేసి అన్నింటా ముందంజలో ఉండాలని అప్పట్లో ఎంతో ప్రయత్నించేవాడిని. కానీ గతంలోనూ, భవిష్యత్తులోనూ కాకుండా వర్తమానంలోనే జీవించాలని క్రమంగా తెలుసుకున్నా'' అని చెప్పుకొచ్చారు.

ఏఐని వాడేస్తున్నారు!

కృత్రిమ మేధ (ఏఐ) మీకెలా ఉపయోగపడుతోందని గేట్స్, రిషిలను చాట్‌జీపీటీ అడిగింది. ఏదైనా నోట్స్ రాసుకున్నప్పుడు దాన్ని మరింత 'తెలివైనదిగా' మార్చడానికి ఏఐ ఉపయోగిస్తున్నట్టు గేట్స్ తెలిపారు. పాటలు, పద్యాలు రాయడానికి కూడా వాడుకుంటున్నానన్నారు. తన కోసం ఏఐ ప్రతివారం 'పీఎం క్వశ్చన్ టైమ్' నిర్వహిస్తే చాలా సంతోషిస్తాని రిషి చెప్పారు.

రష్యాకు సహకరిస్తే ఆంక్షలు తప్పవు

చైనాకు అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ హెచ్చరికలు

వాషింగ్టన్: ఉక్రెయిన్‌పై యుద్ధం సాగిస్తున్న రష్యాకు చైనా ఆయుధపరమైన సాయం అందించడం, అమెరికా భూభాగంపైకి నిఘా బెలూన్‌ను పంపించడంపై అమెరికా తీవ్ర నిరసన తెలిపింది. రష్యాకు సాయమందిస్తే ఆంక్షలు తప్పవని హెచ్చరించింది. జర్మనీలోని మ్యూనిక్‌లో జరుగుతున్న సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో భాగంగా అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, చైనా ఉన్నతస్థాయి దౌత్యవేత్త వాంగ్ యీతో శనివారం భేటీ అయ్యారు. 'మా గగనతలంలోకి నిఘా బెలూన్‌ను పంపించడం అంతర్జాతీయ చట్టాలకు, మా సార్వభౌమత్వానికి భంగం కలిగించడమే. ఇలాంటి బాధ్యతారాహిత్య ఘటన పునరావృతం కారాదు' అని బ్లింకెన్ స్పష్టం చేశారని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి నెడ్ ప్రైస్ చెప్పారు. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాకు ఆయుధ, ఇతరత్రా సాయం అందజేస్తే తీవ్ర ఆంక్షలు విధిస్తామని కూడా బ్లింకెన్ చెప్పారు. అయితే ఇలాంటి చర్యలతో అమెరికా తన బలం చూపాలనుకుంటే విరుద్ధ ఫలితాలే వస్తాయని వాంగ్ యీ బదులిచ్చారు.

దక్షిణ కొరియా సైనిక విన్యాసాలు



సియోల్: ఉత్తరకొరియా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం జరిపిన నేపథ్యంలో ఆదివారం దక్షిణ కొరియా, అమెరికా సంయుక్త సైనిక విన్యాసాలు ప్రారంభించాయి. ఆదివారం జరిపిన ఈ విన్యాసాల్లో అమెరికా వ్యూహాత్మక బాంబర్లు పాల్గొన్నాయి. అమెరికా బి-1బి బాంబర్లకు దక్షిణ కొరియా ఎఫ్-35ఏ, ఎఫ్-15ఏ, అమెరికా ఎఫ్-16 రక్షణగా నిలిచాయి. రెండు మిత్ర దేశాలు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు తమకున్న రక్షణ సంసిద్ధతను ప్రదర్శించాయని దక్షిణ కొరియా ఒక ప్రకటనలో తెలిపింది. జపాన్‌తో కలిసి అమెరికా సంయుక్త వైమానిక విన్యాసాలు జరుపనుందని జపాన్ వార్తా సంస్థ తెలిపింది. ఉత్తరకొరియా శనివారం రాజధాని ప్యాంగ్‌యాంగ్ నుంచి లాంగ్-రేంజ్ క్షిపణిని జపాన్ సముద్రం తీరంలోకి ప్రయోగించింది. ఈ క్షిపణి గంటలో 900 కిలోమీటర్లు (560 మైళ్లు) ప్రయాణించింది. జపాన్‌కు చెందిన ఓషిమా దీవికి 200 కిలోమీటర్ల దూరంలోని సముద్ర జలాల్లో క్షిపణి కూలిపోయినట్లు సమాచారం.

రూ.2,000 కోట్లతో శివసేన పేరు కొనేశారు: రౌత్

ముంబై: శివసేన పార్టీ పేరు, ఎన్నికల గుర్తు 'విల్లు, బాణం' కొనుగోలు వెనుక ఇప్పటిదాకా రూ.2,000 కోట్ల డీల్ చోటుచేసుకుందని ఉద్ధవ్ ఠాక్రే వర్గంలోని కీలక నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ ఆరోపించారు. ''ఇది 100 శాతం నిజం. మహారాష్ట్ర ప్రభుత్వానికి సన్నిహితుడైన ఓ బిల్డర్ నాకీ విషయం చెప్పాడు'' అంటూ ఆదివారం ట్వీట్ చేశారు. డీల్‌కు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని, త్వరలో బయటపెడతానని స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఇలాంటి తప్పుడు వ్యవహారాలు గతంలో ఎప్పుడూ జరగలేదని వెల్లడించారు. రూ.2,000 కోట్లు అంటే చిన్న మొత్తమేమీ కాదని తెలిపారు. రౌత్ ఆరోపణలను సీఎం ఏక్‌నాథ్ షిండ్ వర్గం నాయకుడు సదా సర్వాంకర్ ఖండించారు. సంజయ్ రౌత్ క్యాషియరా? అని ప్రశ్నించారు. ఆధారాల్లేని ఆరోపణలు చేయొద్దని, స్వతంత్ర సంస్థలైన సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం ప్రతిష్టను దెబ్బతీయొచ్చని మహారాష్ట్ర మంత్రి, బీజేపీ నేత సుధీర్ మునగంటివార్ హితవు పలికారు. ప్రజాస్వామ్యాన్ని అగౌరవపర్చేవారికి ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు.

పట్నాలో కాల్పులు.. ఇద్దరు మృతి

పట్నా: బిహార్ రాజధాని పట్నాలోని జెథులి గ్రామంలో పార్కింగ్ లాట్ విషయమై ఆదివారం జరిగిన గొడవ కాల్పులకు దారితీసింది. పార్కింగ్ స్థలం విషయంలో రెండు గ్రూపుల మధ్య వివాదం తలెత్తింది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో ఇద్దరు చనిపోగా ఐదుగురు గాయపడ్డారు. ఓ వర్గానికి చెందిన వారు కొన్ని భవనాలకు, వాహనాలకు నిప్పుపెట్టారు. ఇందుకు సంబంధించి పోలీసులు ప్రధాన నిందితుడు, మరో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

శిథిలాల కింద 12 రోజులు...

ప్రాణాలతో భార్యాభర్తలు, కుమారుడు మృతి

అన్‌టాకియా: తుర్కియే, సిరియాను భూకంపం కుదిపేసి 12 రోజులు గడుస్తున్నా ఇంకా కొందరు శిథిలాల కింద నుంచి మృత్యుంజయులుగా బయటపడుతున్నారు. హతాయ్ ప్రావిన్స్‌లోని అన్‌టాకియా నగరంలో కుప్పకూలిన అపార్ట్‌మెంట్ శిథిలాల కింద 296 గంటలుగా ఇరుక్కున్న ఒక కుటుంబంలో ముగ్గురిని బయటకు తీసుకువచ్చారు. సిమెంట్ పెళ్లల కింద క్షణమొక యుగంలా గడిపిన ఒక కుటుంబంలోని ముగ్గురి మూలుగులు ఉన్న సహాయ సిబ్బంది వారిని బయటకి తీశారు. వీరిలో భార్యాభర్తలిద్దరికీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుంటే వారి 12 ఏళ్ల కుమారుడి ప్రాణాలు మాత్రం వైద్యులు కాపాడలేక పోయారు. రెండు దేశాల్లోనే భూకంప మృతుల సంఖ్య 44 వేలు దాటింది. తుర్కియేలో మొత్తం 11 ప్రావిన్స్‌లకుగాను రెండు తప్ప తొమ్మిది ప్రావిన్స్‌లలో సహాయ చర్యలు నిలిపివేసినట్టు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది.



భూకంప బాధితుల కోసం అమెరికా నుంచి వచ్చిన సహాయ సామగ్రిని టర్కీలోని అడెనా ఎయిర్ బేస్ వద్ద ట్రక్కుల్లోకి చేరేయడంలో యూఎస్ సైనిక సిబ్బందికి సాయం చేస్తున్న ఆ దేశ విదేశాంగ మంత్రి ఆంథోనీ బ్లింకెన్. భూకంప ప్రభావిత ప్రాంతాలను ఆదివారం ఆయన ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు.

వన్యప్రాణుల వైవిధ్యానికి ఊతం

12 చీతాల రాకపై మోదీ హర్షం



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా నుంచి 12 చీతాల రాకతో మన దేశంలో వన్యప్రాణుల వైవిధ్యానికి మరింత ఊతం లభించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. చీతాల రాకపై కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ చేసిన ట్వీట్‌ను మోదీ ఆదివారం తన ట్విట్టర్ ఖాతాలో ట్యాగ్ చేశారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో 'ప్రాజెక్టు చీతా' మరో మైలురాయికి చేరుకుందని భూపేంద్ర యాదవ్ తన ట్వీట్‌లో వెల్లడించారు. దక్షిణాఫ్రికా నుంచి ప్రత్యేక విమానంలో రప్పించిన 12 చీతాలను శనివారం మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో క్వారంటైన్ ఎన్‌క్లోజర్‌లో చేర్చిన సంగతి తెలిసిందే.

లద్దాఖ్‌లో జీవనం మరింత సులభతరం

కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లో ప్రజల జీవనాన్ని మరింత సులభతరంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలూ చేస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. 4.1 కిలోమీటర్ల పొడవైన షింకున్ లా సొరంగం నిర్మాణానికి రూ.1,681.51 కోట్లు కేటాయించడానికి కేంద్రం అంగీకరించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తూ లద్దాఖ్ ఎంపీ జామ్‌యాంగ్ సెరింగ్ చేసిన ట్వీట్‌ను మోదీ ట్యాగ్ చేశారు.

ఛత్రపతి ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం

మరాఠా సామ్రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, ప్రజలకు అందించిన సుపరిపాలన మనకు స్ఫూర్తిదాయకమని ప్రధాని మోదీ కొనియాడారు. ఈ మేరకు ఆదివారం ట్వీట్ చేశారు. శివాజీ జయంతి సందర్భంగా మోదీ ఘనంగా నివాళులర్పించారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023

అదనంగా 254 ఆటోమేటిక్ టికెట్ మెషీన్లు

తిరువొత్తియూరు: దక్షిణ రైల్వే పరిధిలో ఉన్న ప్రధాన స్టేషన్లలో ప్రస్తుతం 99 ఆటోమేటిక్ టికెట్ మెషీన్లు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా అదనంగా 254 యంత్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇందులో 96 చెన్నైకి, 12 తిరుచ్చికి, 46 మదురైకి, 50 తిరువనంతపురానికి, 38 పాలక్కాడుకు, 12 సేలం రైల్వేస్టేషన్‌కు అందజేశామన్నారు. ఈ మెషీన్లకు క్యూ ఆర్ కోడ్ సౌకర్యం కూడా ఉందని పేర్కొన్నారు. ప్రయాణికులు తమ సెల్‌ఫోన్‌లోని యూపీఐ యాప్‌ల ద్వారా టికెట్లను పొందవచ్చు అని స్పష్టం చేశారు.

న్యూస్‌రీల్

రాష్ట్రపతి కున్నూరు పర్యటన రద్దు

సాక్షి, చెన్నై: నీలగిరులను మంచు దుప్పటి కప్పేయడంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కున్నూరు పర్యటన ఆదివారం రద్దయ్యింది. దీంతో ఆమె ఢిల్లీకి బయలు దేరి వెళ్లారు. వివరాలు.. రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం రాష్ట్రానికి వచ్చిన విషయం తెలిసిందే. తొలుత మదురై మీనాక్షి అమ్మ వారిని దర్శించుకున్నారు. అదేరోజు రాత్రి కోయంబత్తూరు జిల్లా తొండముత్తురు మార్గంలోని వెల్లింగిరిలోని ఈషాయోగా కేంద్రంలో నిర్వహించిన శివరాత్రి వేడుకలకు హాజరయ్యారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అక్కడి నుంచి కోయంబత్తూరు పర్యాటక గెస్ట్ హౌస్‌కు చేరుకుని బస చేశారు. ఇక ఆదివారం ఉదయం నీలగిరి జిల్లా వెల్లింగ్‌టౌన్‌ను రాష్ట్రపతి సందర్శించాల్సి ఉంది. ఇక్కడి అధికారులు, శిక్షణ ముగించుకున్న వారితో ప్రత్యేక సమావేశం, అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించే కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. నీలగిరి, కున్నూరు మార్గాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని భద్రతను కట్టుదిట్టం చేశారు. ఉదయాన్నే సూలూరు విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో రాష్ట్రపతి కున్నూరుకు బయలు దేరాల్సి ఉంది. అయితే వాతావరణం పూర్తిగా అనుకూలించడం లేదని అధికారులు తేల్చారు. నీలగిరులను పూర్తిగా మంచు ఆవహించి ఉండడంతో హెలికాప్టర్ ప్రయాణం సురక్షితం కాదని తేల్చారు. అయితే రోడ్డు మార్గంలో పర్యటనకు ఆగమేఘాలపై ఏర్పాట్లు చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో చివరకు కున్నూరు పర్యటనను అధికారులు రద్దు చేశారు. మధ్యాహ్నం వరకు పర్యాటక గెస్ట్‌హౌస్‌లోనే విశ్రాంతి తీసుకున్న రాష్ట్రపతి ముర్ము ఆతర్వాత ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

భూమిలో కలిసే ప్లాస్టిక్ సంచుల తయారీకి అనుమతి

- నిషేధంపై పునః సమీక్షించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

తిరువొత్తియూరు: భూమిలో కలిసే అవకాశం ఉన్న ప్లాస్టిక్ కవర్ల తయారీకి అనుమతి ఇవ్వొచ్చని రాష్ట్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు ఆదేశించింది. ఒకసారి ఉపయోగించి పడవేసే ప్లాస్టిక్ వస్తువులకు నిషేధం విధిస్తూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఆదేశాలను కోర్టు కూడా సమర్థించింది. కాగా ఈ తీర్పును పునః పరిశీలన చేయాలని తమిళనాడు, పుదుచ్చేరి ప్లాస్టిక్ ఉత్పత్తిదారుల సంస్థల సంఘం అప్పీల్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసు విచారణ న్యాయమూర్తులు ఎస్.విశ్వనాథన్, పి.టి.ఆశ తదితరులతో కూడిన బెంచ్ ముందు విచారణకు వచ్చింది. పరిశీలించిన న్యాయమూర్తులు నిర్వీర్యం అయ్యే ప్లాస్టిక్ వస్తువుల తయారీకి అనుమతులిచ్చే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది.

సీ సర్టిఫికెట్ పరీక్షకు 8,500 మంది ఎన్‌సీసీ కేడెట్లు


పరీక్షకు హాజరైన ఎన్‌సీసీ కేడెట్లు

కొరుక్కుపేట: ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ పరీక్షకు 2023కి గాను.. తమిళనాడు, పుదుచ్చేరి అండమాన్ నికోబార్ దీవుల పరిధిలో 25 ప్రదేశాల్లో చెన్నైలోని ఎన్‌సీసీ డైరెక్టరేట్ ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కామన్ అండ్ స్పెషలైజ్డ్ సిలబస్ రెండింటిలోనూ ఆర్మీ, నేవీ, ఎయిర్ వింగ్‌లో మూడేళ్ల శిక్షణ పూర్తి చేసిన సుమారు 8,500 మంది ఎన్‌సీసీ కేడెట్‌లు పరీక్షకు హాజరయ్యారు. 100 మంది అధికారులు, 90 మంది అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు, 750 మంది సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న తమిళిసై సౌందరరాజన్


బాల మేధావుల అద్భుత సృష్టికి తార్కాణంగా.. తక్కువ ఖర్చుతో విస్తృత ప్రయోజనాలే ధ్యేయంగా రూపొందించిన కలాం హైబ్రిడ్ రాకెట్.. నిప్పులు కక్కుతూ సగర్వంగా నింగికెగసింది. ఇందులోని బుల్లి శాటిలైట్లు పారాచ్యుట్‌ల ద్వారా గాల్లో తిరుగుతూ అవసరమైన సమాచారం సేకరించాయి. కాస్మో, ఎయిర్, విండ్, ఎన్విరాన్‌మెంట్, ఆక్సిజన్, కార్బండయాక్సైడ్ తదితర అంశాలకు సంబంధించిన కొత్త సమాచారాన్ని అందజేశాయి. పూర్తిగా విద్యా కార్యక్రమంగా చేపట్టిన ఈ రాకెట్ ప్రయోగం విజయవంతంగా కావడంతో విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది.


నింగిలోకి దూసుకెళ్తున్న రాకెట్

ఆకాశమంత విజయం

నింగిలోకి కలాం హైబ్రిడ్ రాకెట్
- విజయవంతమైన బాలల ప్రయత్నం
- రాకెట్‌లో 150 పీఐసీఓ బుల్లి శాటిలైట్లు
- పలువురు శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ప్రయోగం
- వీక్షించిన పుదుచ్చేరి ఎల్జీ తమిళిసై


సమావేశంలో మాట్లాడుతున్న ఇస్రో మాజీ శాస్త్రవేత్త అన్నాదురై


రాకెట్ తయారీలో భాగమైన విద్యార్థులు

సాక్షి, చెన్నై: భారత రత్నం, దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరిట తొలి హైబ్రిడ్ రాకెట్‌ను ఆదివారం నింగిలోకి విజయవంతంగా ప్రయోగించారు. మహాబలిపురం సమీపంలో పలువురు సీనియర్ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఈ ప్రయోగం సాగింది. వివరాలు.. మార్టిన్ ఫౌండేషన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ ఫౌండేషన్, స్పేస్ జోన్ ఇండియా సంయుక్తంగా దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన 5 వేల మంది విద్యార్థులను రెండేళ్ల క్రితం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ విద్యార్థుల పూర్తి ప్రతిభా సామర్థ్యం ఆధారంగా శాటిలైట్లు, హైబ్రిడ్ రాకెట్‌ను సిద్ధం చేశారు. ఈ రాకెట్‌లో 150 పీఐసీఓ మినీ శాటిలైట్లను నింగిలోకి ప్రయోగించేందుకు నిర్ణయించారు.

విజయవంతంగా ప్రయోగం..

మహాబలిపురం సమీపంలోని రాష్ట్ర పర్యాటక శాఖ కేటాయించిన ప్రదేశంలో ఈ రాకెట్ ప్రయోగానికి శనివారం నుంచి ఏర్పాట్లు చేశారు. ఈ రాకెట్, శాటిలైట్లను తాము ఏ విధంగా తీర్చిదిద్దామో అనే వివరాలను విద్యార్థులు శాస్త్రవేత్తలకు వివరించారు. ఈ హైబ్రిడ్ రాకెట్ ప్రయోగం ఆదివారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్, మార్టిన్ ప్రతినిధులు జోష్ చార్లస్ మార్టిన్, లీమా రోజ్ ఇస్రో మాజీ శాస్త్రవేత్త మైల్ స్వామి అన్నాదురై తదితరులు హాజరయ్యారు. ఇది నింగిలోకి ఆరేడు కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. ఇందులోని శాటిలైట్లు పారాచ్యుట్ ద్వారా గాల్లో తిరుగుతూ సమాచారం అందించాయి. కాస్మో, ఎయిర్, విండ్, ఎన్విరాన్‌మెంట్, ఆక్సిజన్, కార్బండయాక్సైడ్ తదితర అంశాలకు సంబంధించిన సమాచారాలను సేకరించారు. పూర్తిగా విద్యా కార్యక్రమంగా జరిగిన ఈ రాకెట్ ప్రయోగం విజయవంతంగా కావడంతో విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ మాట్లాడుతూ, దేశంలో తొలి హైబ్రిడ్ సౌండ్ రాకెట్‌ను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రూపొందించి, నింగిలోకి ప్రవేశపెట్టడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ ట్రస్ట్‌ను అభినందించారు. మైల్ స్వామి అన్నాదురై మాట్లాడుతూ, ఇలాంటి రంగంలో అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ రాకెట్ ప్రయోగం విజయవంతం చేసిన ఘనత అంతా విద్యార్థులదే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలాం ట్రస్టు, స్పేస్ ఇండియా ప్రతినిధులు షేక్ దావుద్, సలీం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరందరిని తమిళిసై సౌందరరాజన్ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

అన్నదాతలకు విరివిగా రుణాలు


రాధాకృష్ణన్

సాక్షి, చెన్నై : రాష్ట్రంలోని అన్నదాతలను ప్రోత్సహించే విధంగా రుణాల పంపిణీ విస్తృతం చేశామని పౌర సరఫరాల శాఖ కార్యదర్శి రాధాకృష్ణన్ తెలిపారు. కోళ్లు, మేకల, పశుల పెంపకానికి ప్రత్యేకంగా రుణాలను అందజేస్తామని ప్రకటించారు. వివరాలు.. ఆదివారం తిరుచ్చి సుబ్రమణియపురంలోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసిన అనంతరం జిల్లా కలెక్టర్ ప్రదీప్ కుమార్‌తో కలిసి ఆరోగ్య కార్యదర్శి రాధాకృష్ణన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఈనెల 17వ తేదీ వరకు 2,077 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి 51,397 మెట్రిక్ టన్నుల వరి సేకరించామని వివరించారు. అలాగే ఇప్పటి వరకు 15.59 లక్షల మంది రైతులకు సహకారం సంఘాల ద్వారా రూ. 12,010 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. ఈ సారి 2.18 లక్షల మంది కొత్త సభ్యుల రూ. 1,486 కోట్ల రుణాలు అందజేశామన్నారు. డెల్టాలోని 2.62 లక్షల మంది రైతులకు రూ. 1,709 కోట్లు ఇచ్చా మని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి పథకంలో భా గంగా మేకలు, కోళ్లు, పశువుల పెంపకం నిమిత్తం రుణాల పంపిణీ విస్తృతం చేయనున్నామని ప్రకటించారు. రాష్ట్రంలో 35 వేల రేషన్ దుకాణాలు ఉన్నా యని గుర్తు చేస్తూ ఆహార భద్రతా పథకం మేరకు వీటిని మరింత బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం 13.56 లక్షల కుటుంబ రేషన్ కార్డులు సిద్ధం చేశామని, మరో 90 వేల మందికి కార్డులను ముద్రించి అందజేయాల్సి ఉందన్నారు.

క్యూ ఆర్ కోడ్‌తో..

రేషన్ దుకాణాల్లో క్యూర్ కోడ్ ఆధారిత డిజిటల్ కొనుగోళ్లకు ఆదివారం శ్రీకారం చుట్టారు. తొలి ప్రయత్నంగా నీలగిరి జిల్లాలోని 43 రేషన్ దుకాణాల్లో ఆదివారం నుంచి క్యూ ఆర్ కోడ్ రూపంలో డిజిటల్ లావాదేవీలకు చర్యలు చేపట్టారు. ఈ విషయంపై ఆ జిల్లా రెవెన్యూ అధికారి ప్రియదర్శిని మీడియాతో మాట్లాడుతూ, ప్రైవేటు బ్యాంక్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఈ ప్రయత్నం చేట్టామని, విజయవంతమైన పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు సిఫారసు చేస్తామని వెల్లడించారు.

హాస్యనటుడు మయిల్‌స్వామి హఠాన్మరణం




నివాళులర్పిస్తున్న నటులు కార్తీ, నాజర్, మయిల్‌స్వామి (ఫైల్), అంజలి ఘటిస్తున్న ఉదయనిధి స్టాలిన్

తమిళ సినిమా: ప్రముఖ హాస్యనటుడు, రాజకీయ నాయకుడు మయిల్‌స్వామి (57)ఆదివారం వేకువజామున గుండెపోటుతో చెన్నైలో కన్నుమూశారు. ఈయన మంచి మిమిక్రీ ఆర్టిస్ట్. ఆ కళ ద్వారనే నటుడిగా సినీ రంగ ప్రవేశం చేశారు. 1984లో కె.భాగ్యరాజ్ కథానాయకుడిగా నటించిన దావణి కనవుగళ్ చిత్రంలో తొలిసారి నటించారు. మొదట్లో చిన్న చిన్న పాత్రలు పోషించినా.. తర్వాత హాస్య నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈయన చివరిగా నటించిన చిత్రం క్లాస్మేట్స్ ఈ చిత్రానికి డబ్బింగ్ కూడా పూర్తి చేశారు. నటుడు వడివేలు, వివేక్‌తో కలిసి పలు చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకున్నారు. సుమారు 200 చిత్రాల్లో అద్భుత నటన కనబరిచారు. ఈయన ఎంజీఆర్ వీరాభిమాని. దివంగత ముఖ్యమంత్రి జయలలిత సమక్షంలో అన్నాడీఎంకే పార్టీలో చేరి రాజకీయంగాను సేవలందించారు. కాగా గత 2021 శాసన సభ ఎన్నికల్లో విరుగంబాక్కం నియోజవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. 2015లో తుపాను ప్రభావానికి గురైన వారికి ఆర్థిక సాయం అందించారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల వరకు శివనామస్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక కీళంబాక్కంలోని శివాలయంలో ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమంలో డ్రమ్స్ శివమణితో కలిసి ఉల్లాసంగా పాల్గొన్నారు. అనంతరం వేకువజామున 3 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక సాలిగ్రామంలోని తన ఇంటికి చేరుకున్నారు. 3.30 గంటల ప్రాంతంలో అనూహ్యంగా అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని వెంటనే స్థానిక పోరూర్‌లోని రామచంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అక్కడ మయిల్‌స్వామిని పరీక్షించిన వైద్యులు.. గుండెపోటు కారణంగా ఆయన మార్గం మధ్యలోనే మరణించినట్లు ధ్రువీకరించారు.

పలువురి సంతాపం..

మయిల్‌స్వామి మృతి చిత్ర పరిశ్రమను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయనకు భార్య సీత, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఈయన మృతికి ముఖ్యమంత్రి స్టాలిన్ సంతాపం ప్రకటించారు. అలాగే పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై, నటుడు కమలహాసన్ సంతాపం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా నటుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్, దక్షిణ భారత సంఘం తరపున అధ్యక్షుడు కోశాధికారి కార్తీక్ తదితరులు మయిల్‌సామి భౌతికయానికి నివాళులు అర్పించారు. అదేవిధంగా పలువురు సినీ రాజకీయ నేతలు నివాళులర్పించారు. ఆయన శివ భక్తుడని.. మహాశివరాత్రి రోజున శివనీరాజనంలో పాల్గొని పరమపదించారని కొనియాడారు. ఆయన భౌతికయానికి సోమవారం మధ్యాహ్నం స్థానిక సాలి గ్రామంలోని ఏవీఎం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

శివాలయాల కిటకిట


ఈశా యోగా కేంద్రంలో శివరాత్రి వేడుకలకు హాజరైన భక్తులు


చదురగిరి కొండ ఆలయానికి వెళ్తున్న భక్తులు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని శివాలయాలు ఆదివారం వేకువజామున భక్తులతో కిటకిటాలడాయి. శనివారం రాత్రంతా జాగారం చేసిన భక్తులు ఉదయాన్నే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శివాలయాలలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తంజావూరు బృహదీశ్వర ఆలయంలో రాత్రంతా పూజలు, నాట్య ప్రదర్శనలు భక్తి భావాన్ని నింపాయి. అరియలూరులోని గంగైకొండ చోళపురంలో కొలువై ఉన్న ప్రగదీశ్వర ఆలయంలో స్వామివారి ఉత్సవ సేవ కనుల పండువగా జరిగింది. విరుదునగర్ జిల్లా చదురగిరి సుందర మహాలింగం ఆలయంలో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. ఇక కోయంబత్తూరులోని ఈషా యోగా కేంద్రంలో భారీ వేడుక కనుల విందుగా సాగాయి. ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ ప్రత్యేక ప్రసంగంతో పాటు శివరాత్రి విశిష్టతను తెలియజేశారు. లేజర్ లైట్ల వెలుగులో ఆదియోగి విగ్రహం దేదీప్యమానంగా వెలుగొందింది. ఇక ఈ వేదికపై నాట్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి.

చదురగిరి కొండ ఆలయంలో..

తిరువొత్తియూరు: మహాశివరాత్రిని పురస్కరించుకుని చదరగిరి కొండపై ఉన్న సుందర మహాలింగం స్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాత్రి జాగారం తరువాత ఆదివారం ఉదయం 6.30కి అటవీ శాఖ ఉద్యోగులు కొండపై వెళ్లడానికి భక్తులను గేట్లు తెరిచి అనుమతించారు. భక్తులు మంగాని రేవు మార్గంగా తాడు, కొయ్యల సాయంతో ఆలయానికి నడిచి వెళ్లారు. శివరాత్రి కావడంతో చదురగిరి సుందర మహాలింగ స్వామికి రాత్రి నాలుగు కాల పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులను అనుగ్రహించారు. నిర్వాహకులు భక్తులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ధనార్జనే ధ్యేయంగా.. ఆశ్రమం!

- విదేశాల నుంచి భారీగా నగదు
- బ్లాక్‌ను వైట్ చేస్తూ మాయ?
- 'అన్బుజ్యోతి'పై విచారణ ముమ్మరం


అన్బు జ్యోతి ఆశ్రమం

సాక్షి, చెన్నై : ధనార్జన ధ్యేయంగా విల్లుపురం జిల్లా అన్బు జ్యోతి ఆశ్రమం పుట్టుకొచ్చినట్లు విచారణలో వెలుగు చూసింది. 18 ఏళ్లుగా ఈ ఆశ్రమానికి విదేశాల నుంచి దొడ్డిదారిన భారీగా నగదు వచ్చినట్లు తేలింది. నల్లధనాన్ని.. వైట్ చేయడమే లక్ష్యంగా బడా బాబులు ఈ ఆశ్రమానికి వెన్నుదన్నుగా ఉన్నట్లు వెల్లడైంది. వివరాలు.. విల్లుపురం జిల్లా విక్రవాండిలోని అన్బుజ్యోతి ఆశ్రమం నిర్వాకం రెండు రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసును సీబీసీఐడీకి అప్పగించారు. దీంతో ఇప్పటి వరకు తాము జరిపిన విచారణలో వెలుగు చూసిన అంశాలను నివేదిక సిద్ధం చేసే పనిలో విల్లుపురం జిల్లా పోలీసు యంత్రాంగం నిమగ్నమైంది. ఈ ఆశ్రమం 18 ఏళ్లుగా గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తుండటం గమనార్హం. చిన్న పాకలో మొదలైన సేవ, ప్రస్తుతం మూడు అంతస్తుల భవనంగా మారింది. గతంలో విదేశాల నుంచి పెద్దఎత్తున నగదు ఈ ఆశ్రమానికి వచ్చినట్లు వెలుగు చూసింది. అయితే, ఇందుకు సంబంధించిన ఎలాంటి రికార్డులు ఆశ్రమంలో లేవని పోలీసులు తేల్చారు. ప్రధానంగా నల్లధనాన్ని వైట్ చేసుకునేందుకు కేరళ, తమిళనాడుకు చెందిన బడా బాబులు కొందరు తెర వెనుక నుంచి నడిపిస్తున్నారా? అనే అనుమాలు రావడంతో ఆ దిశగా దర్యాప్తును సీబీసీఐడీ చేపట్టనుంది. ఈ ఆశ్రమంలో 150 మందికి పైగా ప్రస్తుతం ఉండడం, గతంలో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నిర్వహణకు అయ్యే ఖర్చు, ఇతర వ్యయాల గురించి నిర్వాహకుడు జుబీన్ ద్వారా కక్కించేందుకు సిద్ధమవుతున్నారు. కేసును సీబీసీఐడీ సోమ లేదా మంగళవారం తన గుప్పెట్లోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ముందుగా జుబీన్‌తో పాటు పట్టుబడ్డ 9మందిని కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించేందుకు సీబీసీఐడీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయనుంది.

రంగంలోకి మహిళా కమిషన్ చైర్‌పర్సన్

ఆశ్రమంలోని మహిళలపై లైంగిక దాడి.. సమాచారంతో రాష్ట్ర మహిళా కమిషన్ రంగంలోకి దిగింది. చైర్‌పర్సన్ ఏఎస్ కుమారి నేతృత్వంలోని బృందం ఆదివారం విల్లుపురంలో పర్యటించింది. ముండియం బాక్కంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలను ప్రశ్నించింది. మీడియాతో ఏఎస్‌కుమార్ మాట్లాడుతూ, అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు వెల్లడించారు. చికిత్సలో పొందుతున్న మహిళలను పరామర్శించామన్నారు. మానసిక రోగిగా ఉన్న ఓ ఉత్తరాది యువతి వాగ్మూలాన్ని నమోదు చేసినట్లు తెలిపారు.

చెన్నై
సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023
సాక్షి

క్లుప్తంగా

మంత్రికి మురుగన్ చిత్రపటం బహూకరణ



కేంద్ర మంత్రితో వాసుదేవరాజు

పళ్లిపట్టు: కేంద్రమంత్రి ఎల్.మురుగన్‌ను పళ్లిపట్టు మండలం అత్తిమాంజేరికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు వాసుదేవరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. మురుగన్ చిత్రపటం అందజేసి ఆశీస్సులు పొందారు


భక్తితోనే ముక్తి



డాక్టర్ ఏవీ శివకుమారి, విస్తాలి శంకర రావును సత్కరిస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: భక్తితోనే ముక్తి చేకూరుతుందని తెలుగు ప్రముఖులు, సామాజిక సేవకురాలు డాక్టర్ ఏవీ శివ కుమారి వ్యాఖ్యానించారు. ఈ మేరకు పెరంబూరు తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో అనన్య సామాన్య ధారావాహిక ఉపన్యాస కార్యక్రమంలో 94వ ప్రసంగం ఆదివారం సాయంత్రం జరిగింది. దీనికి పెరంబూరులోని డి.ఆర్.బి.సి.సి.సి. మహోన్నత పాఠశాల ప్రాంగణం వేదికైంది. జీవన విధానం – ముక్తి పథం అనే అంశంపై ప్రసంగించేందుకు వక్తగా డాక్టర్ ఏవీ శివకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవంతుని నామస్మరణ చిన్ననాటి నుంచి అలవర్చుకోవాలి అని పేర్కొంటూ భగవంతుడు మనకు అందించిన జ్ఞానాన్ని మంచి కార్యక్రమాలకు వినియోగించుకోవాలని అన్నారు. ఇతరులకు సహాయం చేయలేక పోయినా పర్వాలేదు కాని చెడు మాత్రం చేయకుండ దన్నారు. ఇటువంటి గుణాలు ఉంటే త్వరగా ముక్తిని పొందగల్గుతామన్నారు. నగరంలో తెలుగు సంఘాలు భక్తితో, తపనతో చేస్తున్న సాహితీ సేవ కొనియాడదగినదని అన్నారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు విస్తాలి శంకరరావు, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, పెరంబూరు తెలుగు సాహితీ సమితి అధ్యక్షులు తమ్మినేని బాబు, కార్యదర్శి డాక్టర్ టి.ఆర్.ఎస్. శర్మ పాల్గొన్నారు

నేతల తిష్ట!



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

- కమల్, అన్నామలై, ప్రేమలత ప్రచారం
- ఓటర్లను ఆకర్షించే పనిలో నేతలు



ఈవీకేఎస్ ఇలంగోవన్‌ను కలిసి మద్దతు తెలిపిన కమల్ హాసన్

సాక్షి, చెన్నై: ఈరోడ్ తూర్పు నియోజకవర్గంలో అభ్యర్థుల కూటమి పార్టీల అగ్ర నేతల ప్రచారం మొదలైంది. ఆదివారం మక్కల్ నీదిమయ్యం నేత కమల హాసన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, డీఎండీకే కోశాధికారి ప్రేమలత విజయకాంత్ సుడిగాలి పర్యటనతో ఓట్ల వేటలో నిమగ్నమయ్యారు. ఈరోడ్ తూర్పు నియోజకవర్గం ఉప ఎన్నికకు వారం రోజులే సమయం ఉంది. దీంతో అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు ప్రచార వేగాన్ని పెంచారు. కాంగ్రెస్ అభ్యర్థి ఈవీకేఎస్‌కు మద్దతుగా డీఎంకే మంత్రులు ప్రచారంలో ఇన్నాళ్లూ ఉరకలు తీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ అళగిరి తదితర సీనియర్లు ప్రచార పయనం మొదలెట్టారు. ఇక, సీఎం ఎంకే స్టాలిన్ 24, 25 తేదీల్లో నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఇప్పటికే అన్నాడీఎంకే అభ్యర్థి తెన్నరసుకు మద్దతుగా ఆ పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళని స్వామి ప్రచారంలో దూసుకెళ్తుండగా, 24,2 5 తేదీల్లో నియోజకవర్గం పరిధిలోని ఆయా ప్రధాన కూడళ్లలో సభల రూపంలో ప్రచారం నిర్వహించనున్నారు. నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి మేనకకు మద్దతుగా ఆ పార్టీ నేత సీమాన్ ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా మారారు. ఈ పరిస్థితుల్లో ఆదివారం కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా మక్కల్ నీది మయ్యంనేత కమల్ ప్రచారంలో దూసుకెళ్లారు. సోమవారం కూడా ఆయన పర్యటన జరగనుంది. ఇక, అన్నాడీఎంకే అభ్యర్థికి మద్దతుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రచారబాట పట్టారు. ఇన్నాళ్లూ డీఎండీకే అభ్యర్థి ఆనంద్ ఒంటరిగా ప్రచారంలో ఓటర్లను ఆకర్షించారు. ప్రస్తుతం ఆయనకు మద్దతుగా ఆ పార్టీ కోశాధికారి ప్రేమలత విజయకాంత్ ప్రచారం మొదలెట్టారు. ప్రచారంలోకి ప్రధాన నేతల రాకతో నియోజకవర్గంలో ఎన్నికల సందడి మరింత హోరెత్తుతోంది. నేతల సభలకు జన సమీకరణ కోసం పొరుగు నియోజకవర్గాల ప్రజలను ఆయా పార్టీలు తరలించుకోక తప్పడం లేదు.

'కాలమేఘం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని అవిష్కరిస్తున్న ఏవీ శివరామప్రసాద్, సంజీవ రావు

కొరుక్కుపేట: పదేళ్లకు ముందు కేదారనాథ్ పుణ్యక్షేత్రంలో సంభవించిన జల ప్రళయాన్ని కళ్లకు కట్టినట్లు రచయిత వెంకూ రచించిన కాలమేఘం పుస్తకావిష్కరణను ఆదివారం చెన్నై మైలాపూరులోని భారతీయ విద్యాభవన్ మినీ హాలులో నిర్వహించారు. మద్రాస్ ప్రెసిడెన్సీ హోమియోపతిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ అనంత పద్మనాభమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) ఉన్నత కార్యదర్శి ఏవీ శివరామ ప్రసాద్ పుస్తకావిష్కరణ చేసి తొలిప్రతిని విశ్రాంత తెలుగు ఉపాధ్యాయురాలు కమలాకర రాజేశ్వరికి అందజేశారు. చెన్నపురి తెలుగు అకాడమీ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ తూమాటి సంజీవరావు స్వాగతోపన్యాసం చేస్తూ శివరాత్రి పర్వదినాన ఈ పుస్తకాన్ని తమ సంస్థ ఆవిష్కరించడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఈ పుస్తకంలో గుండెలను పిండిసే ఎన్నో కథనాలు ఉన్నాయని, ప్రభుత్వ యంత్రాంగం తప్పిదాలను సైతం ఎండగట్టారని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్రావుల వెంకటరమణ, తుమ్మపూడి కల్పన, కిడాంబి లక్ష్మీకాంత్, తిరునగరి భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన



జాక్టోజియో సమావేశంలో ప్రసంగిస్తున్న దాస్

తిరువళ్లూరు: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించని పక్షంలో మార్చి 5వ తేదీ జిల్లా కేంద్రంలో నిరాహారదీక్ష, మానవహారం నిర్వహిస్తామని ఉద్యోగ ఉపాధ్యాయుల పోరాట ఉమ్మడి ఐక్యవేదిక జాక్టోజియో నేతలు ప్రకటించారు. తిరువళ్లూరు జిల్లా జాక్టోజియో ప్రత్యేక సమావేశం ఆదివారం పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించారు. సంఘం నేతలు హేక్‌పూర్, రాజాతి, ముత్తుకుమార్, గణేష్, లోకయ్య తదితరులు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర కోఆర్డినేటర్ దాస్ ప్రసంగించారు. 2003 తరువాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారికి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 2021 నుంచి ప్రకటించిన డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఉద్యోగులకు ఇచ్చే విధంగా ప్రతి ఆరు నెలలకు డీఏలతో పాటు ఇతర సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో డీఎంకే ప్రభుత్వ ఉద్యోగులకు హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత మొండిచేయి చూపిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల నియమించిన 428 నర్సులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, పార్ట్‌టైమ్ టీచర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 2003–04వ సంవత్సరంలో పార్ట్‌టైమ్ ఉద్యోగంలో చేరిన వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. రోడ్డు పర్యవేక్షణ కార్మికులకు 41 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలన్నారు. తమ డిమాండ్‌లను పరిష్కరించని పక్షంలో మార్చి 5 నుంచి దశల వారిగా పోరాటం చేస్తామని, అదే రోజు నిరాహారదీక్ష, మానవహారం నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఇళంగోవన్, జ్ఞానశేఖరన్, ప్రభాకరన్, జంబు, కుప్పుస్వామి, పాండ్యన్ పాల్గొన్నారు.

ఐఐటీ మద్రాసులో పరిశోధన కేంద్రం



పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిరిల్ క్లార్క్

కొరుక్కుపేట: భారత్–యునైటెడ్ స్టేట్స్ సహకారంతో ప్రపంచానికి అవసరమైన పరిశోధనలను ఉమ్మడిగా చేసేందుకు వీలుగా వర్జీనియా టెక్ సంస్థ చెన్నైలోని ఐఐటీ మద్రాసు రీసెర్చ్ పార్క్‌లో పరిశోధన, అభ్యాస కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రొఫెసర్ సిరిల్ క్లార్క్ నేతృత్వంలో వర్జీనియా టెక్‌కు చెందిన ప్రొఫెసర్లు అజీమ్, డాన్ సూయ్, గురు ఘోష్, విశ్వనాథ్ వెంకటేష్ పరిశోధన అభ్యాస కేంద్రాన్ని ప్రారంభించారు. వర్జీనియా టెక్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సిరిల్ క్లార్క్ మాట్లాడుతూ.. వర్జీనియా టెక్ యూనివర్సిటీ కేవలం విద్యను మాత్రమే కాకుండా నాణ్యత గల పరిశోధనలను కూడా చేస్తోందని తెలిపారు. ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం చేసుకున్నామని పేర్కొన్నారు. వర్జీనియా టెక్ ఏటా 530 మిలియన్ల కంటే ఎక్కువ పరిశోధనలను నిర్వహిస్తోందని తెలిపారు. ప్రొఫెసర్ విశ్వనాథ్ వెంకటేష్ మాట్లాడుతూ.. యునైటెడ్ స్టేట్స్, భారతదేశం సంయుక్తంగా వివిధ వేదికలపై ప్రపంచానికి అవసరమైన పరిశోధనలను నిర్వహించాలని ఆకాంక్షించారు.

ముత్తమిళ సెల్వకి అరుదైన గౌరవం

కొరుక్కుపేట: నేషనల్ క్యాడెట్ కాప్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సి.ముత్తమిళ్ సెల్వకి గౌరవ కల్నల్ హోదాను ప్రదానం చేశారు. ఎస్ఆర్ఎం క్యాంపస్‌లోని గణేశన్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దక్షిణ భారత్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ లెఫ్టినెంట్ జనరల్ ఏ. అరుణ, గౌరవ అతిథిగా ఎన్‌సీసీ డైరెక్టరేట్ (తమిళనాడు, పుదుచ్చేరి) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కమాండర్ అతుల్ కుమార్ రస్తోగి పాల్గొని ముత్తమిళ్ సెల్వకి కల్నల్ ర్యాంక్, బ్యాడ్జ్‌ను అందజేశారు. ఎస్ఆర్ఎం రిజిస్ట్రార్ ఎస్ పొన్నుసామి, డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.



కల్నల్ హోదా అందుకుంటున్న సెల్వ

మణివణ్ణన్ మృతిపై సీఎం సంతాపం

కొరుక్కుపేట: ప్రొఫెసర్ అన్బళగన్ సోదరుడు మణివణ్ణన్ మృతిపై ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'మణివణ్ణన్ అనారోగ్య కారణాలతో కన్నుమూశారని తెలిసి చాలా బాధపడ్డాను. మణివణ్ణన్ అందరితో కలిసిపోయే వ్యక్తి. ఆయన కుటుంబానికి, బంధువులకు, సహోద్యోగులకు ప్రగాఢ సంతాపం' అని పేర్కొన్నారు.

24న తెరపైకి కుమారి మావట్టత్తిల్ థగ్స్



థగ్స్ చిత్ర యూనిట్

తమిళ సినిమా: ప్రముఖ నృత్య దర్శకురాలు బృందా మెగాఫోన్ పట్టి ఇంతకుముందు సినామికా అనే ముక్కోణపు ప్రేమ కథా చిత్రం తెరకెక్కించి ప్రశంసలు అందుకున్నారు. తాజాగా ఈమె దర్శకత్వం వహించిన రెండో చిత్రం కుమరి మావట్టత్తిల్ థగ్స్. మొదటి చిత్రానికి పూర్తిగా భిన్నంగా కమర్షియల్ అంశాలతో యాక్షన్ నేపథ్యంలో రూపొందించారు. జియో స్టూడియోస్ సంస్థతో కలిసి రియా శిబు నిర్మించారు. స్వతంత్రం అర్ధరాత్రియిల్ అనే మలయాళ చిత్రానికి ఇది రీమేక్. శ్యామ్ సీఎస్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రంలో హ్రిదు అరూన్ కథానాయకుడిగా, అనస్వర రాజన్ నాయకిగా నటించారు. శరత్ అప్పాని, రియా శిబు, బాబీ సింహ, ఆర్కే సురేష్, మునీష్ కాంత్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం గత ఏడాదే విడుదల కావాల్సి ఉన్నా వాయిదా పడింది. తాజాగా ఈ నెల 24వ తేదీ తమిళం, తెలుగు భాషల్లో తెరపై రానుంది. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం చిత్ర యూనిట్ చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా దర్శకురాలు బృంద మాట్లాడుతూ.. పరిస్థితుల ప్రభావం కారణంగా ఖైదీలుగా మారిన ఒక యువకుడి కథ అని చెప్పారు. అందులోంచి అతను ఎలా బయట పడ్డాడు అనేది ఈ చిత్రంలో చూడాలన్నారు. తనను నమ్మి అవకాశాన్ని కల్పించిన నిర్మాతకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అన్నారు. హ్రిదు అరూర్ చాలా బాగా నటించారని.. అతనికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. నిర్మాత కొడుకును అనే భావన ఎక్కడా కనిపించలేదన్నారు. అనస్వర చక్కగా నటించారని ప్రశంసించారు. సంగీత దర్శకుడు శ్యామ్ సీఎస్ మంచి సంగీతాన్ని ఇచ్చారన్నారు. చిత్ర యూనిట్ సభ్యులు తనకు ఎంతగానో సహకరించారని పేర్కొన్నారు.

కోలీవుడ్ టాక్స్

యాంట్ మ్యాన్ పోరాటం



తమిళ సినిమా: మార్వెల్ స్టూడియోస్ నుంచి చిత్రం వస్తుందంటే సినీ ప్రేక్షకుల్లో చాలా ఆసక్తి నెలకొంటుంది. అలాంటి భారీ అంచనాల మధ్య శుక్రవారం తెరపైకి వచ్చిన చిత్రం యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్. పాల్ రెడ్, ఎవాంజెలిన్ లిల్లీ, కేథరిన్ న్యూటన్, జోనాథన్ మేయర్స్, మైకెల్ డగ్లస్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. ఈ చిత్ర కథ గురించి చెప్పాలంటే ఒకప్పటి గజదొంగ అయిన స్కాట్ లాంగ్ ప్రస్తుతం శాన్ ఫ్రాన్సిస్కోలో ఉన్నత వ్యక్తిగా జీవిస్తుంటాడు. ఆయన కూతురు కేసీ మళ్లీ కలుసుకుని, ప్రేమించిన హోప్ వాన్ డైన్‌తో ఆనందంగా జీవిస్తుంటాడు. అలాంటి సమయంలో కూతురు కేసీ కొత్త పరిశోధన కారణంగా అనుహ్యంగా వీరు క్వాంటం రెల్మ్‌లో చిక్కుకుని అప్పటికే అక్కడికి వెళ్లి బయట ప్రపంచంలోకి రాలేని పరిస్థితుల్లో ఉన్న కాంగ్ తన సామ్రాజ్యాన్ని అక్కడే విస్తరించుకుంటాడు. కాగా అద్భుతమైన శక్తులు కలిగిన శక్తివంతుడైన కాంగ్ బారిన పడ్డ స్కాట్ కుటుంబం అతనితో చేసే పోరాటమే ఈ చిత్రం. తాను క్వాంటం రెల్మ్ నుంచి బయట ప్రపంచంలోకి రావడానికి కాంగ్ స్కాట్ లాంగ్ కుటుంబాన్ని వాడుకోవాలని చూస్తాడు. అతని ప్రయత్నం ఫలించిందా? లేదా? అదే విధంగా స్కాట్ కుటుంబం అతన్ని జయించిందా లేదా? అన్న పలు ఆసక్తికరమైన అంశాలతో రూపొందిన చిత్రం యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్. ఇది యాక్షన్ నేపథ్యంలో రూపొందిన కథ చిత్రం అయినా కామెడీకి కుటుంబ అనుబంధాలకు ప్రాముఖ్యత ఇచ్చిన చిత్రం. చిత్రంలో గ్రాఫిక్స్ సన్నివేశాలు కనువిందు చేస్తాయి. పెద్దలతో పాటు పిల్లలు చూసి ఆనందించే చిత్రంగా ఇది ఉంటుంది.

సినీ వారసులకు అవార్డుల ప్రదానం



అవార్డుల ప్రదానోత్సవం

తమిళ సినిమా: సినీ ప్రముఖుల వారసులను ప్రోత్సహించే విధంగా వడపళనిలోని చక్రం హాల్లో శనివారం సాయంత్రం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహా ఫైనాన్స్ అధినేత అనురాధ జయరామన్, యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా అధినేత కలైమామణి నెల్లై సుందరరాజన్ సంయుక్తంగా ఈ వేడుకలను నిర్వహించారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్కే కృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ దర్శకుడు కె.భారతీ రాజా వారసుడు నటుడు మనోజ్ భారతీ రాజా, ఆదేశ్ బాలా శరవణన్, గజేష్ నాగేష్, నటి సింధుజ విజీ, సుధా విజయ్, సీనియర్ పాత్రికేయుడు అయ్యప్ప ప్రసాద్, యువ వ్యాఖ్యాత నెల్లై ఎస్.విజయ్‌లకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్కే కృష్ణన్ మాట్లాడుతూ.. అనురాధ జయరామన్, కలైమామణి నెల్లై సుందర్ రాజన్ ఈ అవార్డుల వేడుక ద్వారా వినూత్న సంప్రదాయానికి శ్రీకారం చుట్టారన్నారు. సినీ ప్రముఖుల వారసులను ప్రోత్సహించే విధంగా ఈ అవార్డులను ప్రదానం చేయడం ప్రశంసనీయం అన్నారు. ఇది వారిలో నూతన ఉత్సాహాన్ని నింపుతుందన్నారు.

శివలింగేశ్వరుని సేవలో త్రిష



శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న త్రిష

తమిళ సినిమా: మహాశివరాత్రి పర్వదినాన నటి త్రిష మహాశివుని సేవలో తరించారు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో ప్రముఖ నటిగా రాణిస్తున్న ఈమె ఆ మధ్య నటించిన కొన్ని చిత్రాలు నిరాశ పంచడంతో క్రేజ్ తగ్గింది. అయితే పొన్నియిన్ సెల్వన్ చిత్రం విజయంతో మళ్లీ ఫామ్ లోకి వచ్చారు. నాలుగుపదుల వయసు దగ్గర పడుతున్న ఈ అమ్మడు ఇప్పటికీ అవివాహితే. కాగా ఇటీవల ఈమె దృష్టి దైవ దర్శనాలపై మళ్లిందని భావించవచ్చు. సమయం దొరికినప్పుడల్లా గుళ్లు, గోపురాలు తిరిగేస్తున్నారు. తాజాగా విజయ్ సరసన లియో చిత్రంలో నటిస్తున్నారు. లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని 7 స్క్రీన్ స్టూడియో పతాకంపై లలిత్ కుమార్ నిర్మిస్తున్నారు. నటుడు అర్జున్, దర్శకుడు మిష్కిన్, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్, మన్సూర్ అలీ ఖాన్, నటి ప్రియా ఆనంద్ వంటి ప్రముఖ నటినట్లు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అనిరుధ్ సంగీతాన్ని, మనోజ్ పరమహంస ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్ర షూటింగ్ ప్రస్తుతం కశ్మీర్లో జరుగుతోంది. అక్కడ జమ్మూ కశ్మీర్ సమీపంలోని బహల్ గామ్ ప్రాంతంలోని ఒక చిన్న గ్రామంలో లియో చిత్రం షూటింగ్‌ను నిర్వహిస్తున్నట్లు సమాచారం. అక్కడ చిత్ర యూత్ ప్రేమికుల రోజున దిగిన ఫొటోలను నటి త్రిష సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అవి నెట్టింట్లో వైరల్ అయ్యాయి.. కాగా శనివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నటి త్రిష కాశ్మీర్‌లోని లింగేశ్వర ఆలయానికి వెళ్లి అక్కడ శివలింగానికి పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ ఆలయ అర్చకులు దగ్గరుండి మరి త్రిషతో ప్రత్యేక పూజలు జరిపించారు. ఆ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుంది. ఆ వీడియో చూసిన అభిమానులు త్రిష భక్తిని చూసి పారావస్యం పొందడంతో పాటు ఓం నమశివాయ అంటూ లైకులు కొడుతున్నారు.

హన్సిక ఎదగడానికి అలా చేశారా?



తమిళ సినిమా: ముంబాయికి చెందిన బ్యూటీ నటి హన్సిక. ఇటీవల వార్తలన్నీ ఈమె చుట్టూనే తిరుగుతున్నాయి అని చెప్పవచ్చు. ధనుష్ జంటగా మాప్పిళ్లై అనే చిత్రం ద్వారా కోలీవుడ్ పరిచయ్యారు. తర్వాత విజయ్, శింబు, విశాల్, ఆర్య వంటి ప్రముఖ కథానాయకుల సరసన నటించే అవకాశాలను దక్కించుకున్న ఈ అమ్మడిని అప్పట్లో చిన్న కుష్బూ అని పిలిచేవారు. ఇక నటుడు శింబుతో జరిపిన ప్రేమాయణం, బ్రేకప్ వంటి సంఘటనలు ఈమె కేరీర్‌కు ఎలాంటి భంగం కలిగించకపోగా, మరింత పాపులర్ చేశాయి. కాగా గత డిసెంబర్ 4వ తేదీన ముంబైకి చెందిన వ్యాపారవేత్త సోహైల్ కతురియ అనే వ్యక్తిని పెళ్లాడిన హన్సిక ప్రస్తుతం మళ్లీ నటనపై దృష్టి సారించారు. కాగా ఈ బ్యూటీ చిన్నతనంలోనే బాల నటిగా సినీ రంగ ప్రవేశం చేసింది. ఆ తర్వాత కథానాయక ఎదిగారు అయితే హన్సిక త్వరగా ఎదగడానికి ఆమె తల్లి హార్మోన్ ఇంజెక్షన్ చేయించినట్లు ఇప్పుడు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేస్తోంది. దీనిపై స్పందించిన తన తన 21 ఏళ్ల వయసు లోనే ఇలాంటి ప్రచారం జరిగిందని, చాలామందికి తెలిసిన విషయం ఏమిటంటే తాను ఎనిమిదేళ్ల వయసులోనే బాలనటిగా సినీ రంగానికి పరిచయం అయ్యాను అన్నారు. అలాంటిది ఇప్పుడు మళ్లీ తాను త్వరగా ఎదగడానికి తన తల్లి హార్మోన్ ఇంజెక్షన్ చేయించినట్లు ప్రచారం చేస్తున్నారన్నారని వాపోయారు. నటి హన్సిక తల్లి ఈ విషయంపై స్పందిస్తూ ఇప్పుడు ఏదైతే ప్రచారం జరుగుతుందో అది నిజం అయితే తాము టాటా బిర్లాల కంటే ధనవంతులం అయ్యే వాళ్లం అన్నారు. ఇలా ప్రచారం చేసే వారికి కనీస జ్ఞానం లేకపోవడం తనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. తమది పంజాబీ కుటుంబం అనీ, తమ పిల్లలు 12 నుంచి 16 ఏళ్ల వయసులో వేగంగా పెరుగుతారని హన్సిక తల్లి వివరణ ఇచ్చారు.

క్లుప్తంగా

రైల్వే స్టేషన్‌లో కత్తితో యువకుడి వీరంగం

– భయంతో ప్రయాణికుల పరుగులు

తిరువొత్తియూరు: తిరుపూర్ రైల్వేస్టేషన్లో ఆదివారం తెల్లవారుజామున కత్తితో ఓ యువకుడు వీరంగం సృష్టించుకోవడంతో ప్రయాణికులు భయంతో పరుగులు తీశారు. మొదటి ప్లాట్‌ఫామ్‌లోని టికెట్ కౌంటర్ వద్దకు ఆదివారం తెల్లవారుజామున 4.15 గంటలకు కత్తితో వచ్చి.. బిగ్గరగా అరుస్తూ కలెక్టర్ రావాలి, ఎమ్మెల్యే రావాలి అంటూ హంగామా సృష్టించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకోవడానికి యత్నించారు. కానీ వీలుకాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది తాళ్లసాయంతో బంధించారు. విచారణలో నిందితుడు తిరుపూర్ మేట్టుపాళయం కామరాజర్ నగర్‌కు చెందిన కన్నన్ (36) అని తెలిసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు సాగుతోంది.

రైలు ఢీకొని దంపతులు మృతి

తిరువొత్తియూరు: రైలు ఢీకొని కోవైకి చెందిన దంపతులు మృతి చెందారు. వివరాలు.. గణపతి నల్లపాలయంకు చెందిన మణికంఠన్ (44) కారు డ్రైవర్. ఇతని భార్య లత (43). వీరి ఇద్దరు కుమార్తెలకూ వివాహమైంది. ఈ క్రమంలో మణికంఠన్, లత ఇద్దరూ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలో శనివారం రాత్రి దంపతులు పీలమేడు నార్త్ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలను దాటుతుండగా అటుగా వచ్చిన చెన్నై కోవై ఇంటర్‌సిటీ రైలు మణికంఠన్, లతను ఢీకొంది. దీంతో ఇద్దరు తీవ్ర గాయాలతో మృతి చెందారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారా..? లేదా.. ప్రమాదం జరిగిందా..? అనే కోణంతో దర్యాప్తు చేస్తున్నారు.

ఊయలతాడు బిగించుకుని చిన్నారి మృతి


మృతి చెందిన జశ్వంత్ (ఫైల్)

తిరువొత్తియూరు: చెన్నై తిరుముల్లైవాయిల్ సమీపంలో గొంతుకు ఊయల తాడు బిగించుకుని ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. వివరాలు.. స్థానిక మూర్తి నగర్‌కి చెందిన కన్నప్పన్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య మీనా. వీరికి జశ్వంత్ (5), మైలేష్ (2) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో జస్వంత్ ఆ ప్రాంతంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. శనివారం సాయంత్రం యశ్వంత్ ఇంట్లో చీరతో కట్టిన ఊయలలో ఆడుకుంటూ హఠాత్తుగా గొంతుకు తాడు బిగుసుకోవడంతో మరణించాడు. తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారంతో తిరుముల్లైవాయల్ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

40 సవర్ల నగలు చోరీ

తిరువొత్తియూరు: కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో 40 సవర్ల నగలను చోరీ చేసిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. చెన్నై వెస్ట్ మాంబలం రాజు వీధికి చెందిన అపార్ట్‌మెంట్‌లో వెంకట సుబ్రహ్మణ్యం, అతని భార్య పద్మావతి (62) దంపతులు నివాసం ఉంటున్నారు. ఈమె కేంద్ర ప్రభుత్వ ఈఎస్‌ఐ కార్యాలయంలో ఉద్యోగిగా పని చేసి రిటైర్డ్ అయ్యారు. ఈక్రమంలో మాంబలం గణపతి వీధిలో కొత్తగా ఇల్లు నిర్మించారు. ఇందులో శనివారం ఉదయం ప్లంబర్ పనులకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. పని చేస్తున్న క్రమంలో ఇంటిలోని 40 సవర్ల నగలు చోరీ చేశాడు. విషయాన్ని గుర్తించిన వృద్ధ దంపతు లు అశోక్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు - కంటైనర్ ఢీకొని మంటలు

అన్నానగర్: పూందమల్లి సమీపంలో ఆదివారం ఉదయం సర్వీస్ రోడ్డులో ముందుకు వెళుతున్న కంటైనర్ లారీ కారును ఢీ కొని మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదం నుంచి కారు నడుపుతున్న మహిళ అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడింది. వివరాలు.. చెన్నైకి చెందిన కృతిక (23), శ్రీ పెరంబత్తూరులోని ఓ ప్రైవేటు కారు ఫ్యాక్టరీలో ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో పూందమల్లిలో ఓ ప్రైవేటు ఫ్లాట్‌లో నివాసముంటున్న స్నేహితులను తీసుకెళ్లేందుకు కారులో వెళ్లింది. ఆమె కారు పూందమల్లి చెన్నై – బెంగళూరు జాతీయ రహదారి, సర్వీసు రోడ్డు మీదకు వచ్చినప్పుడు ముందు వెళ్తున్న కంటైనర్ షడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు అదుపు తప్పి కంటైనర్‌ను వెనుక భాగంలో ఢీకొంది. ఈ క్రమంలో మంటలు అంటుకున్నాయి. కారులో చిక్కుకున్న కృతికను స్థానికులు రక్షించారు. కంటైనర్ డ్రైవర్ పరారయ్యాడు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పారు. పూందమల్లి ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

అన్నానగర్: గిండి, సైదాపేట రైల్వేస్టేషన్ల సమీపంలో గంజాయి, మందు మాత్రలు విక్రయిస్తున్న ఇద్దరిని ఆదివారం పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. వివరాలు.. చెన్నై గిండి, సైదాపేట రైల్వేస్టేషన్ల సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు అడయార్ ప్రొహిబిషన్ డివిజన్ పోలీసులకు ఆదివారం ఉదయం సమాచారం అందింది. దీంతో చెన్నై గిండి స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న యువకుడి నుంచి బ్యాగ్‌లోని 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఒడిశాకు చెందిన సాంబు ప్రధాన్ (19)గా తేలింది. అలాగే సైదాపేట రైల్వేస్టేషన్ సమీపంలో డ్రగ్స్ తరలిస్తున్న చిత్తలాపాక్కంకు చెందిన కార్తీక్ (23)ని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుండి 600 కేజీల టైడల్ అనే డ్రగ్‌ను సీజ్ చేసారు. అనంతరం నిందితులిద్దరినీ జైలుకు తరలించారు.


అరక్కోణం: పోటెత్తిన భక్తులు


తిరుత్తణి నందినది తీరంలో శ్మశాన కొల్ల


అరక్కోణం: అంకాళపరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు

భక్తజన జాతర

- వేడుకగా శ్మశాన కొల్ల
- వివిధ వేషాలతో పాలారు నదికి పోటెత్తిన భక్తులు

వేలూరు: జిల్లాలో శ్మశాన కొల్ల ఆదివారం ఘనంగా జరిగింది. వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలో ఏటా శివరాత్రిని పురస్కరించుకుని అమావాస్య రోజున శ్మశాన కొల్ల జాతర నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం జిల్లాలోని 36 ప్రాంతాల్లో శ్మశాన కొల్ల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు భద్రకాళి, శివ పార్వతులు, వివిధ రాక్షస రూప వేషాలు ధరించి మేళతాళాల నడుమ వేలూరు, కాట్పాడి, విరుదంబట్టు తదితర ప్రాంతాల నుంచి ఊరేగింపుగా పాలారు నది వద్దకు చేరుకున్నారు. అదే విధంగా రథాలను అలంకరించి వాటిలో భద్రకాళి అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి కొలువుదీర్చి ఊరేగింపుగా తీసుకొచ్చారు. పాలారు నదిలో ఎటుచూసినా భక్తులతో కిక్కిరిసింది. భక్తులు వారి పూర్వీకుల సమాధుల వద్ద పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ రాజేష్ కన్నన్ భద్రతను సమీక్షించారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. ఇద్దరు అదనపు ఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 40 మంది ఇన్‌స్పెక్టర్లు సహా మొత్తం 1,500 మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. అదే విధంగా గుడియాత్తం, రాణిపేట, ఆంబూరు, వాణియంబాడి, జోలార్‌పేటలో శ్మశాన కొల్ల అంగరంగ వైభవంగా జరిగింది.

ఆకట్టుకున్న వేషధారణలు

అరక్కోణం: శ్వశాన కొల్ల ఉత్సవాల సందర్భంగా అరక్కోణంలో ఆదివారం సందడి నెలకొంది. యువకులు, చిన్నారులు కాళి, రాక్షసులు, అమ్మవారి వేషధారణలో ఆకట్టుకున్నారు. రాణిపేట జిల్లా అరక్కోణంలోని పళనిపేటలో ఉన్న అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఊరేగింపుగా శ్మశానానికి చేరుకున్నారు. వేలది మంది భక్తులు వివిధ వేషాలు, వీపుల్లో ఇనుప చువ్వలు గుచ్చుకుని వాహనాలు లాగి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అగ్ని కుండలతో ఊరేగిపుగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శ్మశానంలో పూజల అనంతరం పండ్లు, నిమ్మకాయలు, పూజా సామగ్రి భక్తులపై వెదజల్లారు. వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. అలాగే తిరుత్తణి పాత బజారు వీధిలోని అంకాళపరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. నంది తీరంలోని శ్మశానంలో శ్మశాన కొల్ల ఉత్సవం నిర్వహించారు.

అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో..

తిరువళ్లూరు: జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో శ్మశాన కొల్ల ఉత్సవాలు ఆదివారం కోలాహలంగా జరిగాయి. ఉత్సవాలకు సమీప ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. తిరువళ్లూరు జిల్లా పేరంబాక్కంలోని అంకాళపరమేశ్వరి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా పది రోజుల పాటు అమ్మవారిని రోజూ ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. చివరి రోజు ఆదివారం అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి శ్మశాన కల్ల నిర్వహించారు. శ్మశానంలో ఏర్పాటు చేసిన రాక్షసుడిని అమ్మవారు వధ చేసిన తరువాత నిమ్మకాయ, పండ్ల కోసం భారీగా భక్తులు ఎగబడ్డారు.


తిరువళ్లూరు: శ్మశాన కొల్లకు బయలుదేరిన అమ్మవారు


తిరువళ్లూరు: పాల్గొన్న భక్తులు


వేలూరు: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


వేలూరు: మహా కాళి వేషధారణలో భక్తుడు


కాళి వేషధారణలో చిన్నారి


వీపునకు ఇనుప చువ్వ గుచ్చుకుని ఆటో లాగుతున్న యువకుడు

వేడుకగా తెప్పోత్సవం

తిరుత్తణి: మహా శివరాత్రి సందర్భంగా సర్వ మంగళీశ్వరస్వామి వారి తెప్పోత్సవం శనివారం రాత్రి కనుల పండువగా జరిగింది. తిరుత్తణి శివారులోని వేలంజేరిలో పురాతన సర్వ మంగళీశ్వర ఆలయంలో శివ లింగానికి అభిషేక పూజలు చేశారు. రాత్రి ఆలయ కొలనులో తెప్పోత్సవం వైభవంగా జరిగింది. తెప్పపై కొలువైన సర్వ మంగళీశ్వరస్వామి భక్తుల శివనామస్మరణ నడుమ కొలనులో మూడుసార్లు విహరించి దర్శన భాగ్యం కల్పించారు. డీఎంకే యూనియన్ కార్యదర్శి ఆర్తిరవి, గ్రామస్తులు పాల్గొన్నారు.


తెప్పపై విహరిస్తున్న సర్వ మంగళీశ్వరస్వామి

పార్కిన్సన్ వ్యాధిపై అప్రమత్తత అవసరం

–న్యూరాలజీ ప్రొఫెసర్ కె.రాయ్ చౌదరి

కొరుక్కుపేట: పార్కిన్సన్ మెదడు రుగ్మత వ్యాధి అని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని కింగ్స్ కాలేజ్ లండన్ (కేసీఎల్) న్యూరాలజీ ప్రొఫెసర్ కె.రాయ్ చౌదరి అన్నారు. ఈ వ్యాధిపై మరిన్ని పరిశోధనలు చేపట్టేందుకు వీలుగా ఎస్‌ఆర్‌ఎం మెడికల్ కాలేజ్, హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్, కింగ్స్ కాలేజ్ లండన్ మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రూపమ్ బోర్గోహైన్ ప్రాతినిధ్యం వహించిన ఈ సమావేశంలో కేసీఎల్ ప్రతినిధులు, ఎస్‌ఆర్‌ఎం న్యూరాలజీ విజిటింగ్ ప్రొఫెసర్, కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ వినోద్ మెట్టా, ప్రో–వైస్ చాన్సలర్ డాక్టర్ ఏ. రవికుమార్, రీసెర్చ్ సెంటర్ డీన్ ఏ. సుందరం, మెడికల్ రీసెర్చ్ డీన్ రాజీవ్ జనార్ధనన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో అనేక మంది రోగులు ఈ వ్యాధితో బాధపడుతున్నారని అన్నారు. ఈ ఒప్పందం వేల మంది రోగులకు సహాయం చేస్తుందని తెలిపారు.


కింగ్ కాలేజ్ ప్రతినిధులతో ఎస్‌ఆర్‌ఎం బృందం

వైభవం..వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

కొరుక్కుపేట: లోక క్షేమాన్ని కాంక్షిస్తూ కాలజ్ఞాని శ్రీమత్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక కొరట్టూర్‌లోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. మాఘ బహుళ త్రయోదశి శుభ ముహూర్తంలో కల్యాణోత్సవానికి నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్త రామా సుబ్రహ్మణ్యం బ్రహ్మంగారి చరిత్రను వివరించారు. ఆశ్రమ అధ్యక్షుడు టి.వీరభద్రరావు, కార్యదర్శి ఏఎస్ బలరామమూర్తి, కోశాధికారి ఎస్.కిషోర్, ట్రస్టీలు సీతారామ శర్మ, బీఎస్ రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అంబత్తూర్ సాయిబాబా ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మోతీ బాబా, తెలుగు ప్రముఖులు వీరమల్ల వీరభద్రరావు, జవహర్ బాబు పాల్గొన్నారు.


కల్యాణోత్సవంలో నిర్వాహకులు, అతిథులు

పరామర్శకు వచ్చి మృత్యువాత

తిరువొత్తియూరు: చెన్నై తిరువొత్తియూర్‌లో మృతదేహం ఉంచిన ఫ్రీజర్ బాక్స్ నుంచి విద్యుత్ షాక్ తగిలి యువకుడు మృతి చెందాడు. మరో 20 మందికి గాయాలయ్యాయి. వివరాలు.. రాజాకడై తిరుచునాం కుప్పం వీధికి చెందిన నందిని కుమార్తె అభినయ (16) చెవి నొప్పికి ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేసుకుంది. అయితే నొప్పి తీవ్రం కావడంతో చెన్నై ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. విద్యార్థిని మృతికి ఆసుపత్రి వైద్యులే కారణమని ఆరోపిస్తూ బంధువులు ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని తీసుకోవడానికి తిరస్కరించారు. ఆదివారం మధ్యాహ్నం పోలీసులు విద్యార్థిని బంధువులకు నచ్చజెప్పి మృతదేహాన్ని అప్పగించారు. దీంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి బంధువుల సందర్శన నిమిత్తం విద్యుత్ ఫ్రీజర్ బాక్స్‌లో పెట్టారు. ఫ్రీజర్ బాక్స్ నుంచి విద్యుత్ ప్రసారమై అక్కడ నిలబడి ఉన్న అజిత్ (19)కి షాక్ తగిలి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అదే విధంగా 20 మందికి విద్యుత్ షాక్ తగిలి గాయపడ్డారు. వారిలో సౌమ్య, సుందరి సహా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.

ప్రణాళికతోనే విజయం

కొరుక్కుపేట: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే విజయం సాధించవచ్చని మద్రాసు సెంటిరీ తెలుగు బాప్టిస్టు సంఘం (ఎంటీబీసీ) కాపరి రెవరెండ్ ఎస్.రాజేంద్రప్రసాద్ అన్నారు. వేప్పేరి హైరోడ్డులోని సంఘ ప్రాంగణంలో ఆదివారం ప్రార్థనలు చేశారు. పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న 10, ప్లస్ 1, ప్లస్ 2 విద్యార్థులు ఆరోగ్యంగా పరీక్షలు రాసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కష్టపడి చదువుకోవాలని, జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు.


విద్యార్థులతో రెవరెండ్ రాజేంద్ర ప్రసాద్

భార్య దూరమైందని భర్త ఆత్మహత్య

తిరువొత్తియూరు: భార్య తన నుంచి వెళ్లిపోవడంతో మనస్తాపంతో భర్త మృతిచెందాడు. వివరాలు.. చెన్నై కొలత్తూరు సమీపంలోని వెట్రినగర్‌కి చెందిన మణికంఠన్ (26) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య షన్మది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో పది రోజుల క్రితం షన్మది పుట్టింటికి వెళ్లింది. మనస్తాపం చెందిన మణికంఠన్ శనివారం రాత్రి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరువినగర్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు విచారణ చేస్తున్నారు.

డీఎస్‌ఓ మృతి


జ్యోతి (ఫైల్)

తిరువళ్లూరు: జిల్లా సివిల్ సప్‌లై అధికారి జ్యోతి గుండె పోటుకు గురై చెన్నై ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వేలూరు జిల్లా అరసమరైపేటకు చెందిన జ్యోతి(58) తిరువళ్లూరు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సివిల్ సప్‌లై అధికారిగానూ, తిరువళ్లూరు ఇన్‌చార్జ్ ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం యథావిధిగా నేతాజీ రోడ్డులో ఇంటి నుండి కారులో కార్యాలయానికి బయలుదేరారు. హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయారు. ఆయన్ను తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం పోరూర్ రామచంద్ర వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి మృతి చెందారు. జ్యోతికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, డీఆర్వో ఆశోకన్ మృతదేహానికి నివాళులర్పించారు.

చెత్తకుప్పలో పసికందు మృతదేహం

అన్నానగర్: చెత్తకుప్పలో 5 నెలల పసికందు మృతదేహం లభ్యమైన సంఘటన శనివారం రాత్రి పెరవళ్లూరులో కలకలం రేపింది. చెన్నై పెరవళ్లూరులోని అగరం ప్రాంతానికి చెందిన మహేంద్రన్ (33) శనివారం రాత్రి పని ముగించుకుని ముత్తుకు మారప్ప రోడ్డు నుంచి బైకుపై ఇంటికి వెళుతున్నాడు. అక్కడ ఉన్న చెత్తకుండీ దగ్గర ఇద్దరు అబ్బాయిలు నిలబడి ఉన్నారు. అనుమానంతో చెత్తకుండీ దగ్గరకు వెళ్లగా అందులో మగబిడ్డ కనిపించింది. వెంటనే పెరవళ్లూరు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మగబిడ్డను స్వాధీనం చేసుకుని కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు బాబును పరీక్షించగా మృతి చెందినట్లు వెల్లడించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు గ్రాముల బంగారం కోసం వృద్ధురాలి హత్య

తిరువొత్తియూరు: చెన్నై రెడ్‌హిల్స్‌లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిపై రోకలిబండతో దాడి చేసి హత్య చేసి 4 గ్రాముల బంగారాన్ని చోరీ చేసిన పక్కింటికి వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పాడినల్లూర్ మూవెండర్ వీధికి చెందిన మేరీ (81) ఒంటరిగా నివాసం ఉంటోంది. శనివారం ఉదయం రక్తపు మడుగులో శవంగా పడి ఉన్నారు. రెడ్‌హిల్స్ ఇన్‌స్పెక్టర్ రమేష్ దర్యాప్తు చేపట్టారు. మేరీ చెవులకు ఉన్న 4 గ్రాముల బంగారు కమ్మల కోసం వెంకటేష్ (30) హత్య చేసినట్లు తెలిసింది. అతన్ని అరెస్ట్ చేసి పుళల్ జైలుకు తరలించారు.

సరస్సు ఆక్రమణ.. 740 మందికి నోటీసులు

అన్నానగర్: ఊరబాక్కం సరస్సును ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న 740 మందికి ఇళ్లు ఖాళీ చేయాలని జిల్లా ప్రజాపనుల శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉత్కంఠ నెలకొంది. చెంగల్పట్టు జిల్లా ఊరబాక్కం, కీళంబాక్కం, ఐయ్యంజేరి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో 70వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. రాజీవ్‌గాంధీ నగర్‌లో పదేళ్ల క్రితం ఎండిపోయిన ఊరబాక్కం సరస్సును ఆక్రమించి కొందరు ఇళ్లు నిర్మించి నివాసం ఉంటున్నారు. వరదనీరు నివాస ప్రాంతాల్లోకి రాకుండా ఆక్రమణలను తొలగించాలని మద్రాసు హైకోర్టు ఇటీవల ఆదేశించింది. రాజీవ్‌గాంధీ నగర్‌లో సరస్సు ఆక్రమణ ఇళ్లను వెంటనే తొలగించాలని కలెక్టర్ రాహుల్‌నాథ్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్ ఇన్‌స్పెక్టర్లు బాలమురుగన్, రమేష్ శనివారం సాయంత్రం ఊరబాక్కం సరస్సును పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన 740 ఇళ్లను ఖాళీ చేయాలని ఆ ప్రాంత ప్రజలకు చెప్పారు. సహాయ గ్రామ పరిపాలన అధికారి రవి నోటీసులు జారీ చేశారు. ఊరబాక్కం సరస్సు నివాసితులు ఆ స్థలంలో చట్టపరమైన భూమిని క్లెయిమ్ చేయడానికి పత్రాలు కలిగి ఉంటే వారు నేరుగా చెంగల్పట్టు జిల్లా జలవనరుల శాఖ ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో 27వ తేదీలోపు హాజరు కావచ్చని నోటీసులో పేర్కొన్నారు. తెలపని పక్షంలో సరస్సు ఆక్రమణ ఇళ్లు, దుకాణాలు తొలగిస్తామన్నారు. దీంతో ఆదివారం ఊరపాక్కం సరస్సులో మిగిలిన ఆక్రమణల ఇళ్ల తొలగింపునకు సంబంధించి పబ్లిక్ వర్క్స్ శాఖ అధికారులు సంబంధిత యజమానులకు హెచ్చరిక నోటీసు జారీ చేశారు. నోటీసులు ఇచ్చేందుకు సంబంధిత శాఖాధికారులు, గ్రామ పరిపాలన అధికారులు స్వయంగా రావడానికి వెనకడుగు వేస్తున్నారు. దీంతో ప్రజాపనుల శాఖ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి నోటీసులు ఇవ్వడంతో వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

అట్టహాసంగా టేబుల్ టెన్నిస్ పోటీలు ఆరంభం

కొరుక్కుపేట: స్థానిక టి.నగర్‌లోని ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ఆధ్వర్యంలో ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల తరహాలో చెన్నై ప్రీమియర్ క్లబ్స్ లీగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆస్కాలోని గోదావరి హాలులో ఏర్పాటైన ఈ పోటీలను సుప్రసిద్ధ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు పద్మశ్రీ శరత్ కుమార్ అచంట, ఆస్కా అధ్యక్షుడు డాక్టర్ కె. సుబ్బారెడ్డి, సంయుక్త కార్యదర్శి జేకే రెడ్డి జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ పోటీల్లో నగరంలో ప్రఖ్యాతిగాంచిన టెన్నిస్ జట్ల నుంచి మేటి క్రీడాకారులను 60 మంది దాకా ఎంపిక చేసి, వారితో ఆరు జట్లు రూపొందించారు. ఆస్కా కమిటీ సభ్యుడు, క్రీడా విభాగ ఇన్చార్జ్ వై.శ్రీధర్ ఈ టోర్నమెంట్ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ఈ పోటీలను ప్రారంభించిన తర్వాత ఆస్కా అధ్యక్షుడు సుబ్బారెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ ఆస్కా ఆధ్వర్యంలో 2012 తర్వాత భారీ స్థాయిలో టెన్నిస్ పోటీలు నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. పోటీలలో పాల్గొన్న జట్లకు షీల్డులు, ట్రోఫీలు బహూకరిస్తామన్నారు. ఒకే రోజు 60 మంది టెన్నిస్ క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనడం కూడా ఆస్కా చరిత్రలో ప్రప్రథమమని తెలిపారు. ఆస్కా సంయుక్త కార్యదర్శి జేకే రెడ్డి మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ పోటీల స్థాయిలో టెన్నిస్ పోటీలు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు.


పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పద్మశ్రీ శరత్ కుమార్ అచంట, సుబ్బారెడ్డి, వై.శ్రీధర్ తదితరులు

జూడో చాంపియన్ షిప్

తమిళనాడు జూడో అసోసియేషన్ నేతృత్వంలో జాతీయ స్థాయి సబ్ జూనియర్ క్యాడెట్ జూడో చాంపియన్‌షిప్ పోటీలు చెన్నై నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్నాయి. ఈనెల 21వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీలను క్రీడాశాఖ మంత్రి ఉదయ నిధి స్టాలిన్ ఆదివారం వీక్షించారు. క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా ఉదయనిధి స్టాలిన్‌ను ఎంపీ కళానిధి వీరాస్వామి, జపాన్ కాన్సుల్ జనరల్ టగా మసూకీ, బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ ఒలివర్ బల్హాట్చ్, తమిళనాడు ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐషరీ గణేష్ జ్ఞాపికను బహూకరించి సత్కరించారు. -సాక్షి, చెన్నై



తిరువళ్లూరుకు చేరిన సైకిల్ యాత్ర

తిరువళ్లూరు: ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేసి కాలుష్య రహిత దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలని కాంక్షిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన కుర్రం చైతన్య(22) చేస్తున్న సైకిల్ యాత్ర ఆదివారం ఉదయం తిరువళ్లూరుకు చేరింది. యువకుడికి పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణవేత్తలు స్వాగతం పలికారు. ఇతను గత ఏడాది డిసెంబర్ 22న నెల్లూరు నుంచి సైకిల్ యాత్రను ప్రారంభించాడు. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, గోవా, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌తో సహా 30 రాష్ట్రాలు, 700 జిల్లాలు, 50 వేల కిలోమీటర్లు ప్రయాణాన్ని సాగించి నెల్లూరులోని సింహపురి వైద్యశాల వద్ద యాత్రను ముగిస్తానని వివరించారు.


తిరువళ్లూరులో ప్రవేశించిన చైతన్య సైకిల్ యాత్ర

క్లుప్తంగా...

పల్నాడు జిల్లాలో స్వల్ప భూప్రకంపనలు

బెల్లంకొండ/అచ్చంపేట: పల్నాడు జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం స్వల్పంగా భూమి కంపించింది. ఉదయం 7.25 గంటలకు పెద్ద శబ్దంతో 3 సెకన్ల పాటు భూప్రకంపనలు వచ్చాయి. బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం, రామాంజేయపురం, అచ్చంపేట మండలం పులిచింతల ప్రాజెక్ట్ సమీపంలోని మాదిపాడు, చట్టుబడి తండా, కంచుబోడు తండా, గింజుపల్లి, గింజుపల్లి తండా, కుంటిమద్ది, చల్లగరిక, తాడువాయి గ్రామాల్లో భూ ప్రకంపనలు వచ్చాయి. దీంతో ఇళ్లలో ఉన్న వారు బయటకు పరుగులు తీశారు.

తెలంగాణ

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న కన్నుమూత



కంటోన్మెంట్/సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సాయన్న(72) ఆదివారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య గీత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సాయన్న ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1994, 1999, 2004, 2014, 2018 ఎన్నికల్లో గెలుపొందారు. 2014లో టీడీపీ నుంచి టీఆర్ఎస్‌లో చేరారు. సాయన్న అంత్యక్రియలు మారేడుపల్లిలోని స్మశానవాటికలో సోమవారం జరగనున్నాయి. సాయన్న మృతిపై తెలంగాణ సీఎం కేసీఆర్‌తోపాటు పలువురు మంత్రులు, పలు పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలు సంతాపం ప్రకటించారు.

నటుడు నరేష్ క్యారవాన్‌పై దాడి



గచ్చిబౌలి (హైదరాబాద్): నటుడు నరేష్ ఇంటి ముందు పార్క్ చేసిన క్యారవాన్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని ఆయన పీఏ ఆదివారం గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనలో క్యారవాన్ ముందు అద్దం ధ్వంసమైందని ఆయన పేర్కొన్నారు. గతంలోను నరేష్ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడటంపై ఫిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు. నరేష్ పీఏ ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలంటే.. కోర్టు అనుమతి తీసుకోవలసి ఉంటుందని గచ్చిబౌలి సీఐ సురేష్ స్పష్టం చేశారు.

కోస్తా తెలుగుదేశం.. అయోమయం

సాక్షి ప్రత్యేక ప్రతినిధి/ సాక్షి, అమరావతి: మధ్య కోస్తాంధ్రలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి దీనంగా మారింది. సీనియర్లు చేతులెత్తేయడంతో పలు జిల్లాల్లో పార్టీని నడిపించే నాథులే లేకుండాపోయారు. అధికారంలో ఉన్నప్పుడు హవా చెలాయించిన నేతలు ఇప్పుడు చంద్రబాబుకు మొహం చాటేస్తుండడంతో ఆయన కొత్త వారి కోసం అన్వేషణలో మునిగిపోయారు. పలు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించ లేక.. ఎవరు పార్టీలోకి వస్తారా అని ఎదురు చూపులు చూస్తున్నారు. పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు, వలస నేతలపై ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరులో కానుకలు ఆశ చూపి జనాన్ని రప్పించేందుకు ప్రయత్నించి ముగ్గురు మృతికి కారణమయ్యారు. మైదానాల్లో సభలు పెట్టేందుకు ధైర్యం చేయలేక.. ఇరుకు సందుల్లో సభల నిర్వహణకు మొగ్గు చూపుతున్నారు. వైఎస్ జగన్‌ను ఎదుర్కోవడం తన వల్ల కాదని అర్థమవడంతో తోడు కోసం తహ తహ లాడుతున్నారు. గుంటూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీని నడిపించే నాయకుడే కరువయ్యాడు. సీనియర్లు చేతులెత్తేసిన పరిస్థితుల్లో కొత్త వారి కోసం చంద్రబాబు గేలం వేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అన్నీ తానై చక్రం తిప్పిన మాజీ మంత్రి ప్రత్తిపాటి



పుల్లారావు గత ఎన్నికల్లో ఓటమి తర్వాత పూర్తిగా సైలెంట్ అయిపోయారు. హైదరాబాద్‌లోనే ఉండి వ్యాపారాలు చూసుకుంటున్నారు. టీడీపీ తరఫున గెలిచిన ముగ్గురు ఎంపీల్లో ఒకరైన గల్లా జయదేవ్ అడ్రస్ లేకుండా పోయారని ఆ పార్టీ నేతలే వాపోతున్నారు. ఆయన తన నియోజకవర్గం గుంటూరులో పర్యటించి ఏడాది దాటిపోయింది. ధూళిపాళ నరేంద్ర, ఆలపాటి రాజా వంటి నేతలు మొక్కుబడి కార్యక్రమాలు మినహా పార్టీలో చురుగ్గా తిరగడం లేదని టీడీపీ శ్రేణులు వాపోతున్నాయి. తెనాలి సీటు పొత్తులో పోతుందనే ప్రచారం, గుంటూరు వెస్ట్‌లో కన్నా లక్ష్మీనారాయణ కర్చీఫ్ వేయడంతో ఆలపాటి రాజా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కీలకమైన సత్తెనపల్లికి ఇప్పటి వరకు ఇన్‌ఛార్జినే నియమించకపోగా, రిజర్వుడు నియోజకవర్గం పత్తిపాడులో జనరల్ వ్యక్తిని ఇన్‌ఛార్జిగా పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. మాచర్లలో ఫ్యాక్షనిజాన్ని నమ్ముకున్నారు.

మాలోకం పరిస్థితి ఎంటో!

మంగళగిరిలో పార్టీ పరిస్థితి గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిదని టీడీపీ శ్రేణులే చెబుతున్నాయి. గంజి చిరంజీవి, మరికొందరు టీడీపీని వీడిన తర్వాత లోకేశ్ భవితవ్యం ఇక్కడ ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ ఎలా గెలవాలో తెలియని ఆందోళన ఓ వైపు పీడిస్తుండగా.. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర మొదలు పెట్టడం మైనస్సేనని కార్యకర్తలు కుండబద్ధలు కొడుతున్నారు.

'తూర్పు'లో దీనావస్థ..

- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, జ్యోతుల నెహ్రూ మధ్య విభేదాలు, ఆధిపత్య పోరు సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతూనే ఉంది. యనమల తన సొంత నియోజకవర్గం తునిలోనూ తమ్ముడు కృష్ణుడితో విరోధం తెచ్చుకున్నారు. ఇన్నాళ్లూ తనకు అండగా నిలిచిన సోదరుడిని పక్కన పెట్టి, తన కుమార్తె దివ్యకు తుని ఇన్‌ఛార్జి పదవి ఇప్పించుకోవడంతో ఆయన కుటుంబంలో చిచ్చు రేగింది.
- రాజమండ్రిలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి భవాని, గోరంట్ల బుచ్చయ్య చౌదరిల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. గోరంట్ల రాజమండ్రి నగరానికి వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా ఆదిరెడ్డి కుటుంబం అడ్డుకుంటోంది. చంద్రబాబు తనను అవసరానికి వాడుకుని పట్టించుకోవడం లేదని, ఆదిరెడ్డిని ప్రోత్సహిస్తున్నారనే అసంతృప్తితో గోరంట్ల రగిలిపోతున్నారు.
- రాజానగరం, పి గన్నవరం, కొవ్వూరు నియోజకవర్గాలకు చంద్రబాబు ఇంతవరకు ఇన్‌ఛార్జిలనే నియమించలేకపోయారు. రాజానగరంలో పెందుర్తి వెంకటేష్ తప్పుకున్న తర్వాత కొత్త నాయకుడు దొరకలేదు. పెద్దాపురంలో సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, బొడ్డు భాస్కరరామారావు కొడుకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇటీవల చంద్రబాబు పర్యటనలో రాజప్పే పెద్దాపురం అభ్యర్థిని ప్రకటించినా వెనువెంటనే బొడ్డు వర్గం ఆయన్ను అడ్డుకుని గందరగోళం సృష్టించింది.
- పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ వర్మపై స్థానిక టీడీపీ నేతలంతా కట్టకట్టుకుని వెళ్లి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. తోట త్రిమూర్తులు వైఎస్సార్‌సీపీలో చేరాక రామచంద్రాపురంలో టీడీపీయే లేకుండా పోయింది.
- రంపచోడవరంలో టీడీపీ నిస్తేజంగా మారింది. చంద్రబాబు ఇచ్చిన పిలుపును తూర్పులో పట్టించుకునే పరిస్థితి లేదు. అందుకే చంద్రబాబు మొన్న అనపర్తిలో సభకు ఇరుకు సందును ఎంచుకుని జనం ఎక్కువగా వచ్చినట్లు చూపించేందుకు ప్రయత్నించారు.

ఉమ్మడి కృష్ణాలో ఎదురీత

- ఉమ్మడి కృష్ణా జిల్లాలో టీడీపీ ముఖ్య నాయకులు కాడి వదిలేశారు. తమకు పట్టుందని చెప్పుకునే జిల్లాలోనే ఆ పార్టీ నేతలు ఎదురీదుతున్నారు. విజయవాడలో ఉన్న నేతలంతా ఎవరికి వారు సొంత గ్రూపులు పెట్టుకుని రచ్చ రాజకీయాలతో కాలం గడుపుతున్నారు.
- అధికారంలో ఉన్నప్పుడు చక్రం తిప్పిన దేవినేని ఉమామహేశ్వరరావు ఇప్పుడు మైలవరంలో పోటీ చేస్తే చిత్తుగా ఓడిపోతాననే భయంతో పక్క నియోజకవర్గాల వైపు తొంగి చూస్తున్నారు.
- విజయవాడ ఎంపీ కేశినేని నాని చంద్రబాబుపై తిరుగుబాటు జెండా ఎగురవేసి తాను మళ్లీ పోటీ చేయనని చెబుతున్నారు. కేశినేని నానికి పొగ పెట్టేలా బుద్దా వెంకన్న, బోండా ఉమా తదితర నేతలు ఆయన తమ్ముడు కేశినేని శివనాథ్‌ను ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి తీసుకువచ్చారు.
- బందరు ఎంపీగా ఓటమిపాలైన కొనకళ్ల నారాయణ ఈసారి పెడన ఎమ్మెల్యేగా పోటీ చేయాలని చూస్తుండడంతో కాగిత వెంకట్రావు కుమారుడు కృష్ణప్రసాద్ కారాలు, మిరియాలు నూరుతున్నారు. వారి మధ్య సయోధ్య కుదర్చలేక చంద్రబాబు ఆపసోపాలు పడుతున్నారు. పామర్రులో మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పనను పక్కకు తప్పించి, వర్ల రామయ్య కుమారుడు కుమార్ రాజాను ఇన్‌ఛార్జిగా నియమించినా అక్కడ క్యాడర్‌లో అయోమయం తొలగలేదు.
- గుడివాడ, గన్నవరం, నూజివీడు నియోజకవర్గాల్లో టీడీపీ కుంటుకుంటూ నడుస్తోంది. వల్లభనేని వంశీ టీడీపీకి దూరమయ్యాక ఇప్పటి వరకు గన్నవరానికి సరైన ఇన్‌ఛార్జిని నియమించలేకపోయారు. గుడివాడలో కొడాలి నానిని ఎదుర్కొనే నేత కోసం చంద్రబాబు అన్వేషణ కొనసాగుతూనే ఉంది. రావి వెంకటేశ్వరరావు, మరికొందరు నేతలను పని చేయిస్తున్నా, వారు నానిపై పోటీకి సరిపోరని అక్కడి క్యాడర్ తెగేసి చెబుతోంది. నూజివీడు, తిరువూరులోనూ ఆ పార్టీని నడిపించే నాథులు లేరు.

పూర్వపు పశ్చిమలో నాయకత్వం కరువు

- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనూ టీడీపీని నాయకత్వ సమస్య వేధిస్తోంది. గతంలో జిల్లాను నడిపించిన మాగంటి బాబు, సీతారామలక్ష్మి వంటి నేతలు ప్రస్తుతం స్తబ్దుగా ఉంటున్నారు.
- మిగిలిన చాలా నియోజకవర్గాల్లో ఆ పార్టీ నేతలు చురుగ్గా లేకపోవడం, బలహీన నాయకులు కావడంతో పార్టీ కార్యక్రమాలేవీ జరగడంలేదు. ఉండి నియోజకవర్గంలో ఎమ్మెల్యే రామరాజు ఒక గ్రూపుగా, మాజీ ఎమ్మెల్యే శివ రామరాజు మరో గ్రూపుగా మారడంతో ఇబ్బందికర పరిస్థితి నెలకొంది.
- కీలకమైన భీమవరంలో ఆ పార్టీకి పూర్తి స్థాయి ఇన్‌ఛార్జి లేక పరిస్థితి దయనీయంగా ఉంది. మాజీ ఎంపీ సీతారామలక్ష్మిని ఇన్‌ఛార్జిగా పెట్టినా అది కంటి తుడుపు చర్యేనని పార్టీ నాయకులు వాపోతున్నారు. చింతలపూడికి మాజీ మంత్రి పీతల సుజాత దూరమవడంతో ఇప్పుడు అక్కడ ఇన్‌ఛార్జి లేరు. ద్వితీయ శ్రేణి నాయకులతోనే పార్టీ నడుస్తోంది. నర్సాపురం, కైకలూరు, పోలవరం, ఏలూరు నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీని నాయకత్వ సమస్య పీడిస్తోంది. కైకలూరు ఇన్‌ఛార్జి జయమంగళ వెంకటరమణ రెండు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీలో చేరడంతో అక్కడ టీడీపీ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారింది.

తారకరత్నకు ప్రముఖుల నివాళి







ప్రముఖ నటుడు తారకరత్న భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న మెగాస్టార్ చిరంజీవి, ప్రతిపక్ష నేత చంద్రబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి

మోకిల గ్రామానికి పలువురు సినీ నటులు, రాజకీయ నేతలు

శంకర్‌పల్లి(హైదరాబాద్): సినీ నటుడు నందమూరి తారకరత్నకు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తారకరత్న శనివారం రాత్రి తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. కాగా ఆయన పార్థివదేహాన్ని ఆదివారం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామంలోని స్వగృహానికి తరలించారు. ఉదయం 8 గంటలకు మోకిలకు చేరుకోగానే బాబాయ్ బాలకృష్ణ ఇతర కుటుంబ సభ్యులు, అభిమానులు బోరున విలపించారు. టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్ దంపతులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, సినీ నటులు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్, మోహన్‌బాబు, రాజేంద్రప్రసాద్, మురళీమోహన్, అలీ, శ్రీకాంత్, జీవిత రాజశేఖర్, శివ బాలాజీ, తనీష్, రవిబాబు, దర్శకుడు రాఘవేంద్రరావు, నిర్మాత అశ్వనీదత్, మాజీ మంత్రులు కొడాలి నాని, దేవినేని ఉమ, పరిటాల సునీత, ఆమె తనయుడు పరిటాల శ్రీరామ్, పలువురు బీఆర్ఎస్ పార్టీ నేతలు, వైఎస్సార్‌టీపీ అధినేత వైఎస్ షర్మిల తదితరులు కూడా నివాళులర్పించారు. తారకరత్న కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తారకరత్న సతీమణి అలేఖ్య రెడ్డికి సమీప బంధువు అయిన ఎంపీ విజయసాయిరెడ్డి ఉదయం నుంచి అక్కడే ఉండి ఏర్పాట్లను పరిశీలించారు. ఎప్పుడూ నవ్వుతూ ఉండే తారకరత్న మరణం బాధాకరమని చంద్రబాబు అన్నారు. తాతగారు పెట్టిన పార్టీలోనే ఉంటానని, ఆయన మార్గంలోనే నడుస్తానని తారకరత్న చెప్పేవాడని మాజీ మంత్రి కొడాలి నాని చెప్పారు.

విప్పపువ్వు.. గిరిజనుల కల్పతరువు

మూడు నెలల పాటు అడవి బిడ్డలకు ఉపాధి	విప్పపువ్వులో ఎన్నో పోషకాలు

బుట్టాయగూడెం: ఆదివాసీ గిరిపుత్రులకు అక్కడ లభించే ఉత్పత్తులు జీవనాధారం కల్పిస్తున్నారు. అడవిలో లభించే అటవీ ఉత్పత్తులు సేకరించి వాటిని విక్రయిస్తూ ఉపాధి పొందుతుంటారు. కొందరు అడవిలో ఉండే వెదురుతో బుట్టలు, చాటలు వంటివి నైపుణ్యంలో తయారు చేసి విక్రయిస్తారు. మరి కొందరు తేనె సేకరణ, తునికాకు, అడ్డాకుతో పాటు పలు రకాల ఉత్పత్తులు సేకరిస్తారు. కాలానికి అనుగుణంగా ఉపాధిని ఇచ్చే వృక్షాల్లో ఇప్పచెట్లు ప్రధానమైనవి. వేసవిలో వీటి ద్వారా గిరిజనులు ఉపాధి పొందడానికి అనేక అవసరాలు ఉన్నాయి. విప్పపువ్వును గిరిజనులు తెల్లవారుజామునే అడవిలోకి వెళ్లి సేకరిస్తారు. తెల్లవారుజామున చెట్లపై నుండి కిందపడిన ఇప్పపువ్వును మధ్యాహ్నానికి సేకరించి ఇంటికి తెచ్చి ఎండబెడతారు.

మూడు నెలల పాటు ఉపాధి

మన్యం ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు విప్ప చెట్ల ద్వారా మూడు నెలల పాటు ఉపాధి దొరుకుతుంది. ఖరీఫ్, రబీ పనులు ముగిసే సమయానికి విప్ప చెట్లు విరగపూస్తాయి. వీటి పువ్వులు గాలికి నేలరాలుతుంటాయి. ఈ పువ్వులను గిరిజనులు సేకరిస్తారు. వీటితోపాటు మొర్రి పండ్లు సేకరించి ఇంటికి తీసుకువస్తుంటారు. వీటిని సేకరించి మార్చి, ఏప్రిల్, మే నెలల్లో విక్రయించి ఉపాధి పొందుతుంటారు.

విప్పపువ్వుతో ఔషధాలు తయారీ




విప్ప పువ్వు

గిరిజనులు సేకరించిన ఇప్పపువ్వును జీసీసీల ద్వారా కొనుగోలు చేస్తుంటారు. ఇప్పపువ్వులో ఎన్నెన్నో ఔషధ విలువలు ఉండడంతో ఈ పువ్వును ఔషధాల తయారీకి విక్రయిస్తారు. ఇప్పపువ్వు నుంచి తీసిన తైలాన్ని పక్షవాతం వంటి వ్యాధులకు ఉపయోగిస్తారు. విప్పపువ్వుతో దంతాలను శుభ్రం చేసుకోవడంతో దగ్గుకు, దంతాలకు సంబంధించిన వ్యాధులకు ఔషధంగా పనిచేస్తుంది. సచ్చమైన విప్పపువ్వుతో తయారు చేసిన సారాను సేవిస్తే వృద్ధాప్య లక్షణాలు త్వరగా రాకుండా ఉంటాయని గిరిజనులు అంటున్నారు.

వైద్యశాస్త్రంలోనూ ప్రాధాన్యం

వైద్యశాస్త్రంలోనూ విప్పపువ్వు ప్రాధాన్యతను సంపాదించుకుంది. అడవిలో లభించే ఇప్పపువ్వుల గింజల నుంచి తీసిన నూనెలో ఎన్నో పోషక విలువలున్నట్లు శాస్త్రీయంగా నిరూపించారు. భారత శాస్త్రీయ సాంకేతిక మంత్రిత్వ శాఖ సహాయంతో 1999లో నిర్వహించిన పరిశోధనలో ఎండిన ఇప్పపువ్వుల నుంచి పంచదారను తయారు చేసి జామ్, కేక్‌లు, చాక్లెట్‌లు తయారు చేసే విధానాన్ని కనిపెట్టారు. విప్ప పువ్వు ఎక్కువకాలం నిల్వ ఉండడానికి మధ్య మధ్యలో ఎండిన వేప ఆకును వేస్తే నిల్వ ఉంటుందని తెలుసుకున్నారు.



పశ్చిమ మన్యంలో 20 వేలకు పైగా విప్ప చెట్లు

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంతో పాటు పాపికొండల అభయారణ్యంలో ఇప్పచెట్లు దాదాపుగా 20 వేలకు పైగా ఉండవచ్చని అంచనా. ముఖ్యంగా బుట్టాయగూడెం మండలం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఈ ఇప్పచెట్లు అధికంగా ఉన్నాయి. అటవీ శాఖ ఆధ్వర్యంలో కూడా దాదాపుగా 5 వేల చెట్ల వరకూ అటవీప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాల్లో నాటి వాటిని పెంచుతున్నారు. గిరిజనులు సేకరించిన ఈ ఇప్పపువ్వులను జీసీసీ అధికారులే కాదు బయటి నుండి అనేక మంది వ్యాపారులు కూడా కొనుగోలు చేసి తీసుకువెళ్తుంటారు. ఇప్పపువ్వులో పోషకాలు ఎక్కువగా ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా వచ్చి వీటిని కొనుగోలు చేస్తున్నట్లు గిరిజనులు చెప్తున్నారు. ప్రస్తుతం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గుత్తుకోయలు, బుట్టాయగూడెం మండలంలో కొండరెడ్లు ఈ పువ్వులను సేకరిస్తూ జీవనోపాధి పొందుతున్నారు.


5 వేల ఇప్ప మొక్కలు నాటాం



పశ్చిమ అటవీ ప్రాంతంలో సహజసిద్ధంగా పెరిగిన ఇప్పచెట్లే కాకుండా అడవిలో ఉండే ఖాళీ ప్రదేశాల్లో సుమారు 5 వేల వరకూ విప్పమొక్కలను నాటి పెంచుతున్నాం. ఇప్పచెట్ల నుంచి వచ్చే పువ్వుల ద్వారా గిరిజనులు ఉపాధి పొందుతున్నారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో గుత్తుకోయలు, బుట్టాయగూడెం మండలాల్లో కొండరెడ్లు ప్రస్తుతం విప్పపువ్వు సేకరణలో ఉపాధి పొందుతున్నారు.

– దావీదురాజు నాయుడు,
అటవీ శాఖ డీఆర్ఓ, పోలవరం

జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి



మా గ్రామ సమీపంలోని అడవుల్లో విప్పపువ్వుతోపాటు పలు ఉత్పత్తులు లభిస్తున్నాయి. విప్పపువ్వుతోపాటు పలు ఉత్పత్తులను గతంలో కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం జీసీసీ అధికారులు ఇప్పపువ్వు కొనుగోలు చెయ్యడంలేదు. ప్రస్తుతం ఇప్పపువ్వు సీజన్ ప్రారంభమవుతుంది. జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలని కోరుతున్నాం.

– కెచ్చెల బాలిరెడ్డి,
కొండరెడ్డి గిరిజనుడు– మోదేలు

పాడి సంపద అభివృద్ధికి...పెద్దపీట

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాడి రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా పాడి సంపద అభివృద్ధికి చర్యలు చేపట్టింది. మూగజీవాల ఆరోగ్య పరిరక్షణతో పాటు మేలు జాతి పునరుత్పత్తి పథకం ప్రారంభించింది.



మేలు జాతి ఆడ దూడలు

మేలు జాతి దూడల ఉత్పత్తే లక్ష్యం

- రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పునరుత్పత్తి
- వీర్య ఇంజక్షన్ల ధర రూ.1350కాగా రైతు చెల్లించాల్సింది రూ. 500
- విజయనగరం జిల్లాలో పెరగనున్న పాల దిగుబడి, ఆడ దూడల ఉత్పత్తి

నెల్లిమర్ల: పాడి సంపద అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. పశువులు, జీవాల ఆరోగ్య సంరక్షణకు ఇప్పటికే 1962 సంచార పశు వైద్య శాలలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మూగజీవాలకు సరైన రోగ నిర్ధారణ చేసి, మరణాలను అరికట్టేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఆవులు, గేదెలు మేలు రకం ఆడ దూడలకు జన్మనివ్వడానికి, పాల ఉత్పత్తని పెంచడానికి రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా మేలు జాతి పునరుత్పత్తి పథకం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా పాడి రైతులకు సబ్సిడీపై లింగ నిర్ధారిత వీర్యం ఇంజక్షన్లను అందజేస్తారు. తద్వారా పాల ఉత్పత్తిని, మేలు రకం ఆడ దూడల పునరుత్పత్తిని పెంచుతారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పథకాన్ని ప్రస్తుతం చురుగ్గా అమలు చేస్తున్నారు. మొత్తం 8వేల పశువులకు ఇంజక్షన్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పథకం ఉద్దేశం ఇదే...

విజయనగరం జిల్లాలోని 27 మండలాల్లో పాడి సంపదను పెంచడం పథకం ఉద్దేశం. ఆవులు, గేదెలకు మేలు జాతి లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించి, ఆడ(పెయ్య) దూడలను ఉత్పత్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కచ్చితంగా 90 శాతం ఆడ దూడలనే పుట్టించడం, సదరు సాంకేతికతను రైతుల చెంతకు తీసుకెళ్లడం ఉద్దేశం. తద్వారా భవిష్యత్తులో అధిక శాతం మేలు జాతి పశువుల సంఖ్యను పెంచాలని సంబంధిత అధికారులు యోచిస్తున్నారు. అంతేగాకుండా ఈ పథకం ద్వారా పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు, పాడి రైతుల ఆదాయాన్ని పెంచడానికి ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మేలు జాతి ఆడ దూడలను ఉత్పత్తి చేసే వీర్య కణాలను పశువులకు అందిస్తున్నారు. ఈ ఏడాది 8 వేల పశువులకు సదరు ఇంజక్షన్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

లింగ నిర్ధారిత వీర్య కణాల రకాలివే

రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా పశువులకు అందించడానికి ప్రభుత్వం కొన్ని రకాల మేలు జాతి వీర్య కణాలను ఎంపిక చేసింది. విదేశీ గోజాతులైన జెర్సీ, హెచ్ఎఫ్, వాటి క్రాస్ బ్రీడ్, స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్ తదితర రకాలు అందుబాటులో ఉన్నాయి. గేదెల్లో ముర్రా జాతికి చెందిన వీర్య నాళికలు అందుబాటులో ఉన్నాయి. లింగ నిర్ధారిత వీర్యంపై ఆసక్తి కలిగిన ఔత్సాహిక రైతులందరికీ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఇటీవల కాలంలోనే ఈనిన పశువులు, 1 నుంచి 3 ఈతల మధ్య క్రమం తప్పకుండా ఎదకు వచ్చే పశువులు, ఎటువంటి గర్భకోశ వ్యాధులు లేనటువంటి పశువులను పథకానికి ఎంపిక చేస్తున్నారు.

గ్రామాల ఎంపిక

పథకం అమలుకు జిల్లా వ్యాప్తంగా మేలైన పశు సంపద, ఔత్సాహిక పశు పోషకులున్న గ్రామాలను పశు సంవర్ధకశాఖ అధికారులు ఎంపిక చేశారు. మొదటి దశలో జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో రెండేసి చొప్పున గ్రామాల్లో పథకం అమలు చేస్తునారు. ఎంపిక చేసిన గ్రామాల్లో కనీసం 35 నుంచి 40 పశువులను గుర్తించి, రైతులతో ఒప్పందం చేసుకున్నారు. ఆసక్తి కలిగిన రైతులకు అవగాహన కల్పించి, పథకాన్ని విస్తరింపజేస్తున్నారు. తద్వారా జిల్లాలోని అన్ని గ్రామాల్లో పాడి సంపదను అభివృద్ధి చేస్తారు. పాల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు.

ఆడ దూడల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యం



రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా ఆడ దూడల ఉత్పత్తిని గణనీయంగా పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీని ద్వారా లింగ నిర్ధారిత మేలు జాతి వీర్య కణాలను సబ్సిడీపై రైతులకు అందిస్తున్నాం. గ్రామాల్లోని పాడి రైతులకు సబ్సిడీపై వీర్య కణాల ఇంజక్షన్లు అందజేస్తున్నాం. రూ.1350 విలువ చేసే రెండు వీర్య కణాలను రూ.500కే అందిస్తున్నాం. మొదటి దశ పథకం అమలుకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గ్రామాలను గుర్తించాం. ఆయా గ్రామాల్లో ఈ ఏడాది మొత్తం 8 వేల ఇంజక్షన్లను పశువులకు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆసక్తి కలిగిన రైతులు సంబంధిత పశుసంవర్ధక శాఖాధికారులను సంప్రదించాలి.

– డాక్టర్ వైవి.రమణ,
జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి

సబ్సిడీపై రెండు వీర్య నాళికలు

ఈ పథకం ద్వారా ప్రభుత్వం పశువుల కృత్రిమ గర్భధారణకు అవసరమైన వీర్య నాళికలను సబ్సిడీపై పాడి రైతులకు అందజేస్తుంది. రెండు వీర్య నాళికల ధర రూ.1350 కాగా రైతు కేవలం రూ 500 చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన రూ.850 ప్రభుత్వమే సబ్సిడీగా అందజేస్తుంది. ఒకవేళ రెండు పర్యాయాలు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్ చేసిన తర్వాత కూడా పశువు గర్భం దాల్చకపోతే రైతు చెల్లించిన మొత్తం రూ.500 ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. మొదటిసారి గర్భం దాల్చిన పశువుకు మగ దూడ పుట్టినట్లయితే ఎటువంటి మొత్తం తిరిగి చెల్లించరు. రెండోసారి గనుక మగ దూడ పుట్టినట్లయితే రూ.250 తిరిగి రైతుకు చెల్లిస్తారు.

సన్నిధి



మంచి మాట

సంతోషం సమగ్ర బలం

సంతోషం సగం బలం' అన్నది మనకు బాగా తెలిసిన మాటే. నిజానికి మనిషికి సంతోషం సమగ్ర బలం. అంతేకాదు మనిషికి సంతోషం సహజమైన బలం కూడా. ఎంత బలవంతుడికైనా సంతోషం లేనప్పుడు అతడు బలహీనుడిగా అయిపోతాడు. సంతోషం కరువైపోయిన మనుషులు మనో వ్యాధులతో శుష్కించిపోవడమూ, నశించిపోవడమూ మనకు తెలిసిన విషయమే. బావుండాలంటే మనిషికి సంతోషం ఎంతో ముఖ్యం. వర్తమానంలో మనం సంతోషంతో ఉంటే లేదా మనం వర్తమానాన్ని సంతోష భరితంగా చేసుకోగలిగితే మన భవిష్యత్తు సంతోషమయంగా ఉంటుంది.

‘సంతోషానికి మార్గం లేదు, సంతోషమే మార్గం’ ఇది గౌతమ బుద్ధుడి ఉవాచ. సంతోషం అనేది సంపాదించుకోగలిగేదీ, సాధించుకోగలిగేదీ కాదు. సంతోషం మనలో ప్రవహించే రక్తంలాంటిది. బయటనుంచి వచ్చేది కాదు. మనలోంచి మన కోసం మనమై కలిగేది. ‘మనం మన ఆలోచనల వల్ల నిర్మితం అయ్యాం; మనం మన ఆలోచనలకు అనుగుణంగా రూపొందుతాం; మన మెదడు నిర్మలంగా ఉంటే సంతోషం వీడని నీడలా అనుసరిస్తుంది’ అని చెప్పాడు బుద్ధుడు. మనిషి సంతోషంగా ఉండడం అతడి ఆలోచనావిధానంపై ఆధారపడి ఉంటుంది. ఆలోచన ఆధారంగా కలిగే అనుభూతి సంతోషం. ఒకరికి సంతోషాన్ని ఇచ్చేది మరొకరికి సంతోషాన్ని ఇచ్చేది కాకపోవచ్చు.

‘సూర్యుడి కాంతి మనుషులకు వెలుగును ఇస్తూ ఉంటే గుడ్లగూబలకు చీకటి అవుతోంది. నీటిలో మునిగినప్పుడు మనుషులకు, పశువులకు ఆ నీరు శ్వాసకు ప్రతిబంధకం అవుతోంది. ఆ నీరే చేపల శ్వాసకు ఆటంకం అవడం లేదు. మనుషులు హాయిగా గాలి పీల్చుకునే తీరప్రదేశంలో చేపలు గాలి పీల్చుకోలేవు. అగ్ని అన్నిటినీ దహిస్తుంది. కానీ అత్తిరిపక్షులు అగ్నికణాల్ని తింటాయి. నీళ్లవల్ల నిప్పు నశిస్తుంది. కానీ బడబాగ్ని సముద్రం మధ్యలో జ్వలిస్తూ ఉంటుంది. ఇట్లా జగత్తులో విషయాలన్నీ ద్వైరూప్యంతో ఉన్నాయి అని భారతీయ తత్త్వసాహిత్యంలో అత్యున్నతమైన త్రిపురారహస్యంలో చెప్పబడింది. విషయాలనుబట్టి కాదు మనల్ని బట్టి మనకు తృప్తి కలుగుతూ ఉంటుంది లేదా మన తనివి తీరుతూ ఉంటుంది. కాబట్టి మన సంతోషానికి మనమే మూలంగా ఉన్నాం, ఉంటాం.

‘శరీరాన్ని శుష్కింపజెయ్యడంలో చింత లేదా విచారానికి సమానమైంది లేదు’ అని హితోపదేశం ఎన్నో యేళ్ల క్రితమే మనకు చెప్పింది. ‘చితి, చింత ఈ రెండిటిలో చింత ఎక్కువ దారుణమైంది. చితి నిర్జీవమైన శరీరాన్నే దహిస్తుంది కానీ చింత సజీవంగా ఉన్న శరీరాన్ని దహిస్తూ ఉంటుంది’ అని ఒక సంస్కృత శ్లోకం తెలియజేస్తోంది. నిజానికి చింత అనేది శరీరాన్ని మాత్రమే కాదు ఆలోచనా విధానాన్ని, వ్యక్తిత్వాన్ని, ప్రగతిని, జీవితాన్ని కూడా శుష్కింపజేస్తుంది. కాబట్టి మనకు కలిగిన చింతను వీలైనంత త్వరగా వదిలించుకోవాలి. మనకు కలిగిన చింత నుంచి మనం వీలైనంత త్వరగా విముక్తం అవ్వాలి.

‘మానవజాతిలోని చింత అంతా మనసువల్ల వచ్చిన జబ్బు’ అని తమిళకవి కణ్ణదాసన్ చెప్పారు. ఈ స్థితికి అతీతంగా మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు మనసే కీలకం. మనసువల్ల వచ్చిన చింతను ఆ మనసువల్లే తొలగించుకోవాలి.‘గాలి తనతో తీసుకు వచ్చిన మేఘాలను తానే చెదరగొడుతుంది.’ అని ఒక సంస్కృత శ్లోకం చెబుతోంది. ఆ విధంగా మనసువల్ల వచ్చిన చింతలను మనం మనసువల్లే పోగొట్టుకోవాలి.

సంతోషం మనిషిలోనే నిక్షిప్తం అయి ఉంది. దుఃఖాన్ని తొలగించుకునేందుకు తనను తాను చెక్కుకోవడం నేర్చుకుంటే మనిషి సంతోషశిల్పం అవుతాడు; మనిషి ‘సంతోషంగా’ ఉంటాడు.

– శ్రీకాంత్ జయంతి

అమృత బిందువులు

- నీకు వెలుగునిస్తున్నానని సూర్యుడు ఎప్పుడూ మనతో చెప్పుకోడు. అలాగే చల్లదనాన్ని ఇస్తున్నానని చంద్రుడు, వర్షాన్ని ఇస్తున్నానని మబ్బు, నీకు ఆహారాన్ని అందిస్తున్నానని భూమి చెప్పుకోదు. మరి మనం కొంచెం సాయం చేసి గొప్పగా చెప్పుకోవలసిన అవసరం లేదు. ఒకవేళ చెప్పినా ఏ బంధం శాశ్వతం కాదు.
- నిన్ను విమర్శించే ప్రతి వ్యక్తికి సంజాయిషీ చెప్తూ పోతే, నీ అడుగులు ముందుకు సాగేదెప్పుడు? కాబట్టి ధైర్యంగా ముందడుగు వేయి.
- జరిగినదాన్ని గురించి ఎప్పుడూ చింతించకు. ఎందుకంటే... మనకు జరిగే మంచి మనకు ఆనందాన్ని ఇస్తే, జరిగిన చెడు అనుభవాన్ని ఇస్తుంది.
- మేఘం నుండి జాలువారిన ప్రతి చినుకు ముత్యం కాకపోయినా... ఏ చిన్ని మొలకకో ప్రాణం పోస్తుంది. ఎండు ఆకు అయినా ఒకరి కడుపు నింపేందుకు విస్తరిగా మారుతుంది.
- ఈ విశాల సృష్టిలో పుట్టిన ప్రతి జీవి బతుక్కి ఒక అర్థం, పరమార్థం ఉంటాయి. అది తెలుసుకున్న వారి జీవితం చరితార్థం అవుతుంది.
- జీవితం అనేది ఒక ప్రశ్న లాంటిది. ఎవరూ సమాధానం చెప్పలేరు.
- చావు అనేది సమాధానం లాంటిది. ప్రశ్నించే ధైర్యం ఎవరికీ ఉండదు.

ధర్మం శరణం గచ్ఛామి!

దమ్మపదం



అది అందమైన అడవి. చెట్లు చివురులు తొడిగి నవనవలాడుతున్నాయి. నేలమీద పచ్చిక ఒత్తుగా పెరిగి ఉంది. ఎన్నో జింకలు మందగా వచ్చి, మేత మేస్తూ ఉన్నాయి. ఆ జింకల్ని కొట్టడానికి ఒక వేటగాడు ఎన్నోసార్లు ప్రయత్నించాడు. అవి దొరికినట్లే దొరికి చిక్కకుండా పారిపోతూనే ఉన్నాయి.

ఆ పచ్చిక బయలు మధ్యలో ఒక సరస్సు ఉంది. ఆ సరస్సు పక్కన చెట్ల మధ్యగా సన్నని దారి ఉంది. ఆ దారికి ఆ చివర లోతైన కందకం ఉంది. అది పచ్చగడ్డి కప్పి ఉండడం వల్ల సరిగ్గా కనిపించదు. దారి తప్పి అటుకేసి పోతే.. ఆ కందకంలో చిక్కుకోవడం ఖాయం. దాని చుట్టూ పన్నిన వలలోంచి బైటకు రావడం అసంభవం. కాబట్టి వేటగాడు ఉపాయం పన్నాడు. పచ్చిక బయలు చుట్టూ వలపన్నాడు. జింకలు ఆ బయలు లోకి రాగానే వలనెత్తాడు. ఆ వలకు ఒకే ఒక్క వైపున దారి తెరిచాడు. అదీ... ఆ కందకం వైపునే. జింకలు పడక తప్పదు అనుకొని, మరో వేట కోసం వెళ్లిపోయాడు.

పొద్దు ఎక్కేవరకు జింకలు మేస్తూనే ఉన్నాయి. కడుపు నిండిన జింకలు పచ్చికబయలు విడిచి చెట్లకిందకు పోవడానికి ప్రయత్నించాయి. కాని ఎటు వెళ్లినా, వల అడ్డు తగలడంతో తిరిగి వెనక్కు వస్తున్నాయి. నెమ్మదిగా వాటిలో అలజడి మొదలైంది. అది గమనించి అక్కడికి వచ్చాడు దాపులో ఒక కుటీరంలో ఉంటున్న ముని. ఆ పరిసరాలు గమనించిన మునికి విషయం అర్థమయ్యింది. అడవి చెట్ల మధ్య అగాథంలోకి మాత్రమే దారి తెరచి ఉందని గ్రహించాడు. అప్పటికే కొన్ని జింకలు అటుగా వెళ్లాయి. అవి ఇంక ఇటుకేసి రానే రావని గ్రహించాడు. వేటగాడు పాతిన వలను పెళ్లగించి దారికి అడ్డుగా కట్టాడు. ఇక మిగిలిన జింకలు అటుకేసి వెళ్లవు. తన కుటీరం వైపు వలను చించి దారి చేశాడు.

జింకలు మెల్లగా ఆ దారిగుండా బైటకు పోసాగాయి. సాయంత్రానికి అన్నీ సురక్షితంగా తమ నివాసాలకి చేరాయి. వేటగాడు సాయంత్రం వచ్చి నెత్తీనోరూ కొట్టుకున్నాడు.

బుద్ధుడు ఈ కథ చెప్పి–

జింకలకు ప్రమాదాన్ని కలిగించడానికి వల పన్నిన వేటగాడే మారుడు. అంటే మన్మథుడు. కోరికలు, తృష్ణ, దురాశ అల్లిన వలలో మన మనస్సు మీదకు విసిరేవాడు. మనల్ని మోహంలో పడవేసి, దాన్నుండి బైట పడడానికి వీలు లేకుండా బంధించి వేస్తాడు. దానితో మనం చెడు కర్మల వైపుకు వెళ్లి దుఃఖం అనే అఖాతంలో పడతాం. అలాగే... దుఃఖానికి కొనిపోయే దారిని మూసి, సురక్షితమైన మార్గానికి దారి చూపిన వాడు ధర్మం తెలిసిన వాడు. బహుజన సుఖాన్ని, బహుజన హితాన్ని కోరుకునేవాడు– అని చెప్పాడు.

మనం అజ్ఞానం వీడితే, ప్రమాదకర మార్గాన్ని మూసేస్తాం. అలా మనల్ని మనమే రక్షించుకుంటాం. అందుకే.. ధర్మం శరణం గచ్ఛామి!

– డా. బొర్రా గోవర్ధన్

శ్రమకు నమస్కారం

గురువాణి




నైతిక విలువలు పతనమయిన జీవితాన్ని గడపడం... అంటే చెప్పేది ఒకటి, చేసేది ఒకటి అవుతుంది. దానికి మూడవది కొనసాగింపుగా మనసు కూడా తోడయితే... దానిని దంభం అంటారు. అంటే మనసులో ఒకటి అనుకుంటాడు. పైకి ఒకటి మాట్లాడతాడు, చేసేది మరొకటి అయి ఉంటుంది. అంటే ఈ మూడూ ఒక సరళరేఖలో ఉండవు. అలా లేకుండా ఉండడమే నైతిక భ్రష్టత్వం.

ఏ పని చేయకుండా సంపద కలిగి ఉండడం ప్రమాదం. మనిషి సంపదను పొంది ఉండడంలో తప్పు లేదు. అనువంశికంగా, పిత్రార్జితంగా పెద్దలనుండి వచ్చిన ఆస్తి కలిగి ఉండడం అంతకన్నా దోషం కాదు. కానీ వాళ్ళు ఈ సంపదను సమకూర్చడానికి ఎంత కష్టపడ్డారో, ఎంత చెమట చిందించారో అర్థం అయితే తప్ప ఆ డబ్బు ఖర్చుపెట్టడానికి యోగ్యత పొందలేదు. కారణం.. డబ్బు సంపాదించేటప్పుడు మనిషి పడే కష్టం అనుభవాన్ని ఇస్తుంది. అది డబ్బును విచ్చలవిడిగా ఖర్చు పెట్టనీయదు. చెమటకు ఉన్న శ్వాస ఏమిటో అర్థం అవుతుంది. అప్పుడు వ్యసనాలకు వశులు కారు. కష్టపడి సంపాదించుకున్న ద్రవ్యం క్రమశిక్షణను నేర్పుతుంది.

నీతి శాస్త్రం ఏమంటుందంటే... మనిషి ఎంత సంపాదించాడనే దానికంటే ఏ మార్గంలో సంపాదించాడన్నది ప్రధానం. ఎంత ఖర్చు పెట్టావు అనేదానికన్నా ఏ ప్రయోజనానికి ఖర్చుపెట్టావన్నది అత్యంత ప్రధానం. ప్రతివారికి ద్రవ్యసముపార్జనలోని కష్టం తెలియాలి... అంటుంది

రఘువంశం కావ్యంలో... పట్టాభిషిక్తుడైన ప్రతి రాజు కూడా వంశపారంపర్యంగా రాజ్యం అందినా... జీవితంలో ఒకసారి దండయాత్రకు వెడతాడు. రాజులందర్నీ గెలిచి వస్తాడు. ఎందుకు... అంటే తనకు పూర్వం ఉన్న రాజులు దండయాత్రలు చేయడానికి, రాజుల్ని గెలవడానికి, చక్రవర్తిత్వాన్ని నిలుపుకోవడానికి ఎంత కష్టపడ్డారో, ఎలా కోశాగారాన్ని నింపగలిగారో, ఎలా మంచిపనులు చేసి కీర్తిమంతులు కాగలిగారో తెలియాలంటే వారు కూడా కష్టపడాలి.. అందుకే ఆ దండయాత్రలు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఒక వ్యక్తి జీవితంలో ఎంతో కష్టపడి సంపాదిస్తే, ఆ ద్రవ్యం ఎంత మంది ఉద్ధరణకో ఉపయోగిస్తాడు తప్ప నిష్కారణంగా దాచుకుందామన్న ఆలోచనను రానీయడు. నీరు, విద్య, ద్రవ్యం నిలబడి ఉండకూడదు. ప్రవహిస్తూ ఉండాలి. అప్పుడే వాటి ప్రయోజనం సిద్ధిస్తుంది. కష్టపడి సంపాదించడంలో గౌరవం ఉంది. అది ఎంతయినా కావచ్చు. అసలు సంపాదించినది ఏదీ లేకపోవచ్చు. అందువల్ల నీతిబద్ధంగా శ్రమించడం ప్రతి వ్యక్తికీ ప్రధానం.

సినిమా

టీఎఫ్‌పీసీ అధ్యక్షునిగా దామోదర్ ప్రసాద్

తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్(టీఎఫ్‌పీసీ)నూతన అధ్యక్షునిగా కేఎల్ దామోదర్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన టీఎఫ్‌పీసీ ఎన్నికల్లో ప్రత్యర్థి పి.కిరణ్‌పై 24 ఓట్ల తేడాతో గెలుపొందారు దామోదర్ ప్రసాద్. ‘ప్రోగ్రెసివ్ ప్రొడ్యూసర్స్ ప్యానెల్’ నుంచి పోటీ చేసిన దామోదర్‌కి 339 ఓట్లు రాగా, ‘ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్యానెల్’ నుంచి బరిలో దిగిన కిరణ్‌కి 315 ఓట్లు వచ్చాయి. ‘టీఎఫ్‌పీసీ’ ఉపాధ్యక్షులుగా ‘ప్రోగ్రెసివ్ ప్రొడ్యూసర్స్ ప్యానెల్’కు చెందిన కె.అశోక్ కుమార్, వై.సుప్రియ, ట్రెజరర్‌గా ‘ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్యానెల్’ నుంచి తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే టీఎఫ్‌పీసీ సెక్రటరీలుగా ‘ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్యానెల్’ కు చెందిన టి.ప్రసన్న కుమార్(397 ఓట్లు), వైవీఎస్ చౌదరి (380 ఓట్లు) విజయం సాధించారు. జాయింట్ సెక్రటరీలుగా ‘ప్రోగ్రెసివ్ ప్రొడ్యూసర్స్ ప్యానెల్’కు చెందిన భరత్ చౌదరి (412 ఓట్లు), స్వతంత్ర అభ్యర్థి నట్టి కుమార్ (247ఓట్లు) గెలుపొందారు.



దామోదర్ ప్రసాద్

ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు..

‘టీఎఫ్‌పీసీ’ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ‘దిల్’రాజు, డీవీవీ దానయ్య, పీవీ రవి కిశోర్, రవిశంకర్ యలమంచిలి, ఎస్.పద్మిని, బి.వేణుగోపాల్, వై. సురేందర్ రెడ్డి, గోపీనాథ్ ఆచంట, ఠాగూర్ మధు, కేశవరావు పల్లి, శ్రీనివాసరావు వజ్జ, అభిషేక్ అగర్వాల్, కృష్ణ తోట, రామకృష్ణ గౌడ్ ప్రతాని, పూసల కిశోర్ ఎన్నికయ్యారు. కాగా ‘టీఎఫ్‌పీసీ’లో దాదాపు 1200 మంది సభ్యులుండగా 678 ఓట్లు పోలయ్యాయి. ఈ నూతన కార్యవర్గం 2025 వరకు కొనసాగుతుంది.

ఇప్పుడు అదే జరిగింది

అందరూ నన్ను వివాదాస్పద వ్యక్తిగా చూస్తారు.. కానీ ఆదివారం జరిగిన ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో (470 ఓట్లు) ఈసీ మెంబర్‌గా నన్ను గెలిపించారు.. ఈ మెజార్టీని బట్టి నన్ను ఎంత ప్రేమిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. కౌన్సిల్‌లో యాక్టివ్ ప్రొడ్యూసర్స్ ఉండాలని నేను కోరుకున్నాను.. ఇప్పుడు అదే జరిగింది. అయితే మేమంతా కలిసి పని చేస్తాం.

–‘దిల్’ రాజు, నిర్మాత

కలిసికట్టుగా పని చేస్తాం

నిర్మాతల మండలి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఇకపై అందరం కలిసికట్టుగా పని చేస్తాం. ప్రొడ్యూసర్ గిల్డ్‌ని కూడా నిర్మాతల మండలిలో కలపాలి. ఇద్దరు చీడ పురుగుల వల్ల వ్యవస్థ చెడిపోయింది.. దాన్ని అందరూ గుర్తించి వాళ్లని ఓడించారు.

– సి.కల్యాణ్, నిర్మాత

బిజీ బిజీ



ప్రభాస్

‘సలార్’, ‘ప్రాజెక్ట్ కె’ వంటి భారీ ప్రాజెక్ట్స్‌తో ఎంతో బిజీగా ఉంటున్నప్పటికీ వీలైనప్పుడల్లా ‘రాజా డీలక్స్’ (అధికారిక ప్రకటన రావాల్సి ఉంది) షూటింగ్‌లో పాల్గొంటున్నారు ప్రభాస్. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్స్ అని టాక్. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ ఈ వారంలో హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్, మాళవిక మోహనన్‌లపై కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారట చిత్రయూనిట్. ఈ షెడ్యూల్ పూర్తి కాగానే మళ్లీ ‘సలార్’ సెట్స్‌లో జాయిన్ అవుతారట ప్రభాస్. కాగా ‘సలార్’ చిత్రం ఈ ఏడాది సెప్టెంబరు 28న, ‘ప్రాజెక్ట్ కె’ వచ్చే ఏడాది జనవరి 12న రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. కాగా ప్రభాస్ నటించిన మైథలాజికల్ ఫిల్మ్ ‘ఆదిపురుష్’ ఈ జూన్ 16న రిలీజ్ కానుంది. అదేవిధంగా ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ‘స్పిరిట్’ మూవీ రూపొందనుంది. ఈ సినిమాల వరుస షూటింగ్‌లు, వాటి తాలూకు ప్రమోషన్స్‌తో ప్రభాస్ ఫుల్ బిజీగా ఉండటం ఖాయంగా కనిపిస్తోంది.



‘కళాతపస్వికి కళాంజలి’ లో హీరో చిరంజీవితో నటీమణులు

విశ్వనాథ్‌గారు ఆ నమ్మకాన్ని ఇచ్చారు - చిరంజీవి

“కె.విశ్వనాథ్‌గారు వృత్తి పరంగా, ప్రవృత్తి పరంగా (నటుడిగా) పరిపూర్ణమైన జీవితం అనుభవించారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకున్నా ఆణిముత్యాల్లాంటి సినిమాల ద్వారా శాశ్వతంగా మన మనసుల్లో ఉంటారు’’ అని హీరో చిరంజీవి అన్నారు. ఫిబ్రవరి 19న(ఆదివారం) కె.విశ్వనాథ్ జయంతి. ఈ సందర్భంగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూఛిబొట్ల ఆధ్వర్యంలో ‘కళాతపస్వికి కళాంజలి’ కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి మాట్లాడుతూ–‘‘కె.విశ్వనాథ్‌గారి జయంతిని మనం ఒక సంబరంలా జరుపుకోవాలి. ఆయన వదిలి వెళ్లిన కీర్తి, తీపి జ్ఞాపకాలు మనకు మిగిలిన గొప్ప అనుభవాలు.. జీవితాంతం మనం గుర్తుకు తెచ్చుకుని సంతోషించే ఆయన గుర్తులు. మూడు సినిమాల్లో నాకు అద్భుతమైన పాత్రలు ఇచ్చి, నాకు అవార్డులు తీసుకొచ్చిన నటనను నా నుంచి రాబట్టిన దర్శకుడాయన. నటనలో మెళకువలు చెబుతూ, హావభావాలు ఎలా పలికించాలో గురువులా నేర్పించారు. షూటింగ్ చేస్తున్నప్పుడు నన్ను ఒక నటుడిలాగా కాకుండా ఓ బిడ్డలాగా ఆయనతో పాటు కూర్చోబెట్టుకునేవారు. కంచిలో ఓ సినిమా షూటింగ్ చేస్తున్నప్పుడు ఆయన పెరుగు అన్నం కలిపించి నాకు పంపించినప్పుడు తినకుండా ఎలా కాదనగలను? ఆ సమయంలో ఓ తండ్రిలాగా అనిపించారాయన. యాక్షన్ హీరోగా నిలదొక్కుకుంటున్న సమయంలో ఆయనతో తొలిసారి ‘శుభలేఖ’ చేసే అవకాశం వచ్చింది. ఆయన చాలా స్ట్రిక్ట్‌గా ఉంటారని తెలియడంతో కొంచెం టెన్షన్‌గా ఉండేది. డైలాగులు ఫాస్ట్‌గా కాదు.. అర్థమయ్యేలా కరెక్ట్‌గా పలకాలని చెప్పారాయన. ఆయన ఓ అద్భుతమైన నటుడు.. మన నుంచి ఒరిజినాలిటీని రాబట్టుకుంటారు. నేను కూడా క్లాసికల్ డ్యాన్స్ చేయగలను అనే నమ్మకాన్ని ఇచ్చింది విశ్వనాథ్‌గారు. నేను మాస్ హీరోగా దూసుకెళుతున్న సమయంలో ‘స్వయం కృషి’ లాంటి మంచి సందేశాత్మక చిత్రం చేయించారాయన. ‘ఆపద్బాంధవుడు’ చిత్రంలో ఓ సీన్ కోసం ఆయనవద్దకు వెళ్లి రాత్రి రిహార్సల్స్ చేశాను.. మరుసటి రోజు ఆ సన్నివేశం అద్భుతంగా వచ్చింది. ఎమోషన్స్‌ని అద్భుతంగా తీయగలరు విశ్వనాథ్‌గారు. ఆయన వద్ద నేను నేర్చుకున్న అంశాలను నాతో పనిచేస్తున్న దర్శకులకు చెబుతుంటాను. విశ్వనాథ్‌గారి వద్ద పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం’’ అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ–‘‘యువహీరో తారకరత్న పరమదించడం బాధగా ఉంది’’ అన్నారు. ‘కళాతపస్వికి కళాంజలి’ లో కె.విశ్వనాథ్‌తో పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఆయనతో తమకున్న అనుబంధాలను వారు పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో కె.విశ్వనాథ్ పెద్దబ్బాయి కె.నాగేంద్ర నాథ్, ఆర్.నారాయణ మూర్తి, కె.రాఘవేంద్ర రావు, రమేశ్ ప్రసాద్, కేఎస్ రామారావు, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, మాజీ ఎంపీ ‘కళాబంధు’ టి.సుబ్బరామి రెడ్డి, ‘శంకరాభరణం’ ఝాన్సీ, మంజు భార్గవి, శివలెంక కృష్ణప్రసాద్, మురళీ మోహన్, సి.అశ్వినీదత్, దామోదర్ ప్రసాద్, సుమలత, రాజశేఖర్, అలీ, భానుచందర్, శేఖర్ కమ్ముల తదితరులు పాల్గొన్నారు.



విజయ్ దేవరకొండ, సమంత

ఖుషీ ఖుషీగా..

‘ఖుషి’ సినిమా మార్చిలో మళ్లీ షురూ కానుంది. విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వంలో ‘ఖుషి’ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా మయోసైటీస్ వ్యాధి కారణంగా సమంత షూటింగ్స్‌కి కొంచెం విరామం ఇవ్వడంతో ‘ఖుషి’ చిత్రీకరణ ఆలస్యం అవుతోంది. ఈ వ్యాధి నుంచి కోలుకుంటున్న సమంత ఇటీవల ముంబైలో జరిగిన హిందీ వెబ్‌సిరీస్ ‘సిటాడెల్’ షూటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో త్వరలో ‘ఖుషి’ సినిమా షూటింగ్‌ను కూడా షురూ చేయనున్నారామె. మార్చి మొదటి వారంలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ తిరిగి ప్రారంభమవుతుందట. ఈ షెడ్యూల్‌లో విజయ్, సమంతలు పాల్గొంటారని టాక్. ఈ సంగతి ఇలా ఉంచితే ‘ఖుషి’ ని గత ఏడాది డిసెంబరు 23న రిలీజ్ చేయాలనుకున్నారు.. షూటింగ్ ఆలస్యం కావడంతో ఈ ఏడాది రిలీజ్ కానుంది.



హృతిక్ రోషన్

వార్ సీక్వెల్‌కి రెడీ

హీరో హృతిక్ రోషన్, దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో వచ్చిన ‘బ్యాంగ్ బ్యాంగ్’ (2014), ‘వార్’ (2019) చిత్రాలు సూపర్ హిట్టయ్యాయి. ప్రస్తుతం వీరి కాంబినేషన్‌లోనే ‘ఫైటర్’ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని 2024 జనవరి 25న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. అయితే ‘వార్’ సినిమాకు సీక్వెల్‌గా రానున్న ‘వార్ 2’ ప్రస్తావన బాలీవుడ్‌లో మరోసారి తెరపైకి వచ్చింది. ‘వార్’ చిత్ర నిర్మాత ఆదిత్యా చోప్రా ‘వార్ 2’ ని వీలైనంత త్వరగా సెట్స్‌పైకి తీసుకువెళ్లాలనుకుంటున్నారట. దీంతో ‘ఫైటర్’ తర్వాత హృతిక్ రోషన్ చేయబోయేది ‘వార్ 2’ అని, ఈ ఏడాది చివర్లో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందని టాక్. ఈ సినిమా షూటింగ్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాతే ‘క్రిష్ 4’పై హృతిక్ ఫోకస్ పెడతారని బాలీవుడ్ టాక్. అయితే ‘వార్’ ని తెరకెక్కించిన సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలోనే ‘వార్ 2’ వస్తుందా? రాదా? అనే విషయంపై త్వరలో ఓ స్పష్టత రానుందని బాలీవుడ్‌లో వినికిడి.



కృతీశెట్టి

శర్వానంద్

కొత్త జోడీ!

హీరో శర్వానంద్‌కి జోడీగా హీరోయిన్ కృతీశెట్టి నటిస్తున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. గత సెప్టెంబరులో విడుదలైన ‘ఒకే ఒక జీవితం’ (తమిళంలో ‘కణం’) సినిమా సక్సెస్ తర్వాత దర్శకుడు కృష్ణచైతన్యతో మూవీ చేయనున్నట్లు ప్రకటించారు శర్వానంద్. అయితే ఆ చిత్రాన్ని ప్రస్తుతం హోల్డ్‌లో ఉంచారట శర్వానంద్. దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య చెప్పిన కథ నచ్చడంతో వెంటనే సినిమాను స్టార్ట్ చేశారట. ఇందులో కృతీశెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారని, ఆల్రెడీ షూటింగ్ కూడా హైదరాబాద్‌లో జరుగుతోందని టాక్. శర్వా–కృతి తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ఈ సినిమాను నిర్మిస్తున్నారని తెలిసింది.

రెంచ్ రాజుగా కార్తీ?

హీరో కార్తీ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపుదిద్దుకోనుందని టాలీవుడ్ టాక్. ‘ఊపిరి’ (2016) సినిమా తర్వాత తెలుగులో ఓ స్ట్రయిట్ ఫిల్మ్ చేయాలని ఆసక్తిగా ఉన్నారు కార్తీ. ఇందుకోసం కథలు కూడా వింటున్నారు. ఈ ప్రక్రియలో భాగంగానే పరశురామ్ చెప్పిన ఓ కథకు ఇంప్రెస్ అయ్యారట కార్తీ. దీంతో వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ సినిమా రానుందని, కథ పరంగా ఈ మూవీకి ‘రెంచ్ రాజు’ అనే టైటిల్ అనుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. కాగా ‘గీతగోవిందం’ తర్వాత విజయ్ దేవరకొండ తర్వాత మరో సినిమాకు కమిటయ్యారు పరశురామ్. అయితే ఆయన ఏ హీరోతో ముందుగా సినిమా చేస్తారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.



కార్తీ



భారత షూటర్ వరుణ్‌కు కాంస్యం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్ కాంస్య పతకంతో బోణీ చేసింది. ఈజిప్ట్ రాజధాని కైరోలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో 19 ఏళ్ల వరుణ్ తోమర్ మూడో స్థానంలో నిలిచాడు. ఆదివారం జరిగిన ర్యాంకింగ్ రౌండ్‌లో నిర్ణీత ఐదు సిరీస్‌ల తర్వాత వరుణ్, సరబ్‌జ్యోత్ సింగ్ 250.6 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. 'షూట్ ఆఫ్ షాట్'లో వరుణ్ 10.3 పాయింట్లు స్కోరు చేసి కాంస్యం దక్కించుకోగా... సరబ్‌జ్యోత్ 10.1 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు.

రన్నరప్ బోపన్న జోడీ

కెరీర్‌లో 23వ డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్నకు నిరాశ ఎదురైంది. ఏబీఎన్ అమ్రో ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ రన్నరప్‌గా నిలిచింది. నెదర్లాండ్స్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-7 (5/7), 6-2, 10-12తో ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా)-ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా) జోడీ చేతిలో ఓడింది. బోపన్న-ఎబ్డెన్‌లకు 67,960 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 56 లక్షల 24 వేలు) లభించింది.



'జడ్డూ' తిప్పేశాడు...

మూడో రోజు కూడా స్పిన్ తిరిగింది. అయితే ఆ మలుపు మనదే... గెలుపు మనదే. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ అంతా కంగారు కంగారే! రవీంద్ర జడేజా స్పిన్ మ్యాజిక్‌కు తోడు వారి చెత్త షాట్లు ఆసీస్‌ను నిలువునా కూల్చింది. అనుభవజ్ఞుడైన స్టీవ్ స్మిత్ సహా ఎవరూ క్రీజులో నిలిచే సాహసమే చేయలేకపోవడంతో భారత్ ఈ టెస్టునూ మూడు రోజుల్లోనే ముగించింది. 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'ని పదిలంగా నిలబెట్టుకుంది.

- 7 వికెట్లతో మెరిసిన రవీంద్ర జడేజా
- రెండో టెస్టులోనూ ఆసీస్ చిత్తు
- టీమిండియా 6 వికెట్లతో జయభేరి
- మన వద్దే 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'
- మార్చి 1 నుంచి ఇండోర్‌లో మూడో టెస్టు

న్యూఢిల్లీ: భారత్‌కు అచ్చొచ్చిన ఢిల్లీ వికెట్‌పై పర్యాటక జట్టే స్పిన్‌తో అల్లాడిస్తే... ఆతిథ్య జట్టు అంతకుమించే చేయాలి కదా! సరిగ్గా... టీమిండియా కూడా అదే చేసింది. ఒక్క సెషన్ అయినా పూర్తిగా ఆడనివ్వకుండానే ఆస్ట్రేలియాను ఆలౌట్ చేసింది. రవీంద్ర జడేజా (7/42) బిగించిన ఉచ్చులో ఆస్ట్రేలియా క్లీన్‌బౌల్డయింది. 31.1 ఓవర్లలోనే 113 పరుగులకే ఆ జట్టు కుప్పకూలింది. ఇందులో 12 ఓవర్లు, 61 పరుగులు క్రితం రోజువే కాగా... మూడో రోజు ఆసీస్ ఆడింది 19.1 ఓవర్లే! చేసింది కూడా 52 పరుగులే! అంటే సగటున ప్రతి రెండు ఓవర్లకు ఓ వికెట్‌ను సమర్పించుకుంది. అంతలా ప్రపంచ నంబర్‌వన్ టెస్టు జట్టు జడుసుకుంది. 'జడ్డూ' ఏకంగా ఐదుగురు బ్యాటర్లను బౌల్డ్ చేశాడు. అనంతరం 115 పరుగుల సులువైన లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 26.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసి గెలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో రెండు జట్ల బౌలర్లు ఎక్స్‌ట్రాలు ఇవ్వకపోవడం విశేషం. మ్యాచ్ మొత్తం లో పది వికెట్లు తీయడంతోపాటు కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన జడేజాకు వరుసగా రెండోసారి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. నాలుగు టెస్టుల సిరీస్‌లో 2-0తో ఉన్న భారత్ 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'ని తమ వద్దే అట్టిపెటుకుంది. క్రితంసారి కూడా భారతే గెలిచింది. ఇక ఈ సిరీస్‌లో మూడో టెస్టు మార్చి 1 నుంచి ఇండోర్‌లో జరుగుతుంది. ఇండోర్ టెస్టులోనూ భారత్ గెలిస్తే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా అర్హత సాధిస్తుంది.

ఇలా మొదలై... అలా కూలింది!

ఓవర్‌నైట్ స్కోరు 61/1తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా పతనం తొలి ఓవర్ నుంచే మొదలైంది. ఓపెనర్ హెడ్ (46 బంతుల్లో 43; 6 ఫోర్లు, 1 సిక్స్) అశ్విన్ బౌలింగ్‌లో ఒక బౌండరీ కొట్టి ఆఖరి బంతికి అవుటయ్యాడు. కాసేపటికే సీనియర్ బ్యాటర్ స్మిత్ (19 బంతుల్లో 9; 1 ఫోర్) కూడా అతని బౌలింగ్‌లోనే వికెట్ల ముందు దొరికాడు. తర్వాత జడేజా మాయాజాలం మొదలవడంతో కొత్తగా ఇంకెవరూ రెండంకెల స్కోరు చేయలేకపోయారు. ఓవర్‌నైట్ బ్యాటర్ లబుషేన్ (50 బంతుల్లో 35; 5 ఫోర్లు) సహా స్వల్ప వ్యవధిలో క్యారీ (7), కమిన్స్ (0), లయన్ (8), కున్‌మన్ (0)లను జడేజా క్లీన్‌బౌల్డ్ చేశాడు. కచ్చితత్వం లేని స్వీప్ షాట్లు, అనవసరమైన రివర్స్ స్వీప్ షాట్లు ఆస్ట్రేలియన్ల కొంపముంచాయి. ప్రపంచంలో ఎక్కడైనా పేస్ బంతులు బ్యాటర్లను బెంబేలెత్తిస్తాయి. కానీ ఇక్కడ స్లో డెలివరీలకే విలవిలలాడారు. దీంతో ఆదివారం ఆటలో 9 వికెట్లు చేతిలో ఉన్న ఆసీస్ కనీసం 20 ఓవర్లయినా ఆడలేకపోయింది. అశ్విన్‌కు 3 వికెట్లు దక్కాయి. స్పిన్ తిరగడంతో భారత ప్రధాన సీమర్ మొహమ్మద్ సిరాజ్‌కు బంతిని అప్పగించాల్సిన అవసరమే రాలేదు. లంచ్ బ్రేక్ అనంతరం సులువైన లక్ష్యఛేదనలో కెప్టెన్ రోహిత్ శర్మ (20 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) ధనాధన్ ఆడాడు. కానీ కేఎల్ రాహుల్ (1) తన వైఫల్యం కొనసాగించాడు. 100వ టెస్టు ఆడుతున్న పుజారా (74 బంతుల్లో 31 నాటౌట్; 4 ఫోర్లు) కుదురుగా ఆడగా, మధ్యలో విరాట్ కోహ్లి (31 బంతుల్లో 20; 3 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (12)ల వికెట్లు కూలాయి. అప్పటికే టీమిండియా విజయతీరానికి దగ్గరవగా మిగతా లాంఛనాన్ని కోన శ్రీకర్ భరత్ (22 బంతుల్లో 23 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి పుజారా పూర్తి చేశాడు. 27వ ఓవర్ వేసిన మర్ఫీ బౌలింగ్‌లో నాలుగో బంతిని పుజారా మిడ్ వికెట్ మీదుగా బౌండరీకి తరలించి భారత్‌ను గెలిపించాడు.



సిరాజ్, కోహ్లి, భరత్, జడేజా, అక్షర్ పటేల్



100 అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్‌లలో కలిపి ఆస్ట్రేలియాపై భారత్‌కిది 100వ విజయం. మూడు ఫార్మాట్‌లలో రెండు జట్ల మధ్య 273 మ్యాచ్‌లు జరిగాయి. ఆసీస్‌తో 104 టెస్టులు ఆడిన భారత్ 32 విజయాలు అందుకొని, 43 పరాజయాలు చవిచూసింది. ఒక మ్యాచ్ 'టై'కాగా, 28 'డ్రా'గా ముగిశాయి. 143 వన్డేల్లో టీమిండియా 53 మ్యాచ్‌ల్లో గెలిచి, 80 మ్యాచ్‌ల్లో ఓడింది. 10 మ్యాచ్‌లు రద్దయ్యాయి. 26 టి20 మ్యాచ్‌ల్లో భారత్ 15 విజయాలు సాధించి, 10 మ్యాచ్‌ల్లో ఓడింది. ఒక మ్యాచ్ రద్దయింది.

25,012 అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్ (టెస్టు, వన్డే, టి20)లలో కలిపి కోహ్లి సాధించిన పరుగులు (492 మ్యాచ్‌లు). సచిన్ (664 మ్యాచ్‌ల్లో 34, 357 పరుగులు) తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయ క్రికెటర్ కోహ్లి కాగా... 25 వేల పరుగులు సాధించిన క్రికెటర్ల జాబితా లో కోహ్లి ఆరో స్థానంలో ఉన్నాడు.

8 సొంతగడ్డపై టెస్టుల్లో జడేజాకిది ఎనిమిదో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు. భారత్ తరఫున అనిల్ కుంబ్లే (9 సార్లు) 'టాప్'లో ఉండగా, సచిన్ (8 సార్లు) సరసన జడేజా నిలిచాడు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 263; భారత్ తొలి ఇన్నింగ్స్: 262; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఉస్మాన్ ఖాజా (సి) శ్రేయస్ అయ్యర్ (బి) జడేజా 6; ట్రవిస్ హెడ్ (సి) శ్రీకర్ భరత్ (బి) అశ్విన్ 43; లబుషేన్ (బి) జడేజా 35; స్మిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 9; రెన్‌షా (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 2; హ్యాండ్స్‌కాంబ్ (సి) కోహ్లి (బి) జడేజా 0; క్యారీ (బి) జడేజా 7; కమిన్స్ (బి) జడేజా 0; లయన్ (బి) జడేజా 8; మర్ఫీ (నాటౌట్) 3; కున్‌మన్ (బి) రవీంద్ర జడేజా 0; **మొత్తం** (31.1 ఓవర్లలో ఆలౌట్) 113. **వికెట్ల పతనం:** 1-23, 2-65, 3-85, 4-95, 5-95, 6-95, 7-95, 8-110, 9-113, 10-113. **బౌలింగ్:** అశ్విన్ 16-3-59-3, మొహమ్మద్ షమీ 2-0-10-0, రవీంద్ర జడేజా 12.1-1-42-7, అక్షర్ పటేల్ 1-0-2-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (రనౌట్) 31; కేఎల్ రాహుల్ (సి) అలెక్స్ క్యారీ (బి) లయన్ 1; చతేశ్వర్ పుజారా (నాటౌట్) 31; విరాట్ కోహ్లి (స్టంప్డ్) క్యారీ (బి) మర్ఫీ 20; శ్రేయస్ అయ్యర్ (సి) మర్ఫీ (బి) నాథన్ లయన్ 12; శ్రీకర్ భరత్ (నాటౌట్) 23; **మొత్తం** (26.4 ఓవర్లలో 4 వికెట్లకు) 118. **వికెట్ల పతనం:** 1-6, 2-39, 3-69, 4-88. **బౌలింగ్:** కున్‌మన్ 7-0-38-0, నాథన్ లయన్ 12-3-49-2, టాడ్ మర్ఫీ 6.4-2-22-1, ట్రవిస్ హెడ్ 1-0-9-0.

సౌరాష్ట్ర జట్టుదే రంజీ ట్రోఫీ టైటిల్



కోల్‌కతా: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన సౌరాష్ట్ర జట్టు రెండోసారి రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలిచింది. బెంగాల్‌తో ఆదివారం ముగిసిన ఫైనల్లో జైదేవ్ ఉనాద్కట్ నాయకత్వంలోని సౌరాష్ట్ర తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపొందింది. ఓవర్‌నైట్ స్కోరు 169/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్ 241 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ ఆరు వికెట్లు తీయగా... మరో పేసర్ చేతన్ సకారియా మూడు వికెట్లు పడగొట్టాడు. బెంగాల్ నిర్దేశించిన 12 పరుగుల లక్ష్యాన్ని సౌరాష్ట్ర ఒక వికెట్ నష్టపోయి ఛేదించింది. మ్యాచ్ మొత్తంలో పది వికెట్లు తీసిన ఉనాద్కట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' అవార్డురాగా... టోర్నీ మొత్తంలో 907 పరుగులు సాధించిన అర్పిత్ (సౌరాష్ట్ర) 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు దక్కించుకున్నాడు. 2020లో బెంగాల్ జట్టునే ఓడించి సౌరాష్ట్ర తొలిసారి రంజీ చాంపియన్‌గా నిలిచింది. 1990లో చివరిసారి రంజీ ట్రోఫీ టైటిల్ నెగ్గిన బెంగాల్ ఆ తర్వాత ఐదుసార్లు ఫైనల్ చేరగా... ఐదుసార్లూ ఓడిపోయి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది.

ఇంగ్లండ్ భారీ విజయం

మౌంట్ మాంగనుయ్: పేస్ బౌలర్లు అండర్సన్ (4/18), స్టువర్ట్ బ్రాడ్ (4/49) న్యూజిలాండ్‌ను హడలెత్తించడంతో... తొలి టెస్టులో ఇంగ్లండ్ 267 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. 394 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 45.3 ఓవర్లలో 126 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది.



దాంతో 2008 తర్వాత న్యూజిలాండ్ గడ్డపై ఇంగ్లండ్‌కు టెస్టు విజయం దక్కింది. ఓవర్‌నైట్ స్కోరు 63/5తో ఆదివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ మరో 63 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయింది.

జైదేవ్ ఉనాద్కట్‌కు పిలుపు

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో వచ్చే నెలలో (17, 19, 22న) జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును ఆదివారం బీసీసీఐ ప్రకటించింది. గత డిసెంబర్‌లో జరిగిన దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో 19 వికెట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచిన సౌరాష్ట్ర జట్టు కెప్టెన్, ఎడంచేతి వాటం పేసర్ జైదేవ్ ఉనాద్కట్‌కు జాతీయ జట్టులోకి పిలుపు వచ్చింది. 31 ఏళ్ల ఉనాద్కట్ 2013లో చివరిసారి భారత్ తరఫున వన్డే ఆడాడు. గత నెలలో స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్ కోసం జట్టులో ఎంపికైన శ్రీకర్ భరత్, రజత్ పాటిదార్, షహబాజ్ అహ్మద్‌లను ఆస్ట్రేలియాతో సిరీస్ కోసం ఎంపిక చేయలేదు. ఈ ముగ్గురి స్థానాల్లో జడేజా, అక్షర్ పటేల్, ఉనాద్కట్ జట్టులోకి వచ్చారు. వ్యక్తిగత కారణాలరీత్యా తొలి వన్డేకు రోహిత్ శర్మ అందుబాటులో ఉండటం లేదని, దాంతో తొలి వన్డేలో రోహిత్ స్థానంలో హార్దిక్ పాండ్యా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

మార్పుల్లేని టెస్టు జట్టు

ఆస్ట్రేలియాతో జరిగే తదుపరి రెండు టెస్టుల్లో పాల్గొనే భారత జట్టులో ఎలాంటి మార్పులు చోటు చేసుకోలేదు. తొలి రెండు టెస్టుల్లో బరిలోకి దిగిన జట్టునే కొనసాగించనున్నారు.

భారత వన్డే జట్టు: రోహిత్ (కెప్టెన్), హార్దిక్ (వైస్ కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, సూర్యకుమార్ ,రాహుల్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), జడేజా, కుల్దీప్, సుందర్, చహల్, షమీ, సిరాజ్, ఉమ్రాన్, శార్దుల్ , అక్షర్, ఉనాద్కట్.

నేడు ఐర్లాండ్‌తో భారత్ పోరు

సా. గం. 6:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో



కెబేహ (దక్షిణాఫ్రికా): మహిళల టి20 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీలో భారత్ తమ గ్రూప్-2 చివరి లీగ్ మ్యాచ్‌లో నేడు ఐర్లాండ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని టీమిండియా గెలిస్తే ఆరు పాయింట్లతో నేరుగా సెమీఫైనల్ చేరుకుంటుంది. ఒకవేళ ఓడిపోతే మాత్రం మంగళవారం పాకిస్తాన్-ఇంగ్లండ్ జట్ల మధ్య మ్యాచ్ ఫలితంపై భారత జట్టు సెమీఫైనల్ అవకాశాలు ఆధారపడి ఉంటాయి. గ్రూప్-2లో ప్రస్తుతం ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న ఇంగ్లండ్‌కు ఇప్పటికే సెమీస్ బెర్త్ ఖరారైంది.

విద్య, ఉద్యోగ సమాచారం

గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీప్యాట్)-2023

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించే గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీప్యాట్)-2023 నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో మంచి ర్యాంక్ పొందిన అభ్యర్థులకు దేశంలోని ప్రముఖ ఫార్మసీ కళాశాలల్లో తమకు నచ్చిన స్పెషలైజేషన్‌లో ఫార్మసీ పీజీ చదువుకోవడానికి వీలవుతుంది. దేశంలో దాదాపు 870ఫార్మసీ కళాశాలల్లో ఎంఫార్మసీలో ప్రవేశానికి జీప్యాట్ స్కోరు ఉపయోగపడుతుంది.

- **అర్హత:** ఇంటర్మీడియట్ తర్వాత ఫార్మసీలో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ/తత్సమాన ఉత్తీర్ణుల వ్వాలి. బీఫార్మసీ పరీక్షా ఫలితాలు వెలువడిన చివరి సంవత్సరం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీటెక్(ఫార్మాస్యూటికల్ అండ్ ఫైన్ కెమికల్ టెక్నాలజీ)/తత్సమాన అభ్యర్థులు దీనికి అర్హులు కాదు. **వయసు:** జీప్యాట్-2023 దరఖాస్తుకు వయసుతో సంబంధం లేదు.
- **పరీక్ష విధానం:** ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలోనే ఉంటుంది. పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ప్రశ్నలు మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో అడుగుతారు. మొత్తం 500 మార్కులకు-125 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు చొప్పున తగ్గిస్తారు. పరీక్ష వ్యవధి 3 గంటలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.03.2023.
- **వెబ్‌సైట్:** gpat.nta.nic.in

కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (సీమ్యాట్)-2023

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించే కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(సీమ్యాట్) ప్రకటన వెలువడింది. ఇందులో వచ్చిన స్కోరుతో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా వెయ్యి సంస్థల్లో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

- **అర్హత:** ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ప్రస్తుతం ఆఖరు సంవత్సరం కోర్సులు చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. **వయసు:** దరఖాస్తుకు వయసుతో సంబంధం లేదు.
- **పరీక్ష విధానం:** సీమ్యాట్‌లో 400 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు 4మార్కులు ఉంటుంది. ఆన్‌లైన్ పరీక్ష కాల వ్యవధి 3 గంటలు. నెగిటివ్ మార్కులు ఉంటాయి. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి ఒక్కో మార్కు చొప్పున తగ్గిస్తారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.03.2023
- **వెబ్‌సైట్:** cmat.nta.nic.in

ఒక్క పరీక్షతో.. 44 సెంట్రల్ వర్సిటీల్లో ప్రవేశం!

ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థుల్లో ఎక్కువ మంది ఇంజనీరింగ్, మెడిసిన్ వైపు మొగ్గుచూపుతున్నారు. మరోవైపు నేటికీ లక్షల మంది విద్యార్థులు సంప్రదాయ డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నారు. అయితే ఈ డిగ్రీని ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో పూర్తి చేసుకోవాలని ఆశిస్తున్నారు. అలాంటి వారికి చక్కటి మార్గంగా నిలుస్తోంది.. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ-యూజీ). ఇందులో మెరుగైన స్కోర్ సాధిస్తే.. ప్రసిద్ధ 44 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు ఖరారు చేసుకోవచ్చు. ఇటీవల సీయూఈటీ-యూజీ-2023కి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. సీయూఈటీ-యూజీతో ప్రయోజనాలు, పరీక్ష విధానం, ఈ ఎంట్రన్స్‌లో బెస్ట్ స్కోర్ సాధించేందుకు మార్గాలు..

- సీయూఈటీ-యూజీ-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
- కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో యూజీ ప్రవేశాలకు ఉమ్మడి పరీక్ష
- మే 21 నుంచి 31 వరకు ఆన్‌లైన్ విధానంలో ఎంట్రన్స్
- అకడమిక్ నైపుణ్యాలతో మెరుగైన స్కోర్

సెంట్రల్ యూనివర్సిటీలు..జాతీయ స్థాయిలో పేరు గడించిన విద్యా సంస్థలు. వీటిలో ప్రవేశం కోసం గతంలో విద్యార్థులు ఒక్కో యూనివర్సిటీకి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. ఆయా యూనివర్సిటీ ప్రత్యేకంగా నిర్వహించే ఎంట్రన్స్‌కు హాజరుకావల్సి వచ్చేది. దీంతో ఆర్థిక భారం, సమయాభావం వంటి సమస్యలు ఎదురయ్యేవి. దీనికి పరిష్కారంగా జాతీయ స్థాయిలో అన్ని సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాల కోసం ఉమ్మడి పరీక్ష నిర్వహించాలనే ఉద్దేశంతో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ యూజీ)కి శ్రీకారం చుట్టారు. ఈ ఒక్క పరీక్షలో మెరిట్ ఆధారంగా.. దేశవ్యాప్తంగా ఉన్న 44 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశం ఖరారు చేసుకోవచ్చు.

పదమూడు భాషల్లో పరీక్ష

సీయూఈటీ-యూజీ పరీక్షను మొత్తం పదమూడు భాషల్లో నిర్వహిస్తున్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మళయాళం, మరాఠి, ఒడియా, పంజాబీ, తమిళం, ఉర్దూల్లో ఈ పరీక్షకు హాజరుకావచ్చు.

మూడు సెక్షన్లుగా.. సీయూఈటీ-యూజీ

సీయూఈటీ-యూజీ పరీక్షను మొత్తం మూడు సెక్షన్లుగా పరీక్ష నిర్వహించనున్నారు. ఆ వివరాలు..

సెక్షన్	సబ్జెక్ట్ అంశాలు	ప్రశ్నల సంఖ్య
సెక్షన్-1ఎ (లాంగ్వేజెస్)	13 లాంగ్వేజెస్	50
సెక్షన్-1బి (లాంగ్వేజెస్)	20 లాంగ్వేజెస్	50
సెక్షన్-2 (డొమైన్ సబ్జెక్ట్స్)	27 డొమైన్ సబ్జెక్టులు	45/50
సెక్షన్-3 జనరల్ టెస్ట్	జీకే, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్	60



సీయూఈటీ-యూజీ 2023

- సెక్షన్-1ఎలో అభ్యర్థులు 13 భాషల్లో ఏదో ఒక భాషను ఎంచుకోవచ్చు.
- సెక్షన్-1బిలో అభ్యర్థులు 20 భాషల్లో ఏదో ఒక భాషను ఎంచుకోవచ్చు.
- సెక్షన్-2 డొమైన్ సబ్జెక్ట్స్ విభాగంలో.. మొత్తం 27 డొమైన్ సబ్జెక్ట్స్ అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్ట్‌ను ఎంచుకోవచ్చు.
- సెక్షన్-2లో 45 లేదా 50 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో చాయిస్ విధానం మేరకు అభ్యర్థులు 35 లేదా 40 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.
- మొత్తం 3 సెక్షన్లలో అభ్యర్థులు గరిష్ఠంగా పది సబ్జెక్ట్‌లను ఎంచుకునే అవకాశం కల్పించారు.
- సెక్షన్-1ఎ, సెక్షన్-1బి లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లకు సంబంధించి ఎన్‌టీఏ నిర్దేశిత జాబితాలోని లాంగ్వేజ్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది. -ప్రతి ప్రశ్నకు 5 మార్కులు కేటాయిస్తారు.
- నెగెటివ్ మార్కింగ్ నిబంధన మేరకు ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు.
- సెక్షన్-1ఎ లాంగ్వేజెస్ వివరాలు: అస్సామీ, ఇంగ్లిష్, హిందీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మళయాళం, మరాఠి, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ.

సెక్షన్-1బి లాంగ్వేజెస్ వివరాలు

అరబిక్, బోడో, చైనీస్, డోగ్రి, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, జపనీస్, కశ్మీరి, కొంకణి, మైథిలి, మణిపురి, నేపాలి, పర్షియన్, రష్యన్, సింధి, స్పానిష్, టిబెటిన్, సంస్కృతం.

డొమైన్ సబ్జెక్ట్‌ల వివరాలు

- మొత్తం 27 డొమైన్ సబ్జెక్ట్‌లు అందుబాటులో ఉన్న నేపథ్యంలో వాటి వివరాలు..
- అకౌంటెన్సీ/బుక్ కీపింగ్; అగ్రికల్చర్; ఆంత్రోపాలజీ; బయాలజీ/బయోలాజికల్ స్టడీస్/బయోటెక్/బయో కెమిస్ట్రీ; బిజినెస్ స్టడీస్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్; ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్; ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్; ఫైన్ ఆర్ట్స్/విజువల్ ఆర్ట్స్/కమర్షియల్ ఆర్ట్; జాగ్రఫీ/జియాలజీ; హిస్టరీ; హోమ్‌సైన్స్; నాలెడ్జ్ ట్రెడిషన్ ప్రాక్టీసెస్ ఇండియా; లీగల్ స్టడీస్; మాస్ మీడియా/మాస్ కమ్యూనికేషన్; మ్యాథమెటిక్స్; పెర్ఫార్మింగ్ ఆర్ట్స్; ఫిజికల్ ఎడ్యుకేషన్/ఎన్‌సీసీ/యోగా; ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్; సైకాలజీ; సంస్కృతం; టీచింగ్ ఆప్టిట్యూడ్.
- ఈ సబ్జెక్ట్‌లలో అభ్యర్థులు తమ అర్హతకు సరితూగే సబ్జెక్ట్‌లను ఎంచుకోవచ్చు. డొమైన్ సబ్జెక్ట్స్‌లో గరిష్ఠంగా ఆరింటిని ఎంచుకునే అవకాశం ఉంది.

లాంగ్వేజ్, డొమైన్ అంశాల్లో

జాతీయ స్థాయిలో నిర్వహించే సీయూఈటీ-యూజీ పరీక్ష తీరును పరిశీలిస్తే.. అభ్యర్థుల్లోని లాంగ్వేజ్ స్కిల్స్, అదే విధంగా విద్యార్థులు బ్యాచిలర్ డిగ్రీలో చేరాలనుకుంటున్న సబ్జెక్ట్‌పై ఉన్న అవగాహనను పరీక్షించేలా పరీక్ష నిర్వహిస్తారు.

మూడు షిఫ్ట్‌లలో పరీక్ష

మే 21 నుంచి మే 31 వరకు పది రోజుల పాటు సీయూఈటీని నిర్వహించనున్నారు. ప్రతి రోజు మూడు షిఫ్ట్‌లలో పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న సబ్జెక్ట్‌ల ఆధారంగా.. ఆయా సబ్జెక్ట్‌లకు నిర్దేశించిన షిఫ్ట్‌లలో పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది. దరఖాస్తు సమయంలోనే తాము హాజరవ్వాలనుకుంటున్న షిఫ్ట్ వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది.

స్కోర్ ఆధారంగా ప్రవేశం

సీయూఈటీ-యూజీలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు.. ఆ స్కోర్ ఆధారంగా సెంట్రల్ యూనివర్సిటీలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మలి దశలో ప్రతి సెంట్రల్ యూనివర్సిటీ కూడా ప్రత్యేక ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తుంది. అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించిన తర్వాత.. సెంట్రల్ యూనివర్సిటీలు అందుబాటులో ఉన్న సీట్లు, సీయూఈటీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు ఖరారు చేయనున్నాయి.

కనీసం 50 శాతం మార్కులు

సీయూఈటీ స్కోర్ ఆధారంగా సెంట్రల్ యూనివర్సిటీలకు దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు.. ఇంటర్మీడియెట్‌లో కనీసం యాభై శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందేలా చూసుకోవాలి. వాస్తవానికి సీయూఈటీ-యూజీకి ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణత సరిపోతుందని ఎన్‌టీఏ వర్గాలు తెలిపాయి. కానీ..సెంట్రల్ యూనివర్సిటీలు మాత్రం మలిదశ ప్రవేశ ప్రక్రియ, దరఖాస్తు సమయంలో ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సుల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత తప్పనిసరి అని పేర్కొంటున్నాయి. కాబట్టి విద్యార్థులు ముందుగానే ఆయా వర్సిటీల ప్రవేశ అర్హతల నిబంధనలపై స్పష్టత ఏర్పరచుకోవాలి.

తెలుగు రాష్ట్రాల్లో 5 వర్సిటీలు

సీయూఈటీ-యూజీ-2023 స్కోర్ ఆధారంగా జాతీయ స్థాయిలో మొత్తం 44 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశ అవకాశం లభిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని.. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీ; తెలంగాణలోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలు ఈ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

ఇతర ఇన్‌స్టిట్యూట్స్ కూడా

- సీయూఈటీ-యూజీ స్కోర్‌తో సెంట్రల్ యూనివర్సిటీలతోపాటు పలు ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌కు కూడా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఎస్ఐఈటీ యూనివర్సిటీ, బీఎంఎల్ ముంజాల్ యూనివర్సిటీ తదితర మరో 50కు పైగా డీమ్డ్, ప్రైవేట్ యూనివర్సిటీలు కూడా సీయూఈటీ-యూజీ స్కోర్ ఆధారంగానే గతేడాది ప్రవేశాలు కల్పించాయి.
- ఈ ఏడాది ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అదే విధంగా మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల్లోని కొన్ని స్టేట్ యూనివర్సిటీలు కూడా సీయూఈటీ-యూజీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

మంచి స్కోర్‌కు మార్గాలివే

- జాతీయ స్థాయిలో నిర్వహించే సీయూఈటీకి లక్షల సంఖ్యలో పోటీ నెలకొంది. కాబట్టి అభ్యర్థులు మంచి స్కోర్ సాధించే దిశగా అడుగులు వేయాలి.
- పదో తరగతి, ఇంటర్మీడియెట్ అకడమిక్ పుస్తకాలను ఔపోసన పట్టాలి.
- డొమైన్ సబ్జెక్ట్‌ల కోసం ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి పుస్తకాలను అధ్యయనం చేయాలి.
- లాంగ్వేజ్ సబ్జెక్ట్‌ల కోసం సంబంధిత లాంగ్వేజ్‌ల గ్రామర్‌పై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా వాక్య నిర్మాణం, ప్రెసిస్ రైటింగ్, ప్యాసేజ్ రీడింగ్ ప్రాక్టీస్ చేయడమే కాకుండా.. సంబంధిత ప్రశ్నలను సాధన చేయాలి. అదే విధంగా.. రీడింగ్ కాంప్రహెన్షన్, సంబంధిత లాంగ్వేజ్‌లో లిటరరీ ఆప్టిట్యూడ్, వొకాబ్యులరీలలో పట్టు సాధించాలి.
- **జనరల్ టెస్ట్:** ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు హిస్టరీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ పుస్తకాలను చదవాలి. అదే విధంగా కరెంట్ ఈవెంట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. క్వాంటిటేటివ్ రీజనింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల్లో రాణించడానికి అర్థగణిత అంశాలు, కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, నంబర్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.

ముఖ్య సమాచారం

- **అర్హత:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** మార్చి12, 2023
- **పరీక్ష కేంద్రం కేటాయింపు:** ఏప్రిల్ 30, 2023
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** మే రెండో వారంలో
- **సీయూఈటీ-యూజీ పరీక్ష తేదీలు:** మే 21 – మే 31,2023
- **వెబ్‌సైట్:** https://cuet.samarth.ac.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
317	92
61,003	17,944

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	11,787	▽	69
డోజోన్స్	33,827	△	130
ఎఫ్‌టీఎస్ఈ 100	8,004	▽	8
డాక్స్	15,482	△	52
షాంఘై	3,224	▽	25
నికాయ్	27,513	▽	183

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.04	83.71
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.79	89.84
€	యూరో	ఎస్‌బీఐ	97.45	100.73
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	60.58	62.56
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.66	58.07
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.92	62.88
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.09	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.65	23.45
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.92	12.99

నగదు రహిత వైద్యం.. నిశ్చింతగా..!



- క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌కు ప్రాధాన్యం
- పాలసీదారుపై చెల్లింపుల భారం తప్పుతుంది
- నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఎక్కువ ఉండాలి
- రూమ్‌రెంట్, కోపే షరతుల పట్ల జాగ్రత్త
- ఇవి లేకుండా చూసుకుంటేనే ప్రయోజనం

హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకోవడం వెనుక ముఖ్య ఉద్దేశం.. అత్యవసర పరిస్థితి ఏర్పడితే హాస్పిటల్‌లో చికిత్సను నగదు రహితంగా పొందొచ్చనే. సొంతంగా సమకూర్చుకునేంత వెసులుబాటు అందరికీ ఉండదు. కనుక హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకునే వారు తప్పకుండా దృష్టి పెట్టాల్సిన అంశాలలో క్యాష్‌లెస్ సదుపాయం కూడా ఒకటి. దాదాపు అన్ని బీమా సంస్థలు నగదు రహిత వైద్య సేవల సదుపాయాన్ని ప్లాన్‌లో భాగంగా ఆఫర్ చేస్తుంటాయి. ఈ క్యాష్‌లెస్ క్లెయిమ్ ప్రక్రియ సాఫీగా సాగిపోవాలి. సంక్లిష్టంగా ఉండకూడదు. కనుక నగదు రహిత క్లెయిమ్‌ల విషయంలో ఇబ్బంది పడకూడదంటే పాలసీదారులు తమవంతుగా కొన్ని చర్యలు తీసుకోవాలి. ఈ అంశాలన్నీ వివరించే కథనం ఇది...

నెట్‌వర్క్ హాస్పిటల్స్

హెల్త్‌ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకునే ముందు చూడాల్సిన ముఖ్యమైన అంశాల్లో హాస్పిటల్ నెట్‌వర్క్ జాబితా ఒకటి. సదరు బీమా సంస్థ నెట్ వర్క్ పరిధిలో ఎన్ని హాస్పిటల్స్ ఉంటే అంత అనుకూలమని అర్థం చేసుకోవచ్చు. మీరు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో మొత్తం ఎన్ని హాస్పిటల్స్ నెట్‌వర్క్ పరిధిలో ఉన్నాయనే వివరాలను బీమా సంస్థ వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చు.



ఎక్కువ ఆస్పత్రులు ఉండడం వల్ల సమీపంలోని ఆస్పత్రిలో చేరి నగదు రహిత వైద్య సేవలు పొందే వెసులుబాటు ఉంటుంది. అంతే కాదు నగదు రహిత వైద్య సేవలు పొందే విషయంలో మరి కొన్ని అంశాలను కూడా దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. పాలసీ నియమ, నిబంధనలు, మినహాయింపులు, రూమ్ రెంట్ పరిమితులు గురించి కూడా తెలియాలి.

డాక్యుమెంట్లు

బీమా సంస్థలు జారీ చేసే హెల్త్ కార్డ్‌ను చికిత్స సమయంలో వెంట తీసుకెళ్లాలి. ఫిజికల్ కార్డు లేకపోయినా పాలసీ సాఫ్ట్ కాపీ తీసుకెళ్లినా చాలు.



ఆధార్, పాన్ కూడా వెంట ఉంచుకోవాలి. లేదంటే చిరునామా ధ్రువీకరణ ఉండాలి. ముఖ్యంగా ప్రయాణ సమయాల్లో వెంట హెల్త్ కార్డ్ ఉండేలా చూసుకోవాలి. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినా, ప్రమాదానికి గురైనా వెంట ఉండే వారు ఆ కార్డ్ ఆధారంగా ఆస్పత్రిలో చేర్పించడం సులభతరం అవుతుంది.



హాస్పిటల్‌లో అయిన అన్ని ఖర్చులనూ బీమా సంస్థ తిరిగి చెల్లిస్తుందని అనుకోవద్దు. డిస్పోజబుల్స్ లేదా కన్స్యూమబుల్స్ (గ్లోవ్‌లు, కాటన్, సిరంజ్‌లు, మాస్కులు, శానిటైజర్లు)కు ఎక్కువ శాతం ప్లాన్‌లు చెల్లింపులు చేయవు. అలాగే, చికిత్సలో భాగంగా రోగి అదనపు సేవలను పొందితే వాటికి అయ్యే వ్యయాలను పాలసీదారు సొంతంగా భరించాల్సి వస్తుంది. ఇంకా రిజిస్ట్రేషన్, అడ్మినిస్ట్రేటివ్ లేదా సర్వీస్ చార్జీలకు కూడా చెల్లింపులు

మినహాయింపులు/కోపే

రావు. కేర్, మ్యాక్స్ బూపా, డిజిట్, టాటా ఏఐజీ కన్స్యూమబుల్ రైడర్లను ప్రత్యేకంగా ఆఫర్ చేస్తున్నాయి. హెల్త్ ప్లాన్‌కు అనుబంధంగా ఈ రైడర్ తీసుకుంటే, కన్స్యూమబుల్స్‌కు అయ్యే చార్జీలకు కూడా బీమా సంస్థే చెల్లిస్తుంది. హెల్త్ ప్లాన్‌లో కోపే ఆప్షన్ ఎంపిక చేసుకోకపోవడమే మంచిది. కోపే అంటే క్లెయిమ్ మొత్తంలో నిర్ణీత శాతం (ఉదాహరణకు 10–20 శాతం) పాలసీదారుడే చెల్లించుకోవడం. దీన్ని ఎంపిక చేసుకుంటే పాలసీ ప్రీమియం తగ్గుతుంది. కానీ, ఆస్పత్రిలో చెల్లించే భారం పడుతుంది. కొన్ని ప్లాన్లలో వ్యాధుల వారీ కోపే ఆప్షన్ ఉంటుంది. ఆయా చికిత్సలకు సంబంధించి మాత్రమే కోపే నిబంధన అమలవుతుంది. ఇవి లేకుండా చూసుకోవాలి. ఒకవేళ కోపే ఆప్షన్ ఎంచుకుంటే తనవంతు చెల్లింపులకు వీలుగా అత్యవసర వైద్య నిధి సమకూర్చుకోవడం అవసరం.

ముందుగా తెలియజేయాలి..

ఏదైనా ప్రమాదం లేదంటే మరో అత్యవసర అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాల్సి వస్తే.. దగ్గర్లోని నెట్‌వర్క్ హాస్పిటల్‌కు వెళ్లడం మంచి నిర్ణయం అవుతుంది. ఒకవేళ నెట్‌వర్క్ హాస్పిటల్ మరీ దూరంలో ఉండి, రోగి పరిస్థితి సీరియస్‌గా ఉంటే సమీపంలోని ఏదో ఒక ఆస్పత్రికి వెళ్లాల్సి రావచ్చు. అలాంటి పరిస్థితుల్లో వేరే మార్గం ఉండకపోవచ్చు. కాకపోతే కొన్ని రకాల చికిత్సలు ముందస్తు ప్రణాళిక మేరకు తీసుకునేవి ఉంటాయి. ఉదాహరణకు మోకాలి శస్త్రచికిత్స, హెర్నియా ఆపరేషన్, క్యాటరాక్ట్ సర్జరీ ఇవన్నీ ముందు అనుకుని తీసుకునే చికిత్సలు. ఇలాంటి వాటికి బీమా సంస్థ లేదంటే థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్ (టీపీఏ/బీమా మధ్యవర్తి) నుంచి ముందుగానే అనుమతి తీసుకోవాలి. హాస్పిటల్‌లో చేరడానికి వారం ముందు అనుమతి కోరొచ్చు. డాక్టర్ ప్రిస్కిప్షన్, ఇతర ఆధారాలను టీపీఏ లేదా బీమా కంపెనీ కస్టమర్ కేర్‌కు మెయిల్ చేయాలి. కాల్‌సెంటర్‌కు కాల్ చేసి ఇందుకు సంబంధించి వివరాలు పొందొచ్చు. వారు అడిగిన అన్ని వివరాలు, పత్రాలు ఇస్తే అనుమతి మంజూరు అవుతుంది. ముందస్తు ప్రణాళిక మేరకు తీసుకునే చికిత్సలకు అనుమతి విషయమై హాస్పిటల్‌లోని ఇన్సూరెన్స్ విభాగం సిబ్బంది సాయాన్ని తీసుకోవచ్చు. బీమా సంస్థ లేదా టీపీఏ నుంచి నగదు రహిత వైద్య సేవల కోసం అనుమతి లేఖను తీసుకోవాలి. చికిత్స కోసం హాస్పిటల్‌కు వెళ్లినప్పుడు అడ్మిషన్ డెస్క్‌కు ఈ లేఖ సమర్పిస్తే సరిపోతుంది. అత్యవసరంగా చేరినట్టయితే బీమా సంస్థ లేదా టీపీఏకి 24 గంటల్లోపు సమాచారం ఇవ్వడం తప్పనిసరి. హాస్పిటల్ ఇన్సూరెన్స్ డెస్క్‌కు హెల్త్ ప్లాన్ వివరాలు ఇస్తే వారే బీమా కంపెనీకి సమాచారం ఇస్తారు.

దూరం

బీమా సంస్థలకు దేశవ్యాప్తంగా ఆస్పత్రులతో టైఅప్ ఉంటుంది. ఒక ఆస్పత్రిని తన నెట్‌వర్క్ పరిధిలో చేర్చుకునే ముందు బీమా కంపెనీలు ఎన్నో అంశాలను చూస్తుంటాయి. ప్రభుత్వ గుర్తింపు, చికిత్సల చార్జీలు, సేవల నాణ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటాయి. మీ నివాసానికి సమీపంలో ఏఏ ఆసుపత్రి బీమా సంస్థ నెట్‌వర్క్ పరిధిలో ఉందనే వివరాలను సంబంధిత బీమా కంపెనీ పోర్టల్ నుంచి తెలుసుకోవచ్చు. బీమా సంస్థ కస్టమర్‌కేర్‌కు కాల్ చేసి అడిగినా వివరాలు అందిస్తారు. నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఎప్పుడూ స్థిరంగా ఉండవు. ఈ జాబితా మారుతుంటుంది. కొన్ని ఆసుపత్రులు జాబితా నుంచి బయటకు వెళ్లిపోయి, కొత్తవి చేరుతుంటాయి. బీమా సంస్థల పోర్టళ్లలో అప్‌డేటెడ్ వివరాలు అందుబాటులో ఉంటాయి. నెట్‌వర్క్ జాబితాలో ఉన్నాయంటే సదరు ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవలను పొందొచ్చని అర్థం చేసుకోవచ్చు. హెల్త్ ఇన్సూరెన్స్ కార్డ్‌ను హాస్పిటల్‌లో చేరే సమయంలో చూపిస్తు చాలు. హాస్పిటల్ ఇన్సూరెన్స్ డెస్క్ చికిత్స వ్యయాలకు బీమా సంస్థ నుంచి ఆమోదం తీసుకుంటుంది. బీమా కంపెనీ నుంచి ప్రాథమిక ఆమోదం వస్తే చాలు. రోగి నగదు చెల్లించే అవసరం ఏర్పడదు. బీమా సంస్థలే తుది బిల్లును కూడా సెటిల్ చేస్తాయి. పాలసీ నిబంధనల మేరకు కవరేజీ పరిధిలోకి రాని వాటికి మినహాయించి, మిగిలిన బిల్లును పరిష్కరిస్తాయి. అప్పుడు రోగి మిగిలిన మొత్తాన్ని తన వంతుగా చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో బీమా కంపెనీలు హాస్పిటల్ పంపించిన రికార్డుల ఆధారంగా నగదు రహిత సేవలకు అనుమతి ఇవ్వవు. కస్టమర్‌ను రీయింబర్స్‌మెంట్ విధానంలో క్లెయిమ్ చేసుకోవాలంటూ సమాచారం ఇచ్చే సందర్భాలు కూడా ఉంటాయి. నగదు రహిత సేవల నెట్‌వర్క్ హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స తీసుకోవడం వల్ల.. బిల్లులు, రీయింబర్స్‌మెంట్ పత్రాలతో హాస్పిటల్, బీమా కంపెనీల చుట్టూ క్లెయిమ్ కోసం తిరగాల్సిన శ్రమ తప్పుతుంది.

రూమ్ రెంట్ పరిమితులు

ఆరోగ్య బీమా పాలసీల్లో రూమ్ రెంట్ పరిమితులు ఉండడం సహజం. పాలసీ తీసుకునే సమయంలోనే పరిమితులు లేకుండా 'ఎనీ రూమ్ టైప్' ఆప్షన్ ఎంపిక చేసుకుంటే ఎలాంటి సమస్య ఉండదు. కానీ, దీనికి కొంచెం ప్రీమియం అధికంగా ఉంటుంది. దీనికి బదులు సింగిల్ ప్రైవేటు రూమ్, షేర్డ్ రూమ్ పరిమితులు ఎంపిక చేసుకుంటే, ప్రీమియం కొంత తగ్గుతుంది. పాలసీదారులు కానీ, వారి కుటుంబ సభ్యులు కానీ తమ హెల్త్ ప్లాన్ రూమ్ రెంట్ పరిమితి గురించి తప్పకుండా అవగాహనతో ఉండాలి. అప్పుడే హాస్పిటల్‌లో చేరినప్పుడు పాలసీ అనుమతించిన రూమ్‌లోనే చేరడానికి వీలుంటుంది. ఒకవేళ పాలసీలో చెప్పినదానికి భిన్నమైన రూమ్ సేవలను పొందితే అప్పుడు పాలసీదారుపై చెల్లింపుల భారం పడుతుంది. కొన్ని ప్లాన్లు రూమ్ రెంట్‌ను సమ్ అష్యూరెన్స్‌లో ఒక శాతానికి పరిమితం చేస్తుంటాయి. అంటే రూ.5 లక్షల ప్లాన్‌లో రూ.5,000, రూ.10 లక్షల ప్లాన్‌లో రూ.10,000 చార్జీ (రోజుకు) మించని రూమ్‌లోనే చేరాల్సి ఉంటుంది. ప్రభుత్వరంగ సాధారణ బీమా సంస్థలు అయిన యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీల ప్లాన్లలో ఇలాంటి పరిమితులు ఉంటాయి. ఆస్పత్రుల్లో రూమ్‌ను బట్టి రోగికి అందించే చికిత్సలు, సేవల చార్జీలు మారిపోతుంటాయి. ప్రీమియం రూమ్ సేవలు పొందడం వల్ల బిల్లు భారీగా అవుతుంది. ఈ భారాన్ని తగ్గించుకునేందుకే బీమా సంస్థలు రూమ్ రెంట్ పరిమితి నిబంధనలు పెడుతుంటాయి. ఉదాహరణకు రూ.5,000 రూమ్ రెంట్ పరిమితి ఉన్న ప్లాన్ తీసుకుని.. రోజుకు రూ.10 వేలు చార్జీ చేసే రూమ్‌లో చేరారని అనుకుందాం. అప్పుడు మిగిలిన రూమ్ రెంట్ రూ.5,000ను పాలసీదారుడే భరించాలి. అంతేకాదు, రూమ్‌లో చికిత్సలకు అయిన వ్యయాల్లోనూ సగం పాలసీదారుడే చెల్లించాలి. కనుక రూమ్‌రెంట్ పరిమితి ఉన్న ప్లాన్ తీసుకుంటే, ఆ పరిధిలోని రూమ్‌లోనే చేరడం మర్చిపోవద్దు. లేదంటే రూమ్ రెంట్ పరిమితి లేని ప్లాన్‌కు మారిపోవడం లేదా, రూమ్‌రెంట్ వైవర్ రైడర్ తీసుకోవాలి.



మెరుగైన రాబడులకు క్వాంటమ్ మల్టీ అసెట్ ఫండ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మెరుగైన రాబడులు అందుకోవడానికి పెట్టుబడుల విషయంలో వైవిధ్యం పాటించాల్సి ఉంటుందని క్వాంటమ్ అసెట్ మేనేజ్‌మెంట్ సీఐవో చిరాగ్ మెహతా తెలిపారు. ఈ దిశగా ఫిక్సిడ్ డిపాజిట్లకు మించి రాబడులు పొందడానికి క్వాంటమ్ మల్టీ అసెట్ ఫండ్ ఆఫ్ ఫండ్ (క్యూఎంఏఎఫ్‌వోఎఫ్) తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. పెట్టుబడుల్లో వైవిధ్యానికి 12:20:80 వ్యూహం చక్కగా పని చేస్తుందని మెహతా చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడేలా కనీసం 12 నెలల ఖర్చులకు సరిపడే మొత్తాన్ని లిక్విడ్ ఫండ్‌లో ఉంచడం శ్రేయస్కరమని వివరించారు. 20 శాతాన్ని బంగారానికి, మిగతా 80 శాతాన్ని ఈక్విటీలకు కేటాయించడం ద్వారా వైవిధ్యం పాటించవచ్చని, ప్రతికూల పరిస్థితుల్లోనూ పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను కాపాడుకోవచ్చని మెహతా వివరించారు.

ఎల్అండ్‌టీ ఫైనాన్స్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 92 టార్గెట్: రూ. 116

ఎందుకంటే: ఈ ఏడాది మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో ఎల్అండ్‌టీ ఫైనాన్స్ హోల్డింగ్స్ అంచనాలకు మించుతూ రూ. 450 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇందుకు ప్రధానంగా వడ్డీ ఆదాయం సహకరించింది. రిటైల్ ప్రొడక్టులవైపు అసెట్స్(రుణాలు) మిక్స్ చేపట్టడంతో వడ్డీ ఆదాయం జోరందుకుంది. దీనికితోడు పండుగల సీజన్ కావడంతో రుణాలకు డిమాండ్ పెరిగింది. వార్షికంగా 33 శాతం, క్యూ2(జులై–సెప్టెంబర్)తో పోలిస్తే 19 శాతం చొప్పున రుణ వృద్ధి నమోదైంది. వ్యవసాయ పరికరాలు, ద్విచక్ర వాహన విభాగంలో కంపెనీ చరిత్రలోనే ఒక క్వార్టర్‌కు అత్యధికంగా క్యూ3లో రుణాల మంజూరీ నమోదైంది. మరోవైపు గృహ రుణాలు, ఆస్తుల హామీ ద్వారా జారీ చేసే రుణ(ఎల్ఏపీ) విభాగంలోనూ జోరు చూపింది. అయితే నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) త్రైమాసికవారీగా 1.9 శాతం నీరసించాయి. వార్షికంగా చూస్తే మాత్రం 3.4 శాతం బలపడ్డాయి. ఇందుకు హోల్‌సేల్ ఫైనాన్స్ బిజినెస్‌లో భారీగా ఎగసిన రీపేమెంట్స్, ప్రీపేమెంట్స్(రూ. 4,220 కోట్లు), రుణాల విక్రయం(సెల్‌డౌన్స్– రూ. 2,950 కోట్లు) ప్రభావం చూపాయి. కాగా.. రిటైల్ రంగ రుణ విడుదల వార్షిక ప్రాతిపదికన 52 శాతం జంప్‌చేసింది. దీంతో రిటైల్ ఏయూఎం 34 శాతం ఎగసి రూ. 57,000 కోట్లను తాకింది. వెరసి మొత్తం లోన్‌బుక్‌లో 64 శాతం వాటాకు చేరింది. వచ్చే ఏడాది చివరికల్లా రిటైల్ విభాగం వాటా 90 శాతానికి చేరవచ్చని అంచనా. అయితే హోల్‌సేల్ ఫైనాన్స్ ఏయూఎం 24 శాతం క్షీణించి రూ. 31,000 కోట్లకు పరిమితమైంది.



ఏంజెల్ వన్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,111 టార్గెట్: రూ. 1,980

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం(క్యూ3)లో బ్రోకరేజీ దిగ్గజం ఏంజెల్ వన్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. సగటున 10 లక్షల మంది క్లయింట్లను జత చేసుకోవడం ద్వారా తొలి 9 నెలల(ఏప్రిల్–డిసెంబర్)లోనూ మెరుగైన పనితీరు చూపింది. ఆర్డర్ల సంఖ్యలోనూ సగటున నెలవారీ రన్‌రేట్ 7.4 కోట్లు(9 నెలల్లో) సాధించింది. వ్యయ క్రమబద్ధీకరణ(9 నెలల అమ్మకాలలో మొత్తం నిర్వహణా వ్యయాలు 48 శాతం)లోనూ పటిష్ట పనితీరుతో ఆకట్టుకుంది. ఈ అంశాలన్నీ ప్రస్తుత ఏడాది(2022–23), వచ్చే ఆర్థిక సంవత్సరం(2023–24)లలో షేరువారీ ఆర్జన(ఈపీఎస్) అంచనాల పెంపునకు దోహదం చేశాయి. వెరసి ఈపీఎస్‌లో వృద్ధి అంచనాలను ఈ ఏడాది, వచ్చే ఏడాదిలకు 9.5 శాతం, 11 శాతం చొప్పున పెంచాం. ఎన్ఎస్ఈ ఈక్విటీ ఆప్షన్స్ విభాగంలో లావాదేవీల పరిమాణం భారీగా దూసుకెళ్లడం సైతం అంచనాల పెంపునకు సహకరించింది. గత రెండేళ్లలో వార్షికంగా 126 శాతం వృద్ధి నమోదైంది.



బ్రోకింగ్ సంస్థ ట్రాక్ రికార్డ్(గత రెండేళ్లలో ఆర్డర్ల సంఖ్య మూడు రెట్లు జంప్‌చేయడం), రిటైల్ పరిమాణంలో 21.5 శాతం వాటాతో సాధించిన పటిష్టత వంటి అంశాలు సానుకూల అంచనాలకు దారి చూపుతున్నాయి. అయితే ఏదేని కారణంవల్ల మార్కెట్‌లో లావాదేవీల పరిమాణం పడిపోవడం, లావాదేవీలు పెరిగిపోవడాన్ని నియంత్రించేందుకు(ప్రధానంగా ఈక్విటీ ఆప్షన్స్‌లో) నియంత్రణ సంస్థలు ఆంక్షలు విధించడం వంటి ప్రతికూలతలు ప్రధాన రిస్కులుగా పేర్కొనవచ్చు. 2023–24లో రూ. 940 కోట్ల నికర లాభం(రూ. 110 ఈపీఎస్) అంచనా వేస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

అదానీ-హిండెన్‌బర్గ్ వివాద ప్రభావం భారత్‌పై ఉండదు..


డీఎల్ఎఫ్ చైర్మన్ కేపీ సింగ్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: భారత్ వృద్ధి గాథపై అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్, అదానీ గ్రూప్ వివాద ప్రభావమేమీ ఉండబోదని రియల్ ఎస్టేట్ దిగ్గజం డీఎల్ఎఫ్ చైర్మన్ కేపీ సింగ్ స్పష్టం చేశారు. ఇది కేవలం ఒక కార్పొరేట్ గ్రూప్‌నకు మాత్రమే పరిమితమైన విషయమే తప్ప, దీనితో అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు భారత్‌పై నమ్మకమేమీ సడలబోదని పేర్కొన్నారు. పైస్థాయి నుంచి వచ్చిన ఒత్తిళ్ల కారణంగానే అదానీ గ్రూప్‌నకు బ్యాంకులు రుణాలు ఇచ్చి ఉంటాయనే అభిప్రాయాలను సింగ్ తోసిపుచ్చారు. అయితే అధిక వృద్ధి బాటలో ముందుకెళ్లాలంటే అదానీ గ్రూప్ రుణభారాన్ని తగ్గించుకుని, పెట్టుబడిని పెంచుకోవాలని సూచించారు. భారీగా షేర్ల విక్రయాల సమయంలో కొందరు బ్లాక్‌మెయిలర్లు నివేదికలతో బైటికొస్తుంటారని చెప్పారు.

నిఫ్టీ సూచీలలో అదానీ గ్రూప్ షేర్లు


మార్చి31 నుంచి మార్పులు



నిఫ్టీ ఇండెక్సులలో ఈ ఏడాది మార్చి31 నుంచి సవరణలు చేపడుతున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ తాజాగా వెల్లడించింది. నిఫ్టీ ఇండెక్సులలో ప్రయివేట్ రంగ కంపెనీలు అదానీ విల్మర్, అదానీ పవర్‌తోపాటు పలు ఇతర కంపెనీలకు చోటు లభించనుంది. అదానీ విల్మర్ నిఫ్టీ నెక్ట్స్ 50, నిఫ్టీ 100కు ప్రాతినిధ్యం వహించనుంది. ఇక అదానీ పవర్‌కు నిఫ్టీ 500, 200లతోపాటు నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, 150, లార్జ్‌మిడ్ క్యాప్ 250, మిడ్‌స్మాల్ క్యాప్ 400లలో చోటు లభించనుంది. ఇండెక్సుల నిర్వహణ సబ్‌కమిటీ షేర్ల జాబితాలో సవరణలను నిర్ణయించినట్లు ఎన్ఎస్ఈ తెలియజేసింది. అయితే ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ–50లో ఎలాంటి మార్పులూ చేపట్టడంలేదని ఎన్ఎస్ఈ స్పష్టం చేసింది. కాగా.. నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్‌లో ఏబీబీ ఇండియా, కెనరా బ్యాంక్, పేజ్ ఇండస్ట్రీస్, వరుణ్ బెవరేజెస్ సైతం ప్రాతినిధ్యం వహించనున్నట్లు వెల్లడించింది. మరోవైపు బంధన్ బ్యాంక్, బయోకాన్, గ్లాండ్ ఫార్మా, ఎంఫసిస్, వన్ 97 కమ్యూనికేషన్స్‌లను నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్‌నుంచి తప్పిస్తున్నట్లు పేర్కొంది.

ఎన్ఎఫ్‌వోలకు దూరంగా ఇన్వెస్టర్లు!

38 శాతం తక్కువగా నిధుల సమీకరణ



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ సంస్థల కొత్త పథకాల (ఎన్ఎఫ్‌వోలు) పట్ల ఇన్వెస్టర్లు గతేడాది అప్రమత్తతతో వ్యవహరించారు. ఫలితంగా ఏడాది మొత్తం మీద మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు ఎన్ఎఫ్‌వోల రూపంలో రూ.62,000 కోట్లను సమీకరించాయి. 2021లో ఎన్ఎఫ్‌వోల రూపంలో వచ్చిన పెట్టుబడులతో పోలిస్తే 38 శాతం తగ్గిపోయింది. కాకపోతే 2021లో 140 కొత్త పథకాలు మార్కెట్లోకి వస్తే, గతేడాది కొత్త పథకాలు 228కి పెరిగిపోవడం గమనార్హం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-2-2023	
విశాఖ	420-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	409-00
విజయవాడ	409-00
రిటైల్ ధర (డజను)	66.00
19-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	329-00
వరంగల్	394-00
రిటైల్ ధర	4.50

ఫండ్ పథకాన్ని ఎప్పుడు మార్చాలి?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



మ్యూచువల్ ఫండ్ పథకానికి, న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో)కు మధ్య తేడా ఏంటి?

– డి.తరుణ్

ప్రతీ మ్యూచువల్ ఫండ్ సంస్థ ఎప్పటికప్పుడు కొత్త పెట్టుబడుల నమూనాలతో నూతన పథకాలను (ఎన్ఎఫ్‌వో) తీసుకొస్తుంటాయి. ఇలా వచ్చిన పథకం కొంత కాలానికి పాతది అయిపోతుంది. ఆయా పథకం పెట్టుబడుల తీరు, మార్కెట్ కరెక్షన్లలో, మార్కెట్ ర్యాలీల్లో పథకాల పనితీరు ఎలా ఉందో పరిశీలించొచ్చు. ఎన్ఎఫ్‌వో అన్నది కొత్తగా మొదలయ్యే పథకం. ఇన్వెస్టర్లు అప్పగించిన పెట్టుబడులను ఆ ఫండ్ మేనేజర్ అప్పటి నుంచి ఇన్వెస్ట్ చేయడం మొదలు పెడతారు. కొత్త పథకం పెట్టుబడి లక్ష్యాలు, ఫండ్ మేనేజర్ గతంలో నిర్వహించిన పథకాల ట్రాక్ రికార్డు గురించి తెలుసుకోవచ్చు. అలాగే, ఎన్ఎఫ్‌వో ఆరంభమైన సమయంపై పనితీరు ఆధారపడి ఉంటుంది. మార్కెట్లు దిద్దుబాటుకు గురైన సమయాల్లో పథకాన్ని ప్రారంభించి, అనంతరం మార్కెట్లు పెరిగిపోతే సహజంగానే పథకంలో రాబడులు ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే కొత్త పథకం మార్కెట్లు గరిష్టాల్లో ఉన్నప్పుడా లేక కనిష్టాల్లో ఉన్నప్పుడు ప్రారంభమవుతుందా అన్నది ఇన్వెస్టర్ తప్పకుండా పరిశీలించాలి. ఎన్ఎఫ్‌వో రూపంలో మ్యూచువల్ ఫండ్స్ పెద్ద ఎత్తున పెట్టుబడులను సమీకరిస్తుంటాయి. ఇందుకోసం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తాయి. చాలా మంది ఎన్ఎఫ్‌వోల్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. ఇప్పటికే ఎన్నో పథకాలు అందుబాటులో ఉండగా ఎన్ఎఫ్‌వోల్లో అంత భారీ మొత్తంలో ఎందుకు ఇన్వెస్ట్ చేస్తున్నారనేది మాత్రం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

మ్యూచువల్ ఫండ్స్ పథకాల మధ్య పెట్టుబడులను ఎటువంటి సందర్భాల్లో మార్చాల్సి వస్తుంది?

– పవన్ కుమార్

మీరు ఇన్వెస్ట్ చేస్తున్న మ్యూచువల్ ఫండ్స్ పథకాలను రెండు రకాల కారణాల వల్ల మార్చాల్సి రావచ్చు. మొదట మీ లక్ష్యాల్లో మార్పులు చోటు చేసుకున్నప్పుడు పెట్టుబడులను వాటికి అనుగుణంగా సవరించుకోవాల్సి ఉంటుంది. లేదంటే లక్ష్యాలను చేరుకున్నప్పుడు కూడా ఈ అవసరం ఏర్పడుతుంది. ఉదాహరణకు మీరు దీర్ఘకాలం కోసం అంటే రిటైర్మెంట్ లేదా పిల్లల ఉన్నతవిద్య కోసం ఇన్వెస్ట్ చేస్తున్నారనుకుంటే.. కావాల్సిన మొత్తం సమకూరితే పెట్టుబడిని మొత్తం తీసేసుకోవచ్చు. నిర్ణీత కాలవ్యవధికి ముందే మీకు కావాల్సిన మొత్తం సమకూరితే ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. ఇక మీరు ఏదైనా ఒక పథకంలో కొన్ని కారణాలను చూసి ఇన్వెస్ట్ చేశారనుకోండి. ఆ తర్వాత ముందు చూసిన అంశాలు మారిపోయినట్టయితే మీ పెట్టుబడులను విక్రయించుకోవచ్చు. ఫండ్ మేనేజర్ మారిపోవడం పథకం నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకోవడానికి సరైన కారణం కాబోదు. కాకపోతే మీరు అప్రమత్తం అయ్యేందుకు ఒక కారణంగా చూడొచ్చు. గతంలో మంచి రాబడులను ఇచ్చిన పథకం కొత్త ఫండ్ మేనేజర్ నిర్వహణలో అంత మంచి పనితీరు చూపించకపోతే అప్పుడు వేరే పథకానికి మారిపోయే ఆలోచన చేయవచ్చు. అలాగే, నిలకడగా మంచి రాబడులను ఇస్తుందన్న కారణంతో ఒక పథకంలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. మీరు ఆశించిన విధంగా పనితీరు లేకపోయినా దాని నుంచి తప్పుకోవచ్చు.

క్లుప్తంగా...

కలాం పేరిట బుల్లి ఉపగ్రహాలు

- చెన్నైలో ప్రయోగం విజయవంతం



రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తున్న పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై తదితరులు

సాక్షి, చెన్నై: దివంగత మాజీ రాష్ట్రపతి, విఖ్యాత శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం శాటిలైట్ వెహికల్ పేరిట 150 బుల్లి ఉపగ్రహాలతో హైబ్రీడ్ రాకెట్‌ను ఆదివారం చెన్నైలో ప్రయోగించారు. మార్టిన్ ఫౌండేషన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ ఫౌండేషన్, స్పేస్ జోన్ ఇండియా ఆధ్వర్యాన పరిశోధనల్లో రాణిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ఎంపిక చేసి, వారితో ఈ బుల్లి ఉపగ్రహాలను తయారు చేయించారు. రెండేళ్లపాటు శ్రమించి రూపొందించిన ఈ ఉపగ్రహాలను చెన్నై సముద్ర తీరంలో ప్రయోగించారు. నింగిలోకి ఆరు నుంచి ఏడు కిలోమీటర్లు ప్రయాణం సాగించిన ఈ హైబ్రీడ్ రాకెట్ నుంచి ఉపగ్రహాలు పారాచ్యూట్ల సాయంతో విడిపోయి వివిధ అంశాలకు సంబంధించిన సమాచారం సేకరించాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్, మార్టిన్ ఫౌండేషన్ ప్రతినిధులు జోష్ చార్లస్ మార్టిన్, లీమా రోజ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్త మైల్‌స్వామి అన్నాదురై తదితరులు హాజరయ్యారు.

తను మరణించినా.. ముగ్గురికి ఊపిరి పోశాడు

కాకినాడ ట్రస్ట్ ఆస్పత్రి నుంచి గ్రీన్ చానల్ ద్వారా అవయవాల తరలింపు

కాకినాడ రూరల్: తను మరణించినా.. తన అవయవాల ద్వారా పలువురికి ఊపిరి పోశారు కాకినాడకు చెందిన పెంకే గోవిందకుమార్ (50). కాకినాడ ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స కోసం చేరిన గోవింద కుమార్ బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆస్పత్రి వైద్యులు రాజశేఖరన్, ప్రశాంత్, యు.కిషోర్ కుమార్, కల్యాణి, శ్రీకాంత్, గణేష్ ఆదిమూలం, డీవీఎస్ సోమయాజులు, వై.కల్యాణ్ చక్రవర్తి, ఎస్‌సీహెచ్ఎస్ రామకృష్ణ, సనా ప్రవీణ తదితరులు రాత్రి 8 గంటలకు దాత నుంచి అవయవాలు సేకరించారు. ఒక కిడ్నీని ఆస్పత్రిలోనే రోగికి విజయవంతంగా అమర్చారు. రాత్రి 10 గంటల సమయంలో మరో కిడ్నీని విశాఖపట్నంలోని కేర్ ఆస్పత్రికి, కాలేయాన్ని (లివర్) గుంటూరు జిల్లా తాడేపల్లి వద్ద మణిపాల్ ఆస్పత్రికి అంబులెన్సుల్లో తరలించారు. దీనికోసం జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు గ్రీన్ చానల్ ఏర్పాటు చేశారు. అంబులెన్సులు గమ్యానికి సజావుగా చేరేలా ఎస్పీ కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. అవయవాల తరలింపును ట్రస్ట్ ఆస్పత్రి వైద్యుడు రామకృష్ణ సమన్వయం చేశారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ కో–ఆర్డినేటర్‌గా స్వాతి వ్యవహరించారు.

శ్రీశైలం అడవుల్లో అలుగుల అడుగులు

- పులుల కోసం పెట్టిన కెమెరా ట్రాప్‌ల ద్వారా ఇండియన్ పాంగోలిన్ల గుర్తింపు
- పూర్తిగా తెలుసుకునేందుకు తూర్పు కనుమల వైల్డ్ లైఫ్ సొసైటీ పరిశోధన
- అంతరించే జీవుల జాబితాలో పాంగోలిన్స్.. ప్రపంచంలో అత్యధికంగా స్మగ్లింగ్ అయ్యేది ఇవే
- అతిపెద్ద అభయారణ్యంలో వాటి రక్షణకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయంటున్న నిపుణులు



ఇండియన్ పాంగోలిన్

అలుగు.. ఒళ్లంతా పొలుసులు, మందపాటి తోక గల క్షీరద జాతి జంతువు. పగలంతా చెట్ల తొర్రలు, నేల బొరియల్లో దాక్కుని.. రాత్రి వేళ బయట సంచరించే నిశాచర జీవులివి. ఒంటరిగా జీవించడానికే ఇష్టపడే అలుగులు చీమలు, చెద పురుగులనే ఆహారంగా తీసుకుంటాయి. పొడవాటి సన్నని నాలుకతో వాటిని జుర్రుకుని తింటాయి. శత్రువు కనిపిస్తే బంతి మాదిరిగా చుట్టుకుపోయి.. ముప్పు నుంచి తప్పించుకునే నైపుణ్యం గల అలుగులు శ్రీశైలం అడవుల్లో సంచరిస్తున్నట్టు అటవీ శాఖ కెమెరా ట్రాప్‌ల ద్వారా గుర్తించింది.

సాక్షి, అమరావతి: నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వు ప్రాంతంలో అరుదైన భారతీయ అలుగుల (ఇండియన్ పాంగోలిన్) ఉనికిని గుర్తించారు. గతంలో ఈ ప్రాంతంలో విస్తృతంగా కనిపించే పాంగోలిన్లు అంతరించే దశకు చేరుకున్నాయి. నల్లమలతోపాటు ఇతర అటవీ ప్రాంతాల్లోనూ వాటి జాడే తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో నల్లమల అడవుల్లో మళ్లీ వాటి కదలికలను గుర్తించడంతో వన్యప్రాణి ప్రేమికుల్లో ఆశలు చిగురించాయి. శ్రీశైలం టైగర్ రిజర్వు ప్రాంతంలోని ఆత్మకూరు, మార్కాపురం పరిసరాల్లో పులుల జాడ కోసం పెట్టిన కెమెరా ట్రాపుల్లో పాంగోలిన్లు కూడా కనిపించాయి. కాకపోతే మిగిలిన జంతువులతో పోలిస్తే వాటి సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్టు నల్లమలలో జీవించే చెంచులు, లంబాడీలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పాంగోలిన్ల ఉనికి, వాటి ఆవాసాలు, రక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి తూర్పు కనుమల వైల్డ్ లైఫ్ సొసైటీ, రాష్ట్ర అటవీ శాఖ సంయుక్తంగా పరిశోధన ప్రారంభించాయి. వాటి ఆవాసాలు ఎలా ఉన్నాయి, ఎలాంటి ప్రాంతాల్లో ఉండేందుకు అవి ఇష్టపడుతున్నాయి, వాటి జనాభా వంటి అంశాలపై అధ్యయనం చేస్తున్నారు. పాంగోలిన్ల బొరియలు ఎక్కడెక్కడ ఉన్నాయో చూస్తూ వాటి గురించి తెలుసుకుంటున్నారు. అవి ఆహారం తినడానికి తవ్వే బొరియలు, నివాసం కోసం తవ్వే బొరియలు వేర్వేరుగా ఉన్నాయి. ఆ బొరియల ఆధారంగా వాటి సంఖ్య, ఇతర వివరాలు సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. వీలైతే అక్కడ కెమెరా ట్రాప్‌లు పెట్టాలని భావిస్తున్నారు.

అరుదైన పాంగోలిన్ జాతికి చెందినవి

అలుగులను వివిధ ప్రాంతాల్లో వాలుగు, చిప్పల పంది తదితర పేర్లతోనూ పిలుస్తారు. ప్రపంచంలో 8 జాతుల పాంగోలిన్లు ఉన్నాయి. అందులో 4 ఆసియా ఖండంలో, మరో 4 ఆఫ్రికా ఖండంలో ఉన్నాయి. ఆసియాలో ఉన్న 4 జాతుల్లో రెండు జాతులు మన దేశంలో కనిపిస్తాయి. ఆ రెండింటిలో అత్యంత అరుదైన ఇండియన్ పాంగోలిన్ (మానిస్ క్రాసికాడాటా) జాతి మన రాష్ట్రంలో కనిపిస్తుంది. నల్లమలలో గుర్తించింది ఈ జాతినే. ఇది చీమలు, చెద పురుగులను తింటుంది. అన్ని పాంగోలిన్ల మాదిరిగానే ఇండియన్ పాంగోలిన్ మందమైన పొలుసులతో కప్పబడి ఉంటుంది. తమను వేటాడే జంతువుల నుండి రక్షించుకోవడానికి ఈ పొలుసులు రక్షణ కవచంగా ఉపయోగపడతాయి. ప్రాణాపాయం, బెదిరింపులకు గురైతే ఇండియన్ పాంగోలిన్ బంతిలా ముడుచుకుపోతుంది. మన దేశంలోని హిమాలయాలు, ఈశాన్య రాష్ట్రాలు, నేపాల్‌లో చైనీస్ పాంగోలిన్లు కనిపిస్తాయి. పాంగోలిన్ జాతులున్నా అంతరించిపోయే జీవుల జాబితాలో ఉన్నాయి. అవి నివసించే ఆవాసాలు ధ్వంసమవడం, వాటి పొలుసులు, మాంసాన్ని సంప్రదాయ వైద్యంలో వినియోగించడం కోసం అక్రమంగా వేటాడుతుండటంతో పాంగోలిన్ల ఉనికి ప్రమాదంలో పడింది. వాటిపై ఉండే పొలుసులను చైనీస్ మెడిసిన్‌లో విరివిగా వాడతారు. అందుకే వాటిని ఇష్టానుసారం వేటాడటంతో అవి అంతరించిపోతున్నాయి. అంతర్జాతీయంగా ఎక్కువగా అక్రమ రవాణా అవుతున్న క్షీరదాల్లో మొదటి స్థానం వీటిదే. దక్షిణాదిలో తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో వీటి అక్రమ రవాణా ఎక్కువగా ఉంది.

నల్లమలలో రక్షణకు అవకాశం ఎక్కువ

ఇండియన్ పాంగోలిన్ అరుదైన జంతువు. దేశంలో చాలా ప్రాంతాల్లో ఇవి ఉన్నా అంతరించే దశలో ఉన్నాయి. శ్రీశైలం రిజర్వు పెద్దది కావడం, ఇక్కడి రక్షణ వ్యవస్థ బాగుండటం, పులుల సంఖ్య పెరుగుతుండటంతో పాంగోలిన్లకు ఎక్కువ రక్షణ ఇచ్చే అవకాశం ఉంటుంది. ఆ దిశగానే అటవీ శాఖతో కలిసి అధ్యయనం చేస్తున్నాం. వాటి ఉనికి, హాట్ స్పాట్స్, అక్రమ రవాణా ఏమైనా జరుగుతుందా వంటి వివరాలను తెలుసుకుంటున్నాం.

– కంటి మహంతి మూర్తి, తూర్పు కనుమల వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షుడు

ఎస్‌ఐ పోస్టుల ప్రిలిమినరీ పరీక్షకు 1.51లక్షల మంది హాజరు

- 292 కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్ష
- నేడు 'ప్రాథమిక కీ' విడుదల
- అభ్యంతరాలు తెలిపేందుకు 23 వరకు గడువు
- 2 వారాల్లో ఫలితాలు విడుదల
- రాష్ట్ర పోలీసు నియామక మండలి వెల్లడి



విజయవాడలో ప్రిలిమినరీ పరీక్ష అభ్యర్థులకు సూచనలిస్తున్న పోలీసు అధికారులు

సాక్షి, అమరావతి: ఎస్‌ఐ పోస్టుల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన ప్రిలిమినరీ రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 411 ఎస్‌ఐ పోస్టుల భర్తీ కోసం రాష్ట్రవ్యాప్తంగా 13 నగరాలు, పట్టణాల్లోని 292 కేంద్రాల్లో ప్రిలిమినరీ రాత పరీక్షకు 1,51,243 మంది హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పేపర్–2 పరీక్ష నిర్వహించారు. ప్రిలిమినరీ పరీక్ష 'ప్రాథమిక కీ'ని సోమవారం ఉదయం 11గంటలకు తమ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని రాష్ట్ర పోలీసు నియామక మండలి తెలిపింది. అభ్యర్థులు ఆ ప్రాథమిక 'కీ'ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది. ప్రాథమిక కీపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 23వ తేదీ ఉదయం 11గంటలలోపు తమకు మెయిల్ ద్వారా తెలియజేయవచ్చని తెలిపింది. వెబ్‌సైట్‌లో పొందుపరిచిన నిర్దీత ఫార్మాట్‌లోనే అభ్యంతరాలను తమకు మెయిల్ చేయాలని కూడా పేర్కొంది. ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను రెండు వారాల్లో వెల్లడిస్తామని, అభ్యర్థుల జవాబు పత్రాల స్కాన్డ్ కాపీలు కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పోలీసు నియామక మండలి వెల్లడించింది.

- ప్రాథమిక కీ డౌన్‌లోడ్ చేసుకోడానికి వెబ్‌సైట్: slprb.ap.gov.in
- ప్రాథమిక కీ పట్ల అభ్యంతరాలను నిర్ణీత ఫార్మాట్‌లో పంపాల్సిన మెయిల్ ఐడీ: CTSI& PWT @slprb.appolice.gov.in

ముగిసిన బెజవాడ బుక్ ఫెస్టివల్



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడలో 11 రోజులపాటు నిర్వహించిన 33వ పుస్తక మహోత్సవం ఆదివారం ముగిసింది. ముగింపు సభకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి, కలెక్టర్ ఢిల్లీరావు అతిథులుగా హాజరయ్యారు. సుమారు మూడున్నర లక్షల మంది పుస్తక ప్రియులు సందర్శించారని నిర్వాహకులు తెలిపారు.

తెలుగుగంగ.. రికార్డు మురవంగ

సాక్షి, అమరావతి: తెలుగుగంగ ప్రాజెక్టు కింద ప్రస్తుత నీటి సంవత్సరంలో రికార్డు స్థాయిలో ఐదు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు రాష్ట్ర ప్రభుత్వం నీటిని అందించింది. ప్రాజెక్టు చరిత్రలో ఈ స్థాయిలో నీళ్లందించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. తెలుగుగంగ లింక్ కెనాల్, ప్రధాన కాలువ లైనింగ్ పనులను రూ.460 కోట్లతో చేపట్టి దాదాపు పూర్తి చేయడంతోపాటు రూ.90 కోట్లతో డయాఫ్రమ్‌వాల్ ద్వారా లీకేజీలకు అడ్డుకట్ట వేసింది. ఫలితంగా బ్రహ్మంసాగర్‌లో గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేసి ఆయకట్టుకు రికార్డు స్థాయిలో నీళ్లందించగలిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

నాడు వైఎస్సార్ కృషితో..

శ్రీశైలానికి వరద వచ్చే రోజుల్లో తరలించే 29 టీఎంసీల కృష్ణా జలాలకు 30 టీఎంసీల పెన్నా జలాలను జతచేసి 59 టీఎంసీలను మళ్లించడం ద్వారా దుర్భిక్ష ప్రాంతాలైన ఉమ్మడి కర్నూలు (1.08 లక్షల ఎకరాలు), వైఎస్సార్ కడప (1.67 లక్షల ఎకరాలు), నెల్లూరు (2.54 లక్షల ఎకరాలు), చిత్తూరు జిల్లా (46 వేల ఎకరాలు)ల్లో మొత్తం 5.75 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా తెలుగు గంగ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. 2004 నుంచి 2009 మధ్య దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో అప్పట్లోనే నాలుగు లక్షల ఎకరాలకు నీళ్లందించగలిగారు.



వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల చెరువు నుంచి బి.కోడూరు మండలంలోని చెరువులకు వెళుతున్న తెలుగుగంగ నీరు

నిర్వహణపై టీడీపీ సర్కార్ నిర్లక్ష్యం

బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలిగోడు రిజర్వాయర్ వరకూ 7.80 కిలోమీటర్ల పొడవున 15 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో తెలుగుగంగ లింక్ కెనాల్‌ను తవ్వారు. అయితే ఈ కాలువకు లైనింగ్ చేయకపోవడంవల్ల 2019 వరకు కేవలం 6 – 7 వేల క్యూసెక్కులు మాత్రమే తరలించారు. దీనివల్ల వెలిగోడు రిజర్వాయర్ సకాలంలో నిండని దుస్థితి నెలకొంది. ఇక వెలిగోడు నుంచి బ్రహ్మంసాగర్ వరకు 42.566 కి.మీల పొడవున ఐదు వేల క్యూసెక్కుల సామర్థ్యంతో తెలుగుగంగ ప్రధాన కాలువను తవ్వారు. దీనికి కూడా లైనింగ్ చేయకపోవడంతో 2,500 – 3,000 క్యూసెక్కులు కూడా తరలించలేని పరిస్థితి ఏర్పడింది. బ్రహ్మంసాగర్ మట్టికట్టలో నిర్మాణ లోపాల వల్ల లీకేజీ (ఊట) ఏర్పడటంతో 17.745 టీఎంసీలకు గానూ కేవలం నాలుగైదు టీఎంసీలను మాత్రమే నిల్వచేసేవారు. మిగిలిపోయిన డిస్ట్రిబ్యూటరీలను (పిల్ల కాలువలు) పూర్తి చేయడం, ప్రధాన కాలువ నిర్వహణను టీడీపీ సర్కార్ నిర్లక్ష్యం చేయడంతో ఐదేళ్లలో ఎన్నడూ రెండు మూడు లక్షల ఎకరాలకు కూడా నీళ్లందించిన దాఖలాల్లేవు.

సీఎం జగన్ చిత్తశుద్ధికి నిదర్శనం

తెలుగుగంగ లింక్ కెనాల్, ప్రధాన కాలువలకు లైనింగ్ చేయడం, డయాఫ్రమ్ వాల్‌తో బ్రహ్మంసాగర్ లీకేజీలకు అడ్డకట్ట వేయడం వల్లే ప్రాజెక్టు చరిత్రలో తొలిసారిగా ఈ ఏడాది ఐదు లక్షల ఎకరాలకుపైగా నీళ్లందించగలిగాం. సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ పనులను పూర్తి చేయించారు. దీనివల్లే సకాలంలో వెలిగోడు, బ్రహ్మంసాగర్, సోమశిల, కండలేరు నింపగలిగాం. తద్వారా గరిష్ఠ స్థాయిలో ఆయకట్టుకు నీళ్లందించగలిగాం.

– హరినారాయణరెడ్డి, సీఈ, తెలుగుగంగ

యుద్ధప్రాతిపదికన లైనింగ్..



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తెలుగుగంగ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలిగోడు రిజర్వాయర్ వరకు తెలుగుగంగ లింక్ కెనాల్ సామర్థ్యాన్ని 15 వేల క్యూసెక్కులకు పెంచేలా లైనింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. దీంతో 2020, 2021, 2022లో వెలిగోడును సకాలంలో నింపగలిగారు. ఆయకట్టుకు నీళ్లందిస్తూ పంటలు పూర్తయ్యాక వెలిగోడు రిజర్వాయర్ నుంచి బ్రహ్మంసాగర్ వరకు తెలుగుగంగ ప్రధాన కాలువ లైనింగ్ పనులను చేపట్టి ఇప్పటికే 90% పూర్తి చేశారు. ఫలితంగా ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యం ఐదు వేల క్యూసెక్కులకు పెరిగింది. బ్రహ్మంసాగర్ మట్టికట్టలో ఊటనీరు వచ్చే ప్రాంతంలో డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించి లీకేజీలకు గతేడాది అడ్డుకట్ట వేశారు. దీంతో 2021, 2022లో బ్రహ్మంసాగర్‌లో గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేశారు. కాలువల ప్రవాహ సామర్థ్యం పెంచి సోమశిల, కండలేరు జలాశయాలలో గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వచేయడానికి మార్గం సుగమం చేశారు. ఈ ఏడాది వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల్లో ఖరీఫ్.. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో లేట్ ఖరీఫ్ కింద ఆయకట్టులో ఐదు లక్షల ఎకరాలకుపైగా నీళ్లందించడానికి మార్గం సుగమం చేశారు. మిగతా డిస్ట్రిబ్యూటరీ పనులను వేగంగా పూర్తి చేసి మిగిలిన 75 వేల ఎకరాలకు కూడా నీళ్లందించే దిశగా అడుగులు వేస్తున్నారు.

సాగరతీరంలో సాహస క్రీడలు

- జీ– 20 సదస్సు నేపథ్యంలో టూరిజం శాఖ సన్నాహాలు
- ఆర్‌కే బీచ్‌లో పారాసెయిలింగ్, పారా మోటర్ ఫ్లైయింగ్
- సాగర్ నగర్, రుషికొండలో ఆల్టేరియస్ వెహికల్స్
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో అనుమతి కోసం
- ఎన్నికల సంఘానికి లేఖ రాసేందుకు ఏర్పాట్లు



సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయ పర్యాటకానికి చిరునామాగా గుర్తింపు పొందిన విశాఖ నగరంలో వాటర్ స్పోర్ట్స్, సాహస క్రీడలు పరిచయం చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023, మార్చి 28, 29 తేదీల్లో జీ–20 అంతర్జాతీయ సదస్సులు జరగనున్నాయి. ఈ తరుణంలో ప్రపంచ దేశాల ప్రతినిధులకు నగరం ఆతిథ్యమివ్వనుంది. దాదాపు 7 నుంచి నెల రోజుల పాటు వారంతా నగరంలోనే బస చేయనున్నారు. ఇందుకోసం విశాఖలోని ప్రధానమైన నక్షత్రాల హోటళ్లలో గదులను రిజర్వ్ చేశారు. సదస్సులు అనంతరం ఉమ్మడి విశాఖ జిల్లాల పరిధిలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను విదేశీ ప్రతినిధులు సందర్శించనున్నారు. ఇందుకనుగుణంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. నగర పరిధిలోని పర్యాటక ప్రాంతాలతో పాటు ఏజెన్సీలోని ప్రముఖ టూరిస్ట్ స్పాట్లు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.





డీటీసీ సమావేశంలో కీలక నిర్ణయాలు

జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించి ప్రతిపాదనలు తయారు చేసేందుకు కలెక్టర్ మల్లికార్జున నేతృత్వంలో ఇటీవలే నిర్వహించిన జిల్లా టూరిజం కౌన్సిల్(డీటీసీ) సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

- రుషికొండ ప్రాంతంలో యోయో రైడ్స్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. యోయో రైడ్స్ కోసం స్థలం అవసరం ఉన్న నేపథ్యంలో పర్యాటక శాఖకు సంబంధించిన స్థలాన్ని వెంటనే కేటాయించే వీలు లేనందున.. రెవెన్యూ విభాగానికి చెందిన స్థలాలను పరిశీలిస్తున్నారు. యోయో రైడ్స్‌కు అవసరమైన స్థలాలను గుర్తించి వాటిని టూరిజం శాఖకు బదలాయించనున్నారు.
- పారా సెయిలింగ్, పారా మోటార్ ఫ్లైయింగ్, ఏటీవీ బైక్స్‌ను ఏర్పాటు చేసేందుకు కూడా సన్నద్ధమవుతున్నారు. సదరు సంస్థ ప్రతినిధులు ఈ రెండింటికీ ఆర్‌కేబీచ్ అనుకూలమని నిర్ణయించారు. ఈ బీచ్ జీవీఎంసీ పరిధిలో ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారులతో త్వరలోనే బీచ్‌ను పరిశీలించి.. ఏ ప్రాంతం ఈ రెండు సాహస క్రీడలకు అనుకూలమో నిర్ణయం తీసుకోనున్నారు.
- నీరు, రోడ్డు, ఇసుక, గుట్టలపైనా రైడ్ చేయగలిగేలా ఆల్టేరియస్ వెహికల్స్‌ను కూడా పరిచయం చేయనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి ఏపీటీడీసీ ఆధ్వర్యంలో టెండర్లు ఖరారు చేశారు. ఈ టెండర్లను సన్ అడ్వంచెర్స్ సంస్థ దక్కించుకుంది. సాగర్‌నగర్, రుషికొండ తీరాల్లో వీటిని నడపనున్నారు. త్వరలోనే ఇవి కూడా పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆల్టేరియస్ వెహికల్స్‌ను ఆర్కేబీచ్‌లోని టూరిస్టుల కోసం ఏర్పాటు చేయాలని డీటీసీ భావిస్తోంది. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను పర్యాటక శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.
- ఈ సరికొత్త పర్యాటక అనుభూతులు పరిచయం చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్న తరుణంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది. త్వరలోనే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో పాటు జీ–20 సమావేశాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ముందస్తు ప్రోగ్రామ్ షెడ్యూల్ ఖరారైంది. అందుకే ఈ పర్యాటక ప్రాజెక్టుల ప్రారంభానికి అనుమతి కోసం ఎన్నికల సంఘానికి లేఖ రాసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే సదస్సుల ప్రారంభానికి ముందే సాహస పర్యాటకం పర్యాటకులకు అందుబాటులోకి రానుంది.

సాంకేతిక సాయం.. రోడ్లు పదిలం

- కోతకు ఎఫ్‌డీఆర్‌తో చెక్
- నూతన టెక్నాలజీతో నిర్మాణాలు
- ఉమ్మడి పశ్చిమలో 13 రోడ్లకు ప్రతిపాదనలు
- రూ.130 కోట్ల వ్యయ అంచనా
- వంతెనలకు రూ.26 కోట్ల నిధులు



కాళీపట్నం–భీమవరం రహదారి

ఆకివీడు: రాష్ట్రంలో ప్రగతి బాటలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పటిష్టమైన రహదారుల నిర్మాణమే లక్ష్యంగా సరికొత్త టెక్నాలజీని వినియోగిస్తోంది. మెత్తటి నేలల్లో రోడ్లు నిర్మిస్తున్నా.. వర్షాలు పడినా, వరదలు వచ్చినా కొద్దిరోజులకే ఛిద్రం కావడం, గుంతలు పడటంతో పాటు రహదారులు కోతకు గురవుతున్నాయి. ఇటువంటి సమస్యలన్నింటికీ చెక్ పెట్టేలా ఎఫ్‌డీఆర్ (ఫుల్ డెప్త్ రిక్లమేషన్) టెక్నాలజీని వినియోగించాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి రోడ్లను గుర్తించి, వాటిలో అత్యవసరమైన రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. దీనిలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆర్‌అండ్‌బీ శాఖ రాష్ట్ర రహదారులుగా ఉన్న ఆరు రోడ్లు, జిల్లాలోని మేజర్ రోడ్లు ఏడింటిని మొత్తంగా 13 రహదారులను ఎంపిక చేసి రూ.130 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. సుమారు 140 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వ అనుమతి, సాంకేతిక అనుమతి పొందాల్సి ఉంది. అనుమతులు వచ్చిన తర్వాత టెండర్లు పిలిచి ఆయా రోడ్లను కొత్త సాంకేతిక పద్ధతిలో నిర్మించనున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు ఆర్‌అండ్‌బీ, జిల్లాపరిషత్, రాష్ట్ర రోడ్లు పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు ద్వారా రోడ్లను మరింత నాణ్యంగా నిర్మించనుంది.

ఎఫ్‌డీఆర్ టెక్నాలజీ అంటే..

ఫుల్ డెప్త్ రిక్లమేషన్ (ఎఫ్‌డీఆర్) టెక్నాలజీ ద్వారా రోడ్లు పటిష్టంగా ఉండటంతో పాటు గుంతలు పడటం, కోతకు గురికావడం వంటివి ఉండవని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డును సుమారు 250 మిల్లీమీటర్ల నుంచి 300 మిల్లీమీటర్ల లోతులో తవ్వి, వచ్చిన మెటీరియల్‌ను మరాడిస్తారు. దీనికి ప్రత్యేక కెమికల్, సిమెంట్ కలిపి తవ్విన ప్రాంతంలోనే మెషీన్ ద్వారా చల్లుకుంటూ సీపుట్ రోలర్‌తో రోలింగ్ చేస్తారు. అనంతరం రెండు, మూడు అంగుళాల తారు రోడ్డు నిర్మిస్తారు. ఇలా నిర్మించిన రోడ్లపై మూడు రోజుల తర్వాత సాధారణ వాహనాలను, ఏడు రోజుల తర్వాత భారీ వాహనాలను రాకపోకలకు అనుమతిస్తారు. ఈ రోడ్లు 15 ఏళ్లపాటు నాణ్యంగా ఉంటాయి. అలాగే ఎఫ్‌డీఆర్ టెక్నాలజీ పర్యావరణ హితమైనది కూడా కావడం విశేషం

ఎంపిక చేసిన రహదారులు

ఏలూరు జిల్లా: చేబ్రోలు–దేవరపల్లి, పొంగుటూరు–యర్నగూడెం, వడలి–తాడినాడ, నూజివీడు–గన్నవరం, వడ్లమన్నాడ–పెదలంక (స్టేట్ హైవే), గుండుగొలను–కోరుకొల్లు, పొంగుటూరు–లక్కవరం, ఉప్పుటేరు–కలిదిండి (మేజర్ జిల్లా రోడ్లు).

పశ్చిమగోదావరి జిల్లా: కాళీపట్నం–భీమవరం (స్టేట్ హైవే), ఉరదాళ్లపాలెం–దువ్వ, వేల్పూరు–రామేశ్వరం, నవాబుపాలెం–దండగర్ర, అత్తిలి–అలంపురం (మేజర్ జిల్లా రోడ్లు)



ఉప్పుటేరు–కలిదిండి రహదారి

మూడు వంతెనలు

ఉమ్మడి జిల్లాలో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ.26 కోట్ల వ్యయంతో మూడు భారీ వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గణపవరం, నారాయణపురం, గుండుగొలనులో బ్రిడ్జిల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

చురుగ్గా నిర్మాణాలు



కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఉమ్మడి జిల్లాలో మొదటి దశలో రూ.130 కోట్ల వ్యయంతో 13 రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. సాంకేతిక అనుమతి వచ్చిన తర్వాత టెండర్లు పిలుస్తారు. ఉమ్మడి జిల్లాలో వంతెనల నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరయ్యాయి. జిల్లాలో రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి.

–జీవీ భాస్కరరావు, ఎస్ఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, ఏలూరు జిల్లా

పశ్చిమ జిల్లాలో ఐదు రోడ్లు



పశ్చిమగోదావరిలో నూతన సాంకేతికతతో 55.853 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మించనున్నాం. కాళీపట్నం–భీమవరం (15.953 కిలోమీటర్లు), నవాబుపాలెం–దండగర్ర (7.340 కిలోమీటర్లు), వేల్పూరు–రామేశ్వరం (11.100 కిలోమీటర్లు), అత్తిలి–అలంపురం (10.260 కిలోమీటర్లు), ఉరదాళ్లపాలెం–దువ్వ (11.200 కిలోమీటర్లు) రోడ్లను అభివృద్ధి చేయనున్నాం.

–ఎస్.లోకేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారి, పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943